1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 7
పుటలు : 52

రు. 20 లు

తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2019




మాతృభాషా మాధ్యమం: వెంకయ్యనాయుడుగారికి జేజేలు

# "ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంస్కరణ ఉద్యమాలు (1920-41)" పుస్తకావిష్కరణ



డా॥ సింగారెడ్డి ఇన్నారెడ్డి రచించిన "ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంస్కరణ ఉద్యమాలు (1920-1941)" పుస్తకావిష్కరణ సభ 18.8.2019న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. డా॥ సుందర్ కొంపల్లి సమన్వయకర్తగా జరిగిన సమావేశానికి కర్నూలు బిషప్ శ్రీ పూల ఆంతోని అధ్యక్షత వహించగా, ముఖ్య అతిధులుగా ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు శ్రీ కె. శ్రీనివాస్, ప్రఖ్యాత చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, ప్రచురణ సంస్థ ప్రజాశక్తి బుక్‌హౌస్ తరఫున సంస్థ జనరల్ మేనేజరు శ్రీ లక్ష్మయ్య పాల్గొన్నారు. వీరేశలింగం పంతులు తదనంతరం ఆంధ్రదేశంలో కొనసాగిన సంఘ సంస్కరణోద్యమాల చరిత్రను ఈ గ్రంథం ఏడు అధ్యాయాల్లో కూలంకషంగా వివరించింది. మహిళా ఉద్యమాలు, బ్రాహ్మణేతరోద్యమం, గోరా నాస్తికోద్యమం కొనసాగిన తీరు, వాటి ప్రభావాన్ని విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా వివరించడంలో రచయిత కృషి అమోఘమని వక్తలు పేర్కొన్నారు. పరిశోధకులకు, తెలుగు చదువరులకు ఈ గ్రంథం ఒక దిక్సూచిగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ప్రామాణిక మౌలిక ఆధారాలపై ఆధారపడ్డ ఈ గ్రంథం తెలుగుజాతి చరిత్రపై ఆసక్తి ఉన్నవారందరికీ ఎంతో ఉపయుక్తం.

# కీ.శే. మండలి వెంకట కృష్ణారావు 2019 సంస్కృతి పురస్కారాన్ని విస్కాన్సిన్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు వెల్చేరు నారాయణరావుగారికి ప్రదానం



మండలి వెంకట కృష్ణారావు గారి కుమారుడు, మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ ఉపసభాపతి డా. మండలి బుద్ధప్రసాద్ గారు తండ్రి అడుగుజాడలలో నడుస్తూ, తండ్రిగారి నుంచి వార సత్వంగా లభించిన తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేస్తూ, ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. బుద్ధప్రసాద్ గారు, తండ్రి గారి పేర పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఒక అవార్డును నెలకొల్పి, స్వంత ఖర్చులతో ప్రతి సంవత్సరం ఆగష్టు 4వ తేదిన వచ్చే మండలి వెంకట కృష్ణారావు గారి జయంతిని పురస్కరించుకుని ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోనూ తెలుగు భాషా సంస్కృతులకు విశేషమైన సేవలందిస్తున్న ప్రముఖుల నుంచి ఒకరిని ఎంపిక చేసి, ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డుకు ఈ సంవత్సరం అమెరికాలో విస్కాన్సిన్ విశ్వ విద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేసిన ప్రసిద్ధ కవి, బహు గ్రంథకర్త, సాహిత్య విమర్శకులు ఆచార్య వెల్చేరు నారాయణరావుగారు ఎంపికైనారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2019 ఆగష్టు 5వ తేదిన సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపాధ్యక్షులు శ్రీ వి.అనిల్ కుమార్ ఐ.ఎ.ఎస్ అధ్యక్షత వహించగా, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా. కే.వి.రమణాచారి, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ సినీనటుడు డా. బ్రహ్మానందం విశిష్ట అతిథిగా డా. మండలి బుద్ధప్రసాద్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత చరిత్ర ప్రొఫెసర్ డా. వకుళాభరణం రామకృష్ణ ఆత్మీయ అతిధులుగానూ పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. సత్తిరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. "2019 మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారా"నికి ఎంపికైన ఆచార్య వెల్చేరు నారాయణరావు గారిని సత్కరించి, రూ. 25 వేల నగదును, జ్ఞాపికను బహూకరించారు.

మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కార గ్రహీత ఆచార్య వెల్చేరు నారాయణరావు స్పందిస్తూ, తెలుగు సాహిత్యం ఎంతో విస్తృతమైనదని, ఎంతో పురాతనమైనదని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కవులతో సమానమైన స్థాయిలో మన కవులు సాహిత్యాన్ని వెలయించారని, అయితే దానికి తగిన గుర్తింపు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దానికి కారణం మన సాహితీ వేత్తలే అని కూడా ఆయన అన్నారు. మన సాహితీవేత్తలు శ్రీనాథుడు చాలా గొప్పవారంటారు. అయితే, ఆయన గొప్పతనం ఏమిటో చెప్పరు. ఇందువలన మన సాహిత్యానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లేకుండా పోయింది. ఆ ప్రయత్నం మన సాహితీ విమర్శకులలో కేవలం ఒక విశ్వనాథ సత్యనారాయణ గారు మాత్రమే చేశారు. మిగతా సాహితీవేత్తలెవరూ చేయలేదు. తెలుగు సాహిత్యంలో విమర్శ స్థాయి బాగా పెరగవలసిన అవసరం ఉందని అంటూ, ఆ ప్రయత్నాన్ని తాను కొంత వరకు కొనసాగించానని అన్నారు. సాహితీ విమర్శ ఏ భాషలో చేశామన్నది ప్రధానం కాదు. ఏ భాషలో ఉన్నప్పటికీ అది ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంది. కాబట్టి మన సాహితీ వేత్తలందరూ ఈ విషయాన్ని గుర్తించి నిర్మాణాత్మకమైన సాహితీ విమర్శ చేసిననాడు, మన తెలుగు సాహిత్యం కూడా ప్రపంచ స్థాయిలో గుర్తింపును పొందుతుందని ఆయన ఉద్బోధించారు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




సెప్టెంబరు 2019

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....




రేఖాచిత్రాలు, ముఖచిత్రం
**పావులూరి చిదంబరేశ్వరరావు**

కంప్యూటరీకరణ
**లంకె జనార్దన్**


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అకౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1.

గారపాటి ఉమామహేశ్వరరావుగారికి
'తానా'వారి
గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం 2019

## ఆహ్వానం



'తానా' వారి గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం 2019కు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారిని ఎంపిక చేసిన విషయం 'అమ్మనుడి' పాఠకులకు తెలిసిందే. (జులై 2019 సంచికలో ప్రకటించాము) వాషింగ్టన్ డిసిలో 2019 జులై 4,5,6 తేదీలలో తానా 22వ మహాసభలు జరిగిన సందర్భంగా ఈ పురస్కారాన్ని వీరికి ప్రకటించారు.

**ఈ పురస్కారాన్ని**
**2019 అక్టోబర్ 4వ తేదీన**
**తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) అధ్యక్షులు శ్రీ జైశేఖర్ తాళ్లూరి స్వయంగా విజయవాడలో అందజేస్తారు.**
**ఈ సందర్భంగా విజయవాడలోని హోటల్ ఐలాపురం లో 4.10.2019 సాయంత్రం గం.5.30కు జరుగబోయే సభకు తాము విచ్చేయవలసిందిగా అందరినీ కోరుతున్నాము.**

సంపుటి : 5 సంచిక : 7
అమ్మనుడి
సెప్టెంబరు 2019

సంపాదకీయం

# మాతృభాషా మాధ్యమం : వెంకయ్యనాయుడుగారికి జేజేలు

**భారత ఉపరాష్ట్రపతి** ముప్పవరపు వెంకయ్యనాయుడుగారు ప్రాథమిక విద్య తెలుగులోనే ఉండాలని సందర్భం వచ్చినపుడల్లా చెబుతున్నారు. మాతృభాషలోనే ప్రాథమిక విద్యాబోధన జరగాలనే హేతుబద్ధ సందేశాన్ని పాలకులను ఉద్దేశించి స్పష్టంగా ప్రకటిస్తున్నారు. మొన్న ఆగస్టు 29న విశాఖపట్నం సమీపంలో 'సమీర్' విశాఖ విభాగంలో విద్యుదయస్కాంత పర్యావరణ ప్రభావాల కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంలో – ఆ రోజు తెలుగు భాషా దినోత్సవం అనీ, గిడుగు జయంతి అనీ గుర్తుపెట్టుకొని మాట్లాడారు. ప్రాథమిక విద్యను రెండు తెలుగురాష్ట్రాల్లోనూ తెలుగులోనే బోధించాలని అక్కడ కూడా విస్పష్టంగా చెప్పారు.

విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే – ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఇప్పుడున్న ప్రభుత్వాలు తెలుగు మీడియంను పూర్తిగా రద్దు చేశాయి. ఎవరైనా తమ బిడ్డలను తెలుగు మాధ్యమంలో చదివించాలనుకొన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా ప్రవేశం దొరకని స్థితి! ప్రభుత్వేతర పాఠశాలల్లో పొరపాటున ఎక్కడైనా ఉందేమో వెతుక్కోవాలి! భాషా ప్రాతిపదికన ఏర్పడిన తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఇది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య తొలినుండీ ఈ అంశంపై పట్టుబడుతూనే ఉంది. మొత్తం తెలుగు రాష్ట్రమంతటా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలన్నిటిలోనూ ప్రాథమిక విద్య (1నుండి 5) ను మాతృభాషలోనే బోధించడాన్ని తప్పనిసరి చెయ్యాలని కోరుతూనే ఉంది. ఈ విన్నపంతోనే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) వేయగా కోర్టు అనుమతించలేదు.

భారత రాజ్యాంగం 350–ఎ అధికరణంలో – 'భాషాపరమైన మైనారిటీలకు ప్రాథమిక స్థాయిలో వారి మాతృ భాషలోనే విద్యా బోధన జరిగేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను, అవకాశాలను కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక సంస్థల బాధ్యత అనీ, ఇందుకు సంబంధించి రాష్ట్రములకు రాష్ట్రపతి తగు ఆదేశాలను జారీ చేయవచ్చును' అనీ స్పష్టంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ విద్యాహక్కు చట్టంలోనూ, ఇప్పుడు కేంద్రం ప్రతిపాదించిన కొత్త విద్యావిధానంలోనూ – ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించవలసిన అంశాన్ని ప్రస్తావించారు.

ఈ అంశం కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్నందువల్ల కేంద్రం చొరవతో శాసనం చేయడానికి ముందుకు రావడం లేదు. రెండు దశాబ్దాలుగా 'సరళీకరణ, ప్రయివేటీకరణ, అంతర్జాతీయకరణ' దిశగా వచ్చిన మార్పుల్లో విద్య వ్యాపారంగా మారిపోయి, ఇంగ్లీష్ మీడియం పట్ల మోజు పెరిగిపోతున్నది. ఈ విద్యా వ్యాపారంలో రాజకీయ నేతల భాగస్వామ్యం ఉంది. దీనితో ప్రభుత్వాలకు విద్యావిధానం పైనా, భాషావిధానం పైనా నిబద్ధత లేకుండా పోయింది. రాజకీయ, ఆర్థిక అవసరాల ముందు ప్రజా శ్రేయస్సు, జాతి శ్రేయస్సు నిర్లక్ష్యానికి గురి అయినాయి. ఇంగ్లీష్ మీడియం అనే నినాదం ప్రజల ఓట్లు పొందేందుకు ఒక సాధనంగా అధికార పార్టీలు భావిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చెయ్యడానికి మన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏ మాత్రమూ సిద్ధంగా లేవు.

అందువల్ల ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చను చేపట్టవలసిన అవసరం ఉందని మేము భావిస్తున్నాం. ఇందుకు భారత ఉపాధ్యక్షులు వెంకయ్యనాయుడుగారి స్థాయిలో పూనుకొని, కేంద్ర పాలకులతోను, రాష్ట్రాలతోనూ మాట్లాడి, ఈ అంశంపై వారి దృష్టిని సారింపజేయవలసిన అవసరం ఉంది. ఇందుకోసం అవసరమైతే విద్యావేత్తలను కూడా ఈ చర్చల్లోకి తేవలసిన అవసరం ఉందేమో పరిశీలించాలి.

యునెస్కో ప్రతి ఏడాదీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించవలసిన అవసరాన్ని హెచ్చరిస్తూనే ఉంది. అనేక దేశాలు ఈ విషయంలో సానుకూలంగా స్పష్టమైన విధానాలతో ముందుకు వెళ్తున్నాయి. ఈ పరిస్థితుల్లో చొరవతీసుకొని ఒక జాతీయ విధానాన్ని రూపొందించాలి. చట్టరీత్యా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకూ రాజ్యాంగంలోని అస్పష్టతల్ని సవరించడానికీ పూనుకోవలసిన అవసరం ఉందేమో పరిశీలించాలి కూడా.

మాన్యులు శ్రీ వెంకయ్యనాయుడుగారు ఈ విషయంలో చూపుతున్న శ్రద్ధ, ఆలోచనాపరుల అభినందనలనందు కొంటున్నది. వారి కృషి సఫలం కావాలని కోరుకొంటూ వారికి జేజేలు తెలుపుతున్నాము...

తేదీ : 31–8–2019

సామల రమేష్‌బాబు

# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
# గౌరవనీయులు శ్రీ వై. ఎస్. జగన్మోహనరెడ్డి గారికి

అయ్యా,

## మన మాతృభాష తెలుగు పరిరక్షణకై ప్రభుత్వ చర్యలు - విన్నపం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత తాము అన్ని రంగాలపై దృష్టి సారిస్తూ సంచలనాత్మక నిర్ణయాలు ప్రకటిస్తున్నారు. సామాజికరంగంలో - ముఖ్యంగా మద్యపాన మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని క్రమంగా విముక్తం చేయడానికై ఒక ప్రత్యేక విధానాన్ని చేపట్టారు. ఇదేవిధంగా విద్యారంగానికి సంబంధించి - ముఖ్యంగా అట్టడుగువర్గాల, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు మధ్యలో చదువులు మానివేయడాన్ని నిరోధించడంతోపాటు కోరుకున్నవారందరికీ ఉన్నత చదువులు అందుబాటులోకి తెచ్చేందుకు కూడా కొన్ని ప్రోత్సాహకాల్ని ప్రకటించి వారిలో భరోసా కలిగించగలిగారు.

ఈ సందర్భంలో మరొక ముఖ్యమైన విషయాన్ని క్లుప్తంగా తమకు నివేదిస్తున్నాం. భాషారాష్ట్రాల ఏర్పాటులో తొలి రాష్ట్రం మన తెలుగువారిది. ప్రజల భాషలో పరిపాలనా వ్యవహారాలను పూర్తిగా నిర్వహించుకోవడమనే మౌలిక సూత్రాన్ని పూర్తిగా అమలుచేయడంలో ఇన్నేళ్లుగా పాలకులు తగు శ్రద్ధ చూపకపోవడం వల్ల - ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లయింది. ఈ విషయంలో కూడా చూపు సారించి నిర్ణయాలు గైకొంటున్నందుకు తాము ప్రజల అభినందనలను అందుకుంటున్నారు.

మరొక ముఖ్యమైన అంశం - మాతృభాషలో విద్యాబోధన సంగతి. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. తెలుగును ఒక భాషగా మాత్రమే పాఠశాల విద్యలో బోధించాలని, బోధనామాధ్యమంగా 1 నుండి 10 వరకు ఇంగ్లీషే వుంటుందని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కేవలం ఒక భాషగా మాత్రమే తెలుగును బోధించినందువల్ల అది ఒక ఆధునికమైన భాషగా, సంపూర్ణమైన భాషగా, ప్రజల అవసరాలను తీర్చగల భాషగా ఎదగజాలదు. అన్నిరంగాలలో వినియోగించగల భాషకు మాత్రమే అభివృద్ధి వుంటుంది. కేవలం సాహిత్యభాషగా కాక ఆధునికభాషగా ఎదిగితేనే నేటి పరిస్థితులలో అది నిలువగలుగుతుంది. తోటి భాషారాష్ట్రాలను, ఇతర దేశాలను ఈ విషయంలో మనం ఆదర్శంగా తీసుకోవాలి. ఈ సందర్భంగా తమకు మా విజ్ఞప్తి ఏమిటంటే - పాఠశాల స్థాయిలో కనీసం ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి. విద్యాహక్కుచట్టం, కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన విద్యావిధానం, యునెస్కో అనేక సంవత్సరాలుగా చేస్తున్న విజ్ఞప్తి, మేధావుల, విద్యానిపుణుల అభిప్రాయలు ఇదే అంశాన్ని నొక్కివక్కానిస్తున్నాయి. ప్రాథమికవిద్యను విద్యార్థి మాతృభాషలోగాక పరభాషలో నేర్పడం అశాస్త్రీయం, అమానవీయం, అర్థరహితం కూడా అని మనవి చేస్తున్నాము. కనుక తాము ఒక శాస్త్రీయమైన పంథాను చేపట్టి, కనీసం 5వ తరగతి వరకు మాతృభాషామాధ్యమంలో బోధనను తప్పనిసరి చేస్తూ ఇంగ్లీషు భాషను, దానితోపాటు ఒకటి లేక రెండు ఇతర భాషలను కూడా నేర్పవచ్చు. బోధనామాధ్యమంగా మాత్రం పరభాషలను పసివారిపై రుద్దకూడదని మనవి చేస్తున్నాము.

ఒక భాషగా తెలుగును బోధించడాన్ని పాఠశాల విద్యలో తప్పనిసరి చేస్తున్న జి.వో.నెం.86/2003 ను గాని, ఆ తరువాత వివిధ సమయాలలో ప్రభుత్వాలు ఇదే విషయంపై జారీచేసిన అనేక ఉత్తర్వులను గానీ ఏనాడూ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేసిన దాఖాలాలు లేవు. మొక్కుబడి చదువుగా మాత్రమే తెలుగు బోధన మిగిలిపోయింది. అందువల్లనే తెలుగువారి పిల్లలు పాఠశాల విద్యలో తమ మాతృభాష తెలుగులోనే పరీక్షల్లో చతికిలబడుతున్నారు. ఈ విషయాన్ని తమరు గమనించాలి. బోధనను పటిష్టపరచాలి. ప్రాథమిక విద్యనైనా తెలుగు మాధ్యమంలో బోధించాలన్న విజ్ఞప్తిని తాము పరిశీలించాలని ఈ విషయమై ఈ నెల 29న 'గిడుగు రామమూర్తిగారి జయంతి' సందర్భంగా జరుగబోతున్న ప్రభుత్వ అధికారసభలో తాము తమ అభిప్రాయాలను ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నాము.

తెలుగు ప్రజల అభివృద్ధికి అంకితమైన తాము జాతికి మూలమైన తెలుగు భాషకు జవసత్వాలను ప్రసాదించడంపై కూడా మనసుపెట్టాలని కోరుతున్నాము.

ధన్యవాదాలతో...

భవదీయుడు

సామల రమేష్‌బాబు

(డా. సామల రమేష్‌బాబు)

తేదీ : 28-8-2019

అధ్యక్షుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య

ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి
9440493604

# తెలుగాంగ్ల మిశ్ర సమాసాలు-సామాసిక కార్యాలు

మొదట ఇక్కడ వ్యాసానికున్న శీర్షికలో తెలుగాంగ్ల మిశ్ర సమాసాలు అని చెప్పాను. అవి ఏమిటో వివరించే ముందు ఈ పదం 'తెలుగాంగ్ల' ఎలా ఏర్పడిందో చెప్పాలి.

చిన్నయసూరి బాలవ్యాకరణంలో సంధిపరిచ్ఛేదం మొదటి సూత్రమే "ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు" మొదటి పదం చివరలో 'ఉత్తు' అంటే హ్రస్వ ఉకారం ఉండి, దానితర్వాత కలిసే పదం మొదటి వర్ణంగా అచ్చు ఉంటే దానికి సంధి జరుగుతుంది అని దీని అర్థం. ఈ సూత్రం చెప్పిన తర్వాత వృత్తిలో సూరి ఇంకా వివరం ఇచ్చాడు. "పూర్వపరస్వరంబులకు బరస్వరంబేకాదేశం బగుట సంధి యనంబడు" అని వివరించాడు. పైన 'తెలుగాంగ్ల' అనే సంధిలో 'తెలుగు' 'ఆంగ్ల' అనే రెండు పదాలున్నాయి. ఆంగ్లము అనే పదం ఇంగ్లీషుకు మనం తయారు చేసుకున్న తెలుగు పదం. ఇక్కడ సూత్రంలో చెప్పినట్లు మొదటి పదం చివరలో ఉత్తు ఉంది. ఇక రెండో పదం చివరలో అచ్చు 'ఆ' ఉంది. అంటే ఇక్కడ రెండు పదాల కలయిక పైన చెప్పిన సూత్రంతో చక్కగా సరిపోతుంది అని స్పష్టం. అలా సంధి జరిగినప్పుడు పరస్పరమైన ఆ ఏకాదేశమై 'తెలుగాంగ్ల' అనే సంధి జరిగి, ఈ పదబంధం ఏర్పడుతుంది. వ్యాకరణ నియమాల ప్రకారమే తెలుగాంగ్ల తయారైంది. ఇక తెలుగాంగ్ల మిశ్రసమాసాలేమిటో చూద్దాం.

భాష నిత్యం మార్పునకు లోనవుతూ ఉన్న ప్రవాహం. భాషలో పరిణామాలు ఇటీవలి కాలంలో చాలావేగంగా జరుగుతున్నాయి. ఒకప్పుడు సాహిత్యంలో పరిణామాలు వేగంగా వస్తుంటే భాషలో పరిణామాలు చాలా అలస్యంగా జరిగేవి. కాని నేడు భాషలో పరిణామాలు కూడా చాలా వేగంగా జరుగుతున్నాయి. దీనికి చాలా కారణాలున్నాయి. సమాజంలో వస్తున్న పరిణామాలు చాలా వేగంగా రావడంతో ఆ వేగంతో భుజం కలుపుతూ భాషలో కూడా పరిణామాలు వేగంగా వస్తున్నాయి. అది ఎలా జరుగుతూ ఉందో చూద్దాం.

నిత్యజీవనానికి చెందిన విషయాలలో ఒక ఉదాహరణ గ్రహిస్తే భాషావినియోగంలో వచ్చిన మార్పును ఇక్కడ గ్రహించవచ్చు. ఇంతకు ముందు గ్రామాలలో పాలు అమ్మేవారు కారు. గిద్దె రెండుగిద్దెల పాలు పొరుగువారికి ఊరికినే పోశేవారు. క్వచిత్తుగా అమ్మేవారు. ఆయా ఇండ్లలో పాడి చేసుకుంటూ, వారి పాలను వారే వినియోగించుకునేవారు. కొందరు పాడి లేనివారు ఉండేవారు. కొందరు తమ అవసరాలకన్నా తమ పాడిలో అధికంగా పాలు వచ్చేవారు ఉండేవారు. ఇలాంటి వారి దగ్గరనుండి లేనివారు అక్కడి కక్కడే కొనుక్కునే వారు. కాని, పల్లెలలో ఈ పరిస్థితి మారింది. ప్రతి పల్లెలో పాల కేంద్రం, ఎవరో ఒక వ్యక్తి నిర్వహించేది ఒకటి, వచ్చింది. జనం పాలు తెచ్చి 'పాలకేంద్రం'లో పోస్తున్నారు. ఆ పాలను 'పాలమీటరు'తో కొలిచి, వెన్నశాతం నిర్ణయించి, ఆయా ఇండ్లవారికి డబ్బులు చెల్లిస్తాడు ఆ కేంద్రం వ్యక్తి. ఆ పాలను 'పాలక్యాను'లో పోసుకొని, 'పాలవ్యాను'లో పక్కనున్న బస్తీకి తీసుకుపోయి అమ్ముతాడు. ఊరులో పాలు లేనివారికి, ఉన్న వారు విడిగా అంటే చిల్లరగా అమ్మరు. దీనిఫలితంగా పాడిలేనివారు అదే గ్రామంలో ఉన్న షాపుకు వెళ్ళి 'పాకెట్‌పాలు' కొనుక్కోవలసి వస్తూ ఉంది. ఈ 'పాలపాకెట్లు' దగ్గరలో ఉన్న బస్తీ నుండి పల్లెలకు వస్తున్నాయి. ఈ పాకెట్లు క్రేట్లలో వస్తాయి. ఈరోజున గ్రామాల ప్రజలు పాలు బస్తీకి అమ్ముతున్నారు. పాకెట్లలో పాలు బస్తీనుండి కొనుక్కుంటున్నారు తిరిగి పల్లెవాసులు. పాలపరిశ్రమలు పెరిగాయి. ఇంతకుముందు డెయిరీ ఇండస్ట్రీ ఒకటే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండేది. పాలశీతలీకరణ కేంద్రాలు అని క్లుప్తంగా పాలకేంద్రం అని అనేవారు. కాని నేడు ప్రైవేటు డెయిరీలు చాలా వచ్చాయి. ప్రతి పల్లె నుండీ ఇదే వ్యాపారం సాగుతూ ఉంది. ఈ సామాజిక పరిణామంవల్ల భాషలో వచ్చిన పరిణామాన్ని ఒక్కసారి ఇక్కడ చూడవచ్చు. **పాలక్యాను, పాలమీటరు, పాలపాకెట్టు, పాలక్రేట్లు పాలవ్యాను, పాలట్యాంకరు** ఇన్ని కొత్తపదాలు తెలుగు వినియోగం లోనికి వచ్చాయి. ఈ పదాలను గమనిస్తే పూర్వపదంగా పాలు అనే పదం ఉంది ఇక ఉత్తరపదాలు అన్నీ ఇంగ్లీషుపదాలే. తెలుగు ఇంగ్లీషు పదాలతో సమాసాలు ఏర్పడ్డాయి. ఇలా సమాసాలు చేయమని ప్రజలకు ఎవరూ చెప్పలేదు. లేదా ఇంగ్లీషు పదాలను తెలుగు లోనికి అనువాదం చేసుకొని వినియోగించుకోవాలని వారు భావించలేదు. వారి జ్ఞానంలోనికి వచ్చిన ఇంగ్లీషు పదాన్ని నేరుగా తెలుగు పదంతో కలిపి వాడారు. ఇలా వాడ వద్దు ఇంగ్లీషు పదాన్ని తెలుగు చేసుకొని వాడుకోమని ఎవరైనా పండితుడు చెప్పినా లేదా ప్రభుత్వం వారు నిర్దేశించినా ఫలితం ఉండదు. జనవ్యవహారాన్ని ఎవరూ మార్చలేరు. అంటే ఇది అనివార్యంగా జరుగుతూ ఉన్న భాషాపరిణామం అని అర్థం చేసుకోవాలి. అంతే కాని భాషావేత్తలు ఇక్కడ తెలుగు సంకరం అవుతూ ఉందనో లేదా చెడిపోతుందనో అనుకో కూడదు. దీన్ని సహజపరిణామంగానే భావించి భాషలో ఇలా అనివార్యంగా వస్తున్న పరిణామాలను విశ్లేషించవలసి ఉంటుంది.

తెలుగు ఇంగ్లీషు మిశ్రసమాసాలు ఏర్పడడానికి మరొక బలమైన కారణం ఉంది. జనవ్యవహారం మొదటిది అయితే రెండో ప్రధానమైంది పత్రికా రచన. దినపత్రికల అవసరాలు ప్రతిదినం పెరుగుతుంటాయి. కారణం ప్రతిదినం కొత్త ఘటనో ఆవిష్కరణో కొత్తతరహా వార్తో వస్తూ ఉండడం, అందుకోసం కొత్త పదాలను వెతుక్కుంటూ ఉంటుంది పత్రికా రంగం, అనువాదం చేసుకుంటుంది. కొన్ని పదాలు పదబంధాలు నిలబడి స్థిరపడతాయి. మరికొన్ని ఆ ఒకటి రెండు రోజులు అవసరం తీరిన తర్వాత మరుగున పడతాయి.

ఈ రెండింటి తర్వాత తెలుగాంగ్ల మిశ్రసమాసాలు ఏర్పడడానికి మరొక ప్రబలమైన శక్తి దృశ్యమాధ్యమం.

ఉపగ్రహఛానళ్ళు ప్రతి గ్రామంలో, కొండకోనల్లోనూ వ్యాప్తి చెందడం, మాధ్యమాలభాష జనవ్యవహారంపైన చాలా తీవ్రమైన

ప్రభావం వేయడం కారణాలుగా జనవ్యవహారంలో తెలుగు భాష చాలా వేగంగా పరిణామం చెందుతూ ఉంది.

సమాసాలకు చెందిన వ్యాకరణం మన సంప్రదాయ వ్యాకరణాలు అప్పటి ఆంధ్రశబ్దచింతామణి, కేతన వ్యాకరణం ఆంధ్ర భాషా భూషణము దగ్గరనుండి ఇటీవలి చిన్నయసూరి వ్యాకరణంవరకు అన్నీ వివరించి చెప్పాయి. సమాసాలలో రకాలు ఎన్ని ఉంటాయి వాటి లక్షణాలు ఏమిటి అని పూర్తిగా వ్యాకరించి చెప్పాయి. అలా సమాసాలు ఏర్పడేటప్పుడు పూర్వపదాంతంలో పరపదం ఆదిలో ఏమి మార్పులు జరుగుతాయో వాటిని సమాసకార్యాలు అని అన్నారు. ఇలా జరిగే మార్పులను చాలా సూత్రాలలో వింగడించి వ్యాకరించాయి బాల ప్రౌఢ వ్యాకర ణాలు. ఇదే విధంగా తెలుగుఆంగ్ల మిశ్రసమాసాలు ఏర్పడేటప్పుడు పదాలలో వచ్చే మార్పులను సామాసిక కార్యాలు అని ఇక్కడ అంటున్నాను. వాటిని పరిశీలించే లక్ష్యమే ఈవ్యాసం.

**సమాసకల్పనలో పదపరిణామం - సామాసికకార్యాలు:**

సమాసకల్పనలో అంటే సమాసాలు కూర్చే క్రమంలో పదాలలో వచ్చే మార్పులనే సామాసికకార్యాలు అని అంటున్నాము. పైన చెప్పిన కారణాలవల్ల ఒక తెలుగు పదం మరొక ఇంగ్లీషు పదంతో ఉన్న సమాసాలు అటు జనవ్యవహారంలోను ఇటు మాధ్యమాల భాషలోను శరపరంపరగా వస్తున్నాయి. ఒక సంవత్సరం పాటుగా నేను పరిశీలించి సేకరించినవి 1200 సమాసాలు దాటాయి. ఇలా సేకరించే సందర్భంలో అధిక కాలంపాటు ఉనికిలో ఉండే సమాసాలనే గ్రహించాను. వార్తలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఉనికిలో ఉండే వాటిని చేర్చలేదు. ఇలాంటి సమాస కల్పన ఆగకుండా సాగే భాషాప్రవాహక్రమం. ఇంకా కొంత కాలానికి మరికొన్ని వందల తెలుగాంగ్లమిశ్రసమాసాలు చేరవచ్చు. ప్రస్తుతానికి ఈ పన్నెండు వందల సమాసాలతోనే వివరణ వాక్యాలు అర్థాలతో నిఘంటువును నిర్మిస్తున్నాను. నేను చేసిన ఈ సమాసాల పరిశీలనలో వచ్చిన పదపరిణామాలను కింద పరిశీలి స్తున్నాను.

తెలుగాంగ్లమిశ్రసమాసాలలో మొదటి పదం తెలుగు ఉండవచ్చు. లేదా మొదటి పదం ఇంగ్లీషు పదం ఉండి రెండోది తెలుగు పదం ఉండవచ్చు. క్వచిత్తుగా మధ్యలో తెలుగు పదం ఉండి అటు ఇటు ఇంగ్లీషు పదాలు ఉండవచ్చు. మధ్యలో ఇంగ్లీషు పదం ఉండి అటు ఇటు తెలుగు పదాలు ఉండవచ్చు. ఇలా ఏర్పడిన సమాసాలలో పదాలలో ఎలాంటి మార్పులు ఏర్పడుతున్నాయో చూద్దాం.

**పూర్వపదంగా తెలుగు:**

ఉన్న సమాసాలలో దాదాపుగా సగం సమాసాలు తెలుగు పూర్వపదంతో ఉన్నవే ఉన్నాయి. తెలుగు పూర్వ పదంగా ఉండి ఉత్తర పదం ఇంగ్లీషుగా ఉన్నప్పుడు తెలుగు పదాలలో మార్పులు పెద్దగా రావడం లేదు. ఇంగ్లీషు పదాలలో కూడా అవి వ్యస్తంగా ఉన్నప్పుడు ఎలా ఉచ్చరిస్తారో అలాగే ఉంటున్నాయి. తెలుగు పూర్వపదాలుగా ఉన్నప్పుడు ఎక్కువగా తత్సమ పదాలు ఉన్నాయి. ఆచ్చిక పదాలు ఉన్నా వాటిలో మార్పు కన్నా తత్సమపదాలనే ఎక్కువగా గమనించవలసి ఉంటుంది.

తత్సమ పదం పూర్వపదంగా ఉన్నప్పుడు అది తెలుగులో ఉండే విధంగా కాక సంస్కృత సిద్ధసమాసంలో ఏ ప్రాతిపదికతో ఎలా ఉంటుందో అలా సమాసంలో ఉండడం విశేషంగా చెప్పాలి. కింద కొన్ని ఉదాహరణలను పరిశీలించవచ్చు.

**ఆంధ్రాబ్యాంకు**

**క్రీడాఅవార్డు**

**మహిళాకండక్టర్**

**కృష్ణాబేసిన్**

**పరిపాలనాట్రిబ్యునల్**

**భారీమిషనరీ**

**భూమాఫియా**

పైన సమాసాలను ఒకసారి గమనిస్తే పూర్వపదంగా ఉన్న తత్సమపదాలు అన్నీ దీర్ఘాంతంగా ఉన్నాయి. సంస్కృత సిద్ధసమాసాలలో ఉన్నప్పుడు ఈపదాలు ఎలా దీర్ఘాంతాలుగా ఉంటాయో అలాగే తీసుకుని సమాసం చేయడం గమనించవచ్చు. విడిగా పిలిచినప్పుడు క్రీడ, మహిళ, కృష్ణ, పరి పాలన, భారీ, భూమీ ఇలా ఉండేవి. కాని ఇవి సంస్కృత సమాసాలలో దీర్ఘాంతాలుగానే సమసిస్తాయి. ఇక్కడ ఈ మిశ్రసమాసాలలో కూడా ఈ పదాలను సిద్ధసమాసాలలో మాదిరిగానే దీర్ఘాంతాలుగానే ఉన్నాయి. ఈ ధోరణిని బట్టి:

"సిద్ధసమాసాల దీర్ఘాంతాలు తెలుగాంగ్లసమాస పూర్వపదంలో నిలుస్తాయి". అని ఒక సూత్రంగా ఈ పరిణామాన్ని భావించవచ్చు.

ఇప్పటికే వ్యాకర్తలు గుర్తించినట్లు ఆచ్చిక పదాలలో దీర్ఘాంతాలు మృగ్యం. దీర్ఘాంతాలైన అన్యదేశ్యాలు అంటే ఊర్దూనుండి వచ్చిన దీర్ఘాంతాలుంటే అవికూడా అలాగే ఉండడం గమనించవచ్చు.

**తయారీ**

**నకిలీ**

ఇలాంటి ఉర్దూ అన్యదేశ్యాలు కూడా దీర్ఘాంతాలుగానే సమసించాయి.

తత్సమ పదాలు దీర్ఘాంతాలు కాక హ్రస్వాంతాలు ఉండి చివరలో ప్రత్యయంతో ఉండే పదాలు సమాసంలో ప్రత్యయం లోపించి హ్రస్వంగా అదే విధంగా మిగిలి ఉండడం గమనించవచ్చు:

**అంతర్జాతీయస్టేడియం**

**అంతర్జాతీయక్రీడలు**

**అక్రమకనెక్షన్లు**

**అతిముఖ్యఫైళ్ళు**

**అత్యధికడిమాండు**

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

**అత్యవసరలాండింగ్**

**అధ్భుతగ్రాఫిక్స్**

**అధికారపార్టీ**

**గ్రామీణబ్యాంకు**

**జాతీయకమిటీ**

ఇలా చాలా సమాసాలను చూపవచ్చు.

ఇలా ఆచ్చిక పదాలలో ప్రత్యయం లోపించి మీది పదంతో సమసించడం కనిపిస్తుంది. కాబట్టి:

"తత్సమ ఆచ్చిక పదాలు పూర్వపదాలుగా ఉన్నప్పుడు ప్రత్యయం లోపిస్తుంది" అని ఒక సూత్రంగా భావించవచ్చు.

**ఉత్తరపదంగా తెలుగు :**

ఉత్తరపదంగా తెలుగు ఉన్నప్పుడు సాధారణంగా తెలుగులో అవి ఎలా ప్రవర్తిస్తుంటాయో అదే విధంగా ఉంటాయి. పదాది అచ్చుతో క్వచిత్తుగా సంధిజరగడం కనిపిస్తుంది. ఇదీ చాలా అరుదు. గవర్నరాదేశం అని ఉంది. ఇలాంటి సంధులు చాలా అరుదుగా జరుగుతాయి. దీనికి కారణం ఉంది. ఇంగ్లీషు పదాలు ఎక్కువ హలంతపదాలుగా ఉంటా యి. హలంత పదం ఇంగ్లీషుది వచ్చిన తర్వాత వచ్చే తెలుగు పదం ముందున్న హల్లుతో సంధి జరగక తెలుగు పదం విడిగానే ఉచ్చరిం చడం, రాయడం ఉంటుంది. ఉత్తర పదం అచ్చు ఉన్నప్పుడే పూర్వపు హల్లుతో కలిపి పలకడం ఉంటుంది. కాని రాయడంలో విడివిడిగానే రాయడం గమనించవచ్చు ఉదా : కాల్ + చేయు = కాల్చేయు, అంటే ఫోన్‌తో కాల్ చేయడం అన్నమాట. ఈతరహా హల్‌సమీకరణం సమాసాలలో చూడవచ్చు. కాని ఇది మౌఖిక ఉచ్చారణలో ఉంటుంది.

**పూర్వపదంగా ఇంగ్లీషు:**

పైనచెప్పినట్లుగా ఇంగ్లీషు పూర్వపదంగా ఉన్నప్పుడు, అధికంగా హలంతం పదాలు ఉండి యథాతథంగా పలికినట్లే రాయడం మనకు కనిపిస్తుంది. ఇలాంటివే మనకు ఎక్కువగా ఉంటాయి.

అసైన్డ్, కమిషన్, కంప్యూటర్, జాయింట్, కస్టమర్, కన్జూమర్, కాన్సర్ ఇలా హలంతాలన్నీ యథాతథంగా ఉంటాయి. ఉదాహరణ: **అసైన్డ్‌భూమి, కమిషన్‌కాకతీయ, కమిషన్ భగీరథ, జాయింట్ ఖాతా, కస్టమర్‌తృప్తి, కన్జూమర్‌సౌకర్యం, కాన్సర్‌పరీక్ష.**

ఈ సమాసాలు అన్నింటిని గమనించినప్పుడు పూర్వపదంగా ఉన్న ఇంగ్లీషుపదానికి హలంతం అలాగే సమాసంలో నిలబడింది

"కొన్ని హలంత పదాలకు చివర ఉత్వం చేరుతుంది"

**కరెంటుబకాయి, కాంట్రాక్టుఅధ్యాపకుడు, కలెక్టరుఆదేశం, బిల్లు చెల్లింపు, కోర్టుఖర్చులు, కోవర్టుమనిషి, గవర్నరు కార్యాలయం, జర్నలిస్టు సంక్షేమం, బోర్డుసభ్యుడు, జాబువేట, జైలుపక్షి, టూరిస్టు కేంద్రం, పాకెట్టుపాలు**

ఈ సమాసాలను గమనిస్తే ఇంగ్లీషు పూర్వ పదాల హల్లు మీద ఉత్వం చేరుతుంది.

పైనున్న రెండు రకాల సమాసాలను గమనిస్తే "ఆంగ్లపూర్వ పదాలలో హల్లుకు వికల్పంగా ఉత్వం వస్తుంది" అని సూత్రం చేయవచ్చు.

ఇలా ఇంగ్లీషుపదాలకు బహువచనం చేరితే అవి పూర్వపదంలో ఉన్నా కూడా వాటికి ఉత్వం వస్తుంది.

కార్ ఇంగ్లీషుపదం ఏకవచనంలో కారు +అవుతుంది ధరలు అనే పదంతో సమాసం వస్తే లు అనే బహువచన ప్రత్యయం చేరితే అది హలంత కార్ పైనే చేరి కార్లు అవుతుంది.

**కార్ > లు = కార్లు + ధర = సమాసంలో కార్లధర**

**బార్ > లు = బార్లు+ నిషేధం = సమాసంలో బార్ల నిషేధం**

అంటే బహువచనంలో లుకారంలోని ఉత్వం మిగలగా తిరిగి సమాసంలో సమసించినప్పుడు

సంబంధార్థకంగా ఉత్వం అత్వంగా మారడాన్ని గమనించవచ్చు.

**పేపర్లు > పేపర్లగూడు,**

**టీచర్లు > టీచర్లసంఘాలు**

**గేట్లు > గేట్లఎత్తివేత**

**నోట్లు > నోట్లదండ**

**లెక్చరర్లు > లెక్చరర్లసంఘం**

కాబట్టి "ఇంగ్లీషు పదాల బహువచనం మీద పరపదం చేరగా ఉత్వం అత్వం అవుతుంది" అని ఒక సూత్రీకరణ చేయవచ్చు.

**ఇంగ్లీషు పదాలు దీర్ఘాంతాలైతే:**

"ఇంగ్లీషు పదాలు దీర్ఘాంతాలుగా ఉండి పూర్వ పదాలుగా ఉంటే అవి దీర్ఘాంతాలుగానే సమాసాలలో సమసిస్తాయి" అని సూత్రీకరించవచ్చు. పైన చెప్పిన సంస్కృతసిద్ధసమాసాలలో మాదిరిగానే దీర్ఘాంతాలుగా ఉండటం చూడవచ్చు.

**కార్గోసేవలు, ఎస్పీబదిలీ, అసెంబ్లీభవనం, ఆక్వారైతు, ఆర్టీఏ కొరడా, ఏరియాఆసుపత్రి, ఐటీఉద్యోగులు, కమిటీనిర్ణయం ;**

ఇలా ఇంగ్లీషుపదం పూర్వపదంగా ఉండి పలకడంలో దీర్ఘాంత పదాలైతే అవన్నీ సమాసంలో సమసించినప్పుడు దీర్ఘాంతాలుగానే ఉంటున్నాయి.

ఇవి దాదాపు 1200 సమాసాలకు పైగా పరిశీలించినప్పుడు జరుగుతున్న సామాసికకార్యాలు అంటే పదాలలో వచ్చే పరిణామాలు. ఇవి కేవలం ప్రాథమిక పరిశీలనలు మాత్రమే. నా పరిశీలన ఇంకా నిశితంగా కొనసాగుతూ ఉంది. ఇంకా కొన్ని పరిణామాలు పరిశీలిస్తున్నాను. ఇక్కడ నేను చెప్పేది ఇలా ఉంటున్నాయి అని. ఆ పరిణామాలలో కొన్ని సూత్రీకరణలు కనిపిస్తున్నాయి అని చెప్పడమే కాని ఇలా చేయాలి అని చేయబోయే సమాసాలకు ఇక్కడ నేను సూత్రీకరణలు చేయడం లేదు. ఈమాట సందేహం లేకుండా చెబుతున్నాను. మరిన్ని పరిశీలనలు జరిగిన తర్వాత మరొక వ్యాసం రూపంలో తిరిగి రాస్తాను.

కీ.శే. మధురాంతకం రాజారాం

# ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో తెలుగు భాషాబోధన

ఒక మానవ సమూహాన్ని ఇంకొక మానవ సమూహంనుంచి వేరుచేసే అంశాల్లో ప్రధానమైనది - భాష. ప్రజలు మాట్లాడే భాషను బట్టి రాష్ట్రాల స్వరూపంలోనే మార్పురావడం యిందుకు ప్రబలమైన ఉదాహరణ. దేశాల సరిహద్దుల్ని నిర్ణయించడంలో ఒక్కొక్కప్పుడు భాష మతాన్ని సైతం తోసిరాజనగలిగింది. మాతృమూర్తి తర్వాత మానవుడి కంఠగానూ ఆత్మీయమైనది, ఆనందప్రదమైనదీ మాతృభాషేనని చెప్పవచ్చు. తమిళాన్ని అమృతంగాను, కన్నడాన్ని కస్తూరిగాను, తెనుగును తేనెగాను ఆయా ప్రజలు సంభావించుకోవడంలోని ఆంతర్యం యిదే. తరగని ఆస్తిగా, పెరిగే నిధిగా, అడుగడుగునా బాసటగా మానవుణ్ణి చివరిదాకా అంటిపెట్టుకొని వుండేది - మాతృభాషలో అతడు గడించుకున్న పదసంచయమే. ఆలోచించ డానికీ, అభిప్రాయాలను వెలిబుచ్చడానికీ, సదరు ఆలోచనలను, అభిప్రాయాలను లిపిలో ప్రకటించడానికీ, సమస్త శాస్త్రాలను, సాహిత్యాలను గ్రంథస్థం చేయడానికి ఉపకరించేది భాషే, ఒక మానవుడు బంధుమిత్రులకు ప్రీతిపాత్రుడుగా, అడుగుపెట్టిన ప్రతి రంగంలోను విజయం సాధించే కార్యశూరుడుగా, సమాజంలో మాననీయుడుగా, సభా పూజ్యుడుగా రాణించాలంటే. అతడు మాటలను మంత్రాలలాగా ఉపయోగించగలిగి వుండడం ముఖ్యం. ఈ అభినివేశాన్ని అతనికి కలిగించేది మాతృభాషాభ్యసనమే. దీనికంతా పునాది పాఠశాలల్లో జరిగే విద్యాబోధన. స్పష్టంగా, నిర్దుష్టంగా, సంగ్రహంగా, ఆకర్షణీయంగా, నచ్చజెప్పినట్టుగా - మాటల్లోను, రాతలోను అభిప్రాయప్రకటన గావించడానికి అవసరమైన భాషా కౌశలాన్ని పాఠశాలలు మన విద్యార్థులకు చేకూర్చవలసివుంది.

భారతీయ విద్యారంగంలో ప్రస్తుత శతాబ్దంలో వచ్చినన్ని మార్పులు అంతకు మునుపెన్నడూ రాలేదు. ఒక వ్యవస్థ గుర్తుపట్టడానికి వీల్లేనంతగా మారిపోవడమంటే ఏమిటో మనం మన విద్యారంగంలో గమనించవచ్చు. ఈ శతాబ్ది ప్రారంభంలో బుద్ధిజీవులైన కొన్ని కులాలవాళ్ళు, ఆ కులాలకు చెందకపోయినా కొందరు సంపన్నులు తమ బిడ్డలకోసం చదువును ఒక ప్రత్యేక సదుపాయంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈలోగా దేశంలో బాగా వేళ్ళుదన్నుకున్న బ్రిటిషు ప్రభుత్వం విద్యావకాసాలను కొంచెం విస్తృతపరచి, ఆ రంగాన్ని వీలయినంత వరకు తన అదుపు, అజమాయిషీల కిందికి తెచ్చుకో జూచింది. దేశవాళి పద్ధతులపట్ల ఆదరణ తగ్గి, ఇంగ్లీషువాడు వెట్టిందే ఒరవడిగా మారింది. 1947 వరకు ఇదే పరిస్థితి. జాతీయ ప్రభుత్వంకింద విద్యారంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాథమిక విద్యావ్యవస్థను మాత్రం తీసుకుంటే, ఈ రంగంలో నాటికీ నేటికీ కొట్టవచ్చినట్టుగా కనిపించే తేడాలను కిందివిధంగా ఒక జాబితాగట్టి చూచుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలలు ఇంతగా వ్యాప్తికిరాని కాలంలో దాదాపు యాభైయేండ్ల క్రితం ఏ వీధిబడివైపు వెళ్ళినా విద్యార్థులు వయసు వారీగా నీడపట్టున నిలబడి “అ ఆ ఇ ఈ” అంటూ అచ్చులు, “క ఖ గ ఘ” అంటూ హల్లులు “క” కు దీర్ఘమిస్తే “కా”, “క” కు గుడి ఇస్తే “కి” అని గుణింతాలు కొందరు. “అల, ఆట, ఇల, ఈక”, అంటూ రెండక్షరాల పదాలు కొందరు, “అప్పము, ఆకులు, ఇగురు, ఈతడు” అని మూడక్షరాల పదాలు కొందరు “అవని దపము మేలు, అరయ ధనము పాలు, ఆశలెస్స గెలువు, ఆజ్ఞ యందు గెలువు” అని సూక్తులు కొందరు ఇలా సామూహిక పఠనం కొనసాగుతుండడం. ఒక మామూలు దృశ్యంగా ఉండేది. మాతృభాషా జ్ఞానానికంతా పునాది అని చెప్పకోదగిన ఆ ఏకైక పుస్తకం పెద్దబాలశిక్ష. అక్షర కోశంగా, పదకోశంగా, వాక్యకోశంగా అమరిన పెద్దబాలశిక్షలోనుంచి వెలువడే శబ్ద సముదాయాలక్కడి గాలిలో విహరించేవి గనుక వీధిబడికి పలుకూటమన్న పేరు వచ్చి వుంటుంది. పలుకుకూటానికి నామాంతర మన్నమాట! పెద్దబాలశిక్ష ఇంచుమించుగా కంఠస్థమైపోయిన తర్వాత విద్యార్థులు యిటు సుమతి, నరసింహ, వేణుగోపాల మొదలైన శతకాలను, అటు బాల రామాయణం, అమరంలాంటి సంస్కృత శ్లోకాలను బట్టీపెడుతూ చదువుకోవలసి వచ్చేది. ఈ దశలో నిర్దుష్టమైన ఉచ్చారణపట్ల శ్రద్ధ వహించినంతగా, భావగ్రహణం పట్ల శ్రద్ధ చూపేవారుకాదు. అందువల్ల 'శ్రీరాముని దయచేతను' అనే పద్యంలో 'నోరూరగ చెవులుపుట్ట తప్పని, 'చవులు పుట్ట' అనేది ఒప్పని విద్యార్థి ఎప్పుడో భావిజీవితంలో గానీ గ్రహించేవారుకాదు. అట్లాగే అప్పిచ్చువాడు వైద్యుడు కాదని తెలుసుకోడానికి కూడా చాలా కాలం పడుతుండేది. కంజనేత్ర హిరణ్యకశ్యపాంతక శూర, సాధు రక్షణ శంఖ చక్రహస్త అంటూ కొనసాగే పద్య పఠనంలో భావం మాట ఏమైనా పద్యం యతి స్థానం దగ్గర విరగడమే ముఖ్యం గా ఉండేది. ఏమైనా పూర్వ సంచితమైన సంపద ఎప్పటికైనా అక్కరకు వచ్చినట్టు కాలక్రమాన అర్థం అవగాహనకు రావడంతో పాటు, ఏ పుస్తకమైనా అవలీలగా చదవడానికి, తప్పులు లేకుండా రాయడానికి ఈ చదువుబాగా తోడ్పడుతూ వచ్చింది. 1880 - 85 ప్రాంతాల్లో వైస్కూలు విద్యార్థిగా వుండిన డా.కట్టమంచి రామలింగారెడ్డిగారు 6, 7, 8 తరగతుల్లో తానొక్క నలచరిత్రను మాత్రమే చదువుకొన్నట్టు చెప్పి వుండడం యిక్కడ గమనార్హం. ఉన్న వెసులుబాటును బట్టి, ఆసక్తినిబట్టి వీధిబడిలోని విద్యార్థులు కొందరు మహాభారతంలో ఆది పంచకం, రంగనాథ రామాయణం, ఉత్తర రామాయణంలాంటి బహుజన రంజకాలైన గ్రంథాలను పూర్తిగానో లేదా అందులోని కొన్ని భాగాలో, చదవడానికి ఉత్సహించేవారు. అంతటితో ఆ చదువు పరిసమాప్తికి వస్తుండేది.

భారతీయ విద్యా వ్యవస్థపైన బ్రిటిషు విద్యావిధానం వేసిన చెరగనిముద్ర ప్రాథమిక స్థాయినుంచీ విశ్వవిద్యాలయస్థాయి వరకూ తరగతుల ఏర్పాటు. ఎప్పుడైతే తరగతులనేవి ఏర్పడ్డాయో అప్పటి నుంచీ అందుకనుగుణ్యంగా పాఠ్యపుస్తకాలు రూపొందాయి.

| నాడు | నేడు |
|---|---|
| 1.చదువుకునే అవకాశం అల్పసంఖ్యాకులకు, అందునా బాలురకు మాత్రమే పరిమితమై ఉండేది. | అక్షరాస్యత అయిదేళ్ళునిండిన ప్రతివ్యక్తికి అత్యవసరంగా గుర్తించబడింది. ఆమేరకదీకులభేదంగానీ, లింగభేదంగానీ లేకుండా అందరికీ అందుబాటులోకి వచ్చింది. పెద్దవాళ్లలో సైతం నిరక్షరాస్యతను నిర్మూలించడానికి వయోజన పాఠశాలలు నెలకొన్నాయి. |
| 2 ప్రాథమికస్థాయిలో విద్యాలయాలు, వీధిబళు లేదా నాటు పలుకూటాలు అన్నపేరుతో కొన్నికొన్ని పెద్దగ్రామాల్లో స్థానికసంపన్న కుటుంబీకుల ఆదరణ కింద నిర్వహించబడుతూ వచ్చాయి. | పాతికమంది పిల్లలున్న ప్రతిపల్లెకూ ప్రాథమిక పాఠశాల అనేది ఒక కనీసావసరంగా గుర్తించబడింది. స్థానిక సంస్థల యాజమాన్యం కిందనడిచినా, ప్రత్యేక సంస్థల ఆధ్వర్యంకింద నడిచినా పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు, ఆర్థికసహాయమూ అవసరమై పోయింది. |
| 3. కొద్దిపాటి పురాణజ్ఞానం,క్రోనోట్లు, దస్తావేజులు మొ. రాత కోతల్లో ఒక్కింత ప్రావీణ్యం, పరిమితమైనగణితశాస్త్రపరిజ్ఞానం కలిగిన వారికి ఉపాధ్యాయులుగా పరిగణన కలిగింది. | ఉపాధ్యాయవృత్తికి కనీసంమాధ్యమిక, లేదా ఉన్నత పాఠశాలల విద్యాస్థాయితోబాటు, శిక్షణ కేంద్రాల్లో బోధనాభ్యసనకోర్సును పూర్తి చేసివుండడం అవసరమైంది. |
| 4. తరగతుల విభజనగానీ, పరీక్షలుగానీ లేవు. విద్యాస్థాయి సంతృప్తికరంగా తోచేదాకా, వయసు14 లేక 15 ఏండ్లు వచ్చే పర్యం తంకూడా చదువుకోవడం పరిపాటిగా వుండేది. | తరగతుల విభజనతో బాటు, పాఠ్యప్రణాళికలు రూపొందాయి. ప్రాథమిక స్థాయి అయిదేండ్లుగాను, మాధ్యమిక స్థాయికి లేక 2 ఏండ్లుగాను నిర్ణయం జరిగింది. రాతపరీక్షల మూలంగా విద్యాస్థాయిని అంచనా వేయడం రివాజుగా మారింది. |
| 5. వీధిబడిలో మాతృభాషాభ్యసనానికి అత్యంత ప్రాధాన్యంవుండేది. చదవడం, రాయడం, పురాణపఠనం, అంతోయింతో అర్థజ్ఞానం, నిత్యజీవితానికి అవసరమైనంతమట్టుకు గణిత పరిజ్ఞానం-ఇవి చదువుద్వారా ఆనాటి విద్యార్థులు ఆశించిన పరమ ప్రయోజనాలు.. | మాతృభాషతోపాటు, కొంత విస్తృతపరిధిలో గణితం, అదనంగా చరిత్ర, భూగోళశాస్త్రం,పౌరనీతి, సామాన్య విజ్ఞాన శాస్త్రం పాఠ్యాంశాలుగా చేర్చబడ్డాయి. మాధ్యమిక పాఠశాలస్థాయిలో విద్యార్థికి మాతృభాషతో బాటు, ఇతరభాషలు ఒకటో రెండో నేర్చుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. |
| 6. ప్రాథమిక విద్యాస్థాయిలో ఆనాడు పద్యానికి ప్రాముఖ్యం ఎక్కువ.గద్య బోధన దాదాపుగా వుండేదిగాదు. | గద్యానికి ప్రాధాన్యం హెచ్చి, పద్యానికి ప్రాముఖ్యం తగ్గింది. పద్యానికి కేటాయించిన స్థానంలో గేయం తనవాటాను తాను పంచుకోజూచింది. గద్యంగూడా ప్రాచీన గ్రాంథికంలోగాక శిష్ట వ్యావహారికంలో వుండాలన్న అభిప్రాయానికి ఇంచుమించుగా ఏకగ్రీవమైన ఆమోదం లభించింది. |

అయిదేండ్లునిండిన బాలబాలికలు బడిలో అడుగుపెట్టగానే మొదటి తరగతి వాచకం ఒకటి వాళ్లచేతికిచ్చి, పలకమీద అ ఆ లు రాసి దిద్దమనడం రివాజైపోయింది. కుటుంబ సభ్యులతోను, క్రీడావినోదాలతోను కాలం గడపటానికి అలవాటుపడిన పిల్లలకు కావించే భాషా బోధన ఆహ్లాదకరంగా, ఆసక్తిజనకంగా ప్రారంభంగావడం మంచిది. దాదాపుగా రెండు నెలల పర్యంతం వాళ్ల విద్యా వ్యాసంగ మంతా మౌఖికంగా కొనసాగడం వాంఛనీయం. అయిదేండ్ల కుర్రవాడు మాతృభాష నేర్చుకొనడం ఇంటిదగ్గరే ప్రారంభమై వుంటుందనీ, ఆపాటికతడు ఇంచుమించుగా ఒక వెయ్యి పదాలను నిత్య జీవితంలో ఉపయోగించడానికి అలవాటుపడి వుంటాడనీ, అంతకు మించిన పదాలకు అర్థం గ్రహించగలడనీ ఉపాధ్యాయుడు గుర్తించవలసి వుంటుంది. మీదుమిక్కిలి ఆ లేతవయసులో అతనికి మాట్లాడడంపట్ల ఎంతో ఉబలాటం వుంటుందనీ, కొత్త పదాలను నేర్చుకోడంలోను, వినియోగించడంలోను ఆసక్తి కలిగివుంటాడనీ గ్రహించాలి. చిన్న జీవితంలో తన కెదురైన అనుభవాలను గురించి ఇతరులకు చెప్పాలని, మాట్లాడడంలో పెద్దల్ని అనుకరించాలనీ అతనికి కుతూహలం వుండడం సహజం. ఎటొచ్చీ తన అభిప్రాయాలను, అనుభవాలను బహిర్గతం చేయడానికి తగినంత పదజాలం అతనికి తెలిసి ఉండకపోవచ్చు. చిన్నపిల్లల విషయంలో మాట్లాడ్డమూ, ఆలోచించడమూ వేర్వేరుగా వుండవు. సాధారణంగా రెండుపనులూ ఒకేసారిగా చేస్తుంటారు. అయితే తమ భావాలను వాళ్లు స్పష్టంగా మాటల్లో పెట్టలేకపోవచ్చు. ఈ దశలో వారికి ఉపాధ్యాయుని తోడ్పాటు అవసరమవుతుంది. నీ పేరేమిటి, నీ తల్లిదండ్రులపేరేమిటి, మీ కుటుంబంలో ఎందరున్నారు, మీ నాన్నగారేం చేస్తుంటారు – అన్న చిన్న ప్రశ్నల దగ్గరనుంచీ మొదలు పెట్టి అతడు కనుగొన్న దృశ్యాలను గురించి, విన్న వర్తమానాలను గురించి, చేసిన పనులను గురించి అడిగి తెలుసుకుంటూ, సందర్భం ఏర్పడినప్పుడల్లా అతడి కవసరమైన మాటలు అందివ్వగలగాలి.

మన సమాజంలో విద్యాస్థాయినిబట్టి, సంస్కార రీతిని బట్టి రకరకాల కుటుంబాలున్నాయి. కుటుంబంలో విద్యార్థి మాట్లాడే భాష

**కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!**

తరగతి గదిలో ప్రయుక్తమయ్యే భాషకు ఎంతో కొంత తేడా వుండడం తప్పనిసరి. పల్లెటూళ్లలోనైతే ఈ విభేదం మరీ ఎక్కువ. అందువల్ల తాను నిర్దుష్టంగా మాట్లాడుతూ, పిల్లలను, శిష్ట వ్యావహారికం వైపుకు మళ్లించడం ఉపాధ్యాయుని విధి. సంభాషణల తర్వాత తరగతిగదిని చైతన్యవంతంగాను, ఆనందధామంగానూ చేయడంలో ప్రధానపాత్ర వహించేవి కథలు, అభినయ గీతాలు. భాషా నైపుణ్యాల్లో వినడంగూడా ఒకటన్న విషయం గుర్తులో పెట్టుకొని, చక్కని చిక్కని చిన్నకథల ద్వారా వారిలో ఏకాగ్రతను పెంపొందించాలి. సింహము – కుందేలు, కాకి – పాము, వేటగాడు – పావురాలు, మొదలైన పశుపక్ష్యాదుల కథలు చిన్న పిల్లలను బాగా ఆకర్షిస్తాయి. అయితే అయిదేండ్ల పిల్లలు కథలు వినడమే తప్పా, అప్పటికప్పుడు తాము వాటిని యథాతథంగా చెప్పలేకపోవచ్చు. అభినయగీతాలవల్ల ఈ లోటు తీరుతుంది. పాటలోని మాధుర్యమూ, లయ పిల్లలకు తన్మయత్వాన్ని కలిగిస్తాయి. ఉపాధ్యాయుడు చేసిచూపెట్టే అభినయం వాళ్లని ఎంతగానో ఆకట్టుకుంటుంది. పాట పాడే రీతిలో, అభినయంలో ఉపాధ్యాయుణ్ణి అనుకరిస్తూ ఏవో అద్భుత లోకాలలో విహరిస్తున్నట్టు ఆనందిస్తారు. ఏనుగు ఏనుగు నల్లన, సముద్రతీరము పోతిమి, కుండలు వానేదెందుకురాc లాంటి గీతాలతో ప్రారంభించి, నిపావురం – చీమ, తాబేళ్ళు – కొంగ, కుక్క – మాంసపుముక్కc లాంటి కథా గేయాలు మొదటి తరగతి పిల్లలకు నేర్పించాలి. తాము మాతృభాష నేర్చుకుంటున్నామన్న విషయం పిల్లలకప్పుడు తెలియకపోవచ్చు. కానీ దానిద్వారా కలిగే ఆనందాన్ని ఆస్వాదించడానికి వాళ్లని తర్ఫీదు చెయ్యడమే ముఖ్యం.

మాతృభాషాభ్యసనానికి సంబంధించి బడిలో కొత్తగా ప్రవేశించిన పిల్లల్ని గాబరాపెట్టే అంశం. తెలుగు లిపి నేర్చుకోవడం. అచ్చులు, హల్లులు నేర్చుకొన్న తర్వాత, ఒక్కొక్క హల్లుకు గుణింతాల వల్ల ఒత్తులవల్ల ఏర్పడే వివిధ అక్షర రూపాలను లెక్కపెడితే తెలుగు పిల్లలు కొన్ని వందల అక్షరాలు నేర్చుకోవలసి వుంటుంది. అయిదేండ్ల పిల్లలకింతకు మించిన యాతన మరొకటుండదు. అక్షరాలను నేలపైన రాసి చూపుడువ్రేలు అరిగిపోయేవరకు, నేల గుంటపడిపోయేవరకు. దిద్దించే వారంటే ఆ యాతన ఎలాంటిదో అర్థమవుతుంది. ఏండ్లూ పూండ్లూ గడిచి, విద్యావిధానంలో ఎంతగా, మార్పు వచ్చినప్పటికీ అక్షరాలు దిద్దించే పద్ధతి మాత్రం అట్లాగే వుంది. లేదంటే నేలకు బదులు పలక వినియోగంలోకి రావడమే తేడా. మాతృభాష నేర్చుకోడం సుకరంగావాలంటే ఈ పద్ధతిలో పూర్తిగా మార్పు రావాలి. మొదటి తరగతి వాచకంలో పిల్లలు బాగా గుర్తించగలిగిన బొమ్మలను ముద్రించి, కింద ఆ బొమ్మ తాలూకు పదంలోని మొదటి అక్షరాన్ని మాత్రం ఉటంకించి (అరక, ఆట, ఇటుక, ఈల ఇత్యాదిగా) అక్షరాలను గుర్తు పట్టించవచ్చు. గుర్తుపట్టేదశలో తారుమారు చేసిన ఫ్లాష్ కార్డులు చూపిస్తూ అక్షరాన్ని చెప్పించవచ్చు. చెప్పిన అక్షరాన్ని ఫ్లాష్ కార్డులలోనుంచి తీయించవచ్చు. ఇలా అక్షరాలను గుర్తు పట్టిన తర్వాత మెల్లమెల్లగా వాటిని రాయించడానికి ప్రయత్నించడం సముచితంగా వుంటుంది. సున్నలు పెట్టడం సులువుగనుక, కొంత చెరిపివేయడం ద్వారా కొంత చేర్చడంద్వారా అక్షరాలు రూపొందించే విధానం నేర్పించవచ్చు. ఇందువల్ల అదేపనిగా అక్షరాలు దిద్దవలసిన శ్రమ తప్పుతుంది. హల్లుల్ని గుర్తించడానికి, రాయడానికి వచ్చిన తర్వాత గుణింతాలు నేర్పడం కష్టమేమీ కాదు. ఇందులో గూడా మొట్టమొదట దీర్ఘం మాత్రమే తీసుకొని దాన్ని రాసి, రాయించి తరువాత వాల్లులన్నింటికీ తలకట్ల స్థానంలో దీర్ఘాలు చేర్చడం నేర్పించే పద్ధతి పిల్లల అవగాహనకు అనువుగా ఉంటుంది. ఇట్లాగే గుడి, గుడిదీర్ఘం, కొమ్ము, కొమ్ముదీర్ఘం యిలా నేర్పించుకుంటూ పోవచ్చు. అచ్చులు, హల్లులు వచ్చిన తర్వాత వాటితో రూపొందిన పదాలను, గుణింతాలు కూడా వచ్చిన తర్వాత అవిగూడా చేరిన పదాలను చిన్నచిన్న వాక్యాలతోబాటుగా పొందుపరిచి పాఠాలు రూపొందించాలి. ఇప్పటికి నేర్చుకున్న పరిధిలోకి వచ్చిన అక్షరాలతోనే మొదటి వాచకం చివర చిట్టిగేయాలు, చిన్నకథలు గూడా చేర్చవచ్చు. ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు రెండో తరగతికి కేటాయించడంవల్ల మొదటి తరగతి పిల్లలు ఏడెనిమిది నెలల వ్యవధిలో ఇప్పటివరకు వేర్కొన్న సిలబస్ ప్రకారం భాషాభ్యసనాన్ని సునాయాసంగా పూర్తి చేయగలరు.

ఎస్సెస్సీ, ఇంటర్ మీడియట్ స్థాయికి వచ్చినవారిలో సైతం చాలామంది విద్యార్థులు అక్షరదోషాలు లేకుండా వాక్యం రాయలేక పోతున్నారన్న ఆరోపణ ఒకటి ప్రచారంలో వుంది. ప్రాథమిక పాఠశాలలో, అందునా ఒకటి రెండు తరగతుల్లో మాతృభాషాబోధన పకడ్బందీగా జరగడమొక్కటే ఇందుకు నివారణోపాయం. ఇదంతా ఉపాధ్యాయుల మూలంగా జరగవలసిన కృషి ఒత్తులు నేర్పడంలో ప్రారంభమయ్యే రెండో తరగతి వాచకంలో ఒక్కొక్క ఒత్తుకు ఒక పాఠం చొప్పున రూపకల్పన జరగాలి. ఉదాహరణకు 'క' ఒత్తును తీసుకుంటే అక్క, చక్కిలం, మక్కువ లాంటి ద్విత్వాక్షరాల పదాలతోబాటు, మర్కటం, వల్కలం, ఆస్కారం లాంటి సంయుక్తాక్షర పదాలను గూడా చేర్చి పాఠం చివర cమా అక్క చక్కని చుక్కc, నీర్కావి పంచ ఎక్కడ?c లాంటి చిన్న చిన్న వాక్యాలు చేర్చాలి. ఇలా ఒత్తులన్నీ నేర్పిన తర్వాత వాచకంలోని ఉత్తరభాగంలో చేర్చిన చిన్నపాఠాలను, గేయాలను చదవడంలోను, చూచిరాయడంలోను పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. ఎప్పటికప్పుడు పఠనమూ, లేఖనమూగూడా నిర్దుష్టంగా వుండేటట్టు చూసుకోవాలి. , రెండో తరగతి వాచకంలో ఏ పాఠమైనా బొమ్మతో కలిసి రెండుపెజీలకు మించి వుండనవసరం లేదు. పాఠం పదినుంచి పదిహేను వాక్యాలవరకు పరిమితమై ఉండాలి. మా బడి, మా ఊరులాంటి విషయ వివరణాత్మకమైన పాఠం ఒకటి వుంటే, దాని తరవాత గేయం, కథ, రూపకం, ఆత్మకథ ఏకపాత్రాభినయం, గేయకథ, నాటిక యిలా వైవిధ్యం వుండేట్టుగా పాఠాలకు స్థానం యివ్వాలి. చదవడానికి, రాయడానికేగాక పాడుకోడానికి, సంభాషించడానికి, అభినయం చేసిచూపడానికి, పాఠంలోని కథను సొంతమాటల్లో చెప్పడానికి, యిలా బహుళార్థసాధకంగా వుండేట్టు పాఠాలను రూపొందించాలి. ఇది మూడు, నాలుగు,

# పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

అయిదు తరగతుల్లోగూడా పాటించవలసిన మెలకువ. ఇంగ్లీషు పాఠ్యపుస్తకాల పద్ధతిలో పాఠాలను తొమ్మిది యూనిట్ల కింద విభజించి, ఒక్కొక్క యూనిట్ కు ఒకటో రెండో గద్యపాఠాలు పెద్దదైతే ఒకటి, చిన్నవైతే రెండు) దానితోబాటు ఒక గేయం, లేదా గేయకథ, గాథా నీతిపద్యాలు, లేక పద్యకథ చేర్చడం బాగుంటుంది. గద్య పాఠాలుగా మా బడి, మా ఊరు, మన దేశం, జాతీయ చిహ్నాలు, ప్రచార సాధనాలు, విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలు మొదలైన విషయ వివరణాత్మక వ్యాసాలతోపాటు, మహా పురుషుల జీవితాలలోని మధుర ఘట్టాలు, పురాణకథలు, కవి జీవితాలు, బాలవీరుల సాహసగాథలు, చమత్కారంతోగూడిన జానపదకథలు, నీతికథలు, ఇద్దరు సంభాషించినట్టుండే రూపకాలు, నాటికలు, ఉత్తరాలు, దినచర్య రచనలు స్వీకరించాలి. వీటిలో ఎక్కువభాగం – పాఠ్య గ్రంథరచయితలు రాయవలసినవే. కానీ పాఠ్య గ్రంథాలకు కావలసిన పద్యాలుగానీ, గేయాలు గానీ కొత్తగా రాయనక్కరలేదు. సుమతి, వేమన పద్యాలతోపాటు గురజాడ, రాయప్రోలు, చింతాదీక్షితులు, బాపిరాజు, నాళం కృష్ణారావు మొదలైనవారి రచనల్లో నుంచి వాటిని ఎన్నిక చేసుకోవచ్చు.

గ్రాంథిక భాషకు ప్రత్యామ్నాయంగా శిష్ట వ్యావహారికం స్వీకరించడం పట్ల అభిప్రాయభేదాలు లేకపోయినప్పటికీ, సదరు వ్యావహారికం రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో మాత్రమే ప్రచారంలో వుందని గుర్తించాలి. ఇతర మాండలికాలు మాట్లాడ్డానికి అలవాటుపడ్డ పిల్లలకు విలక్షణంగాను, విడ్డూరంగాను వుండని శైలిలో గద్యరచనను తీర్చిదిద్దాలి. సాధారణంగా క్రియారూపాల దగ్గరే పేచీ వస్తుంది గనుక, అందరికీ నచ్చేటట్టు ఏదైనా ఒక రూపాన్ని స్వీకరించాలి. (చూచాడు, చూచేడు, చూచినాడు వస్తున్నది, వస్తోంది. వస్తూన్నది, వస్తూఉన్నది) పాఠ్య గ్రంథాలలోని గద్యరచనలు సజీవంగా, సౌందర్య విలసితంగా, కర్ణసుభగంగా వుండి, విద్యార్థులకు మాతృభాషపట్ల అభిమానాన్ని పెంపొందజేయాలన్న విషయాన్ని గ్రంథ రచయితలు తప్పక గుర్తుంచుకోవాలి. కొంచెం పెద్దపాఠాలు గూడా చేర్చడానికి వీలున్న మాధ్యమిక పాఠశాలస్థాయిలో గ్రాంథిక రూపంలో ఉన్న పంచతంత్ర కథలు, వీరేశలింగంగారి రచనలు, వావిలకొలను సుబ్బారావుగారి ఆర్యకథానిధి కథలు మొదలైన వాటిని చిన్నచిన్న మార్పులలో వ్యావహారికంలోకి మార్చి గద్య పాఠాలుగా వేసుకోవచ్చు. ప్రజాస్వామిక సామాజిక వ్యవస్థలో విద్యార్థులు గొప్ప సంస్కృతికి వారసులై, ఉత్తమాభిరుచులు అలవరచుకుని, సత్పౌరులుగా రాణించడానికి పాఠశాలలో జరిగే గద్యబోధన తోడ్పడాలన్నది పరమాశయం. ప్రతి పాఠమూ ఇందుకు దోహదకరంగా వుండేటట్టు చూచుకోవడం రచయితల విధి. ఎత్తగానే పాఠం మొదలుపెట్టడం, ఒక్కొక్క వాక్యాన్నీ స్వంతమాటలలో వివరించడం, ఎక్కడికక్కడే కఠినపదాలకు అర్థం చెప్పడం, చివర ప్రశ్నలకు జవాబులు రాయించడం, యిలా ఎంతో కాలంగా కొనసాగుతున్న పద్ధతి పటిష్టమైనది కాదు. ఉపోద్ఘాతంలో తెలుసుకోవలసిన విషయంపట్ల ఆసక్తి కలిగించడం, పాఠాన్ని చదివి, చదివించడం, ఉచ్చారణ దోషాలు సవరించడం, తరువాత పుస్తకం మూసిపెట్టి విషయవివరణ చేయడం, కొత్తపదాలు, నుడికారాలు, జాతీయాలు వివరించి వాటిని స్వంతవాక్యాల్లో ఉపయోగించేటట్టు చూడడం, ప్రశ్నలకు జవాబులు రాబట్టడం – ఇది గద్యబోధనకు తగిన పద్ధతిగా విద్యావేత్తలు నిర్ణయించారు. – గేయాన్నిగానీ పద్యాన్నిగానీ బోధించడంలోనైతే అర్థవంతంగా రాగయుక్తంగా చదివి, చదివించడంతోబాటు, పదాల పొందికలోని సొంపును, భావ సౌందర్యాన్ని వివరించి, పిల్లల్లో రసానుభూతిని కలిగించవలసి వుంటుంది.

చిన్న తరగతుల్లోనైతే చూచివ్రాతతోను, ఉక్తలేఖనంతోను రాతపనిని సరిపెట్టుకోవచ్చు. కానీ పై తరగతులకు వెళ్లినకొద్దీ నియోజనాలు (అసైన్‌మెంట్స్) విస్తృతం కావలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ఇప్పటి తెలుగు వాచకాల్లోని నియోజనాలు ఏదో మొక్కుబడికోసం చేర్చినట్టు, అసంతృప్తికరంగా వున్నాయి. మూడు, నాలుగు తరగతుల్లో ప్రతి గద్యపాఠానికి బహుళైచ్ఛిక ప్రశ్నలు, సత్యాసత్య విచక్షణ ప్రశ్నలు, జతపరిచే ప్రశ్నలు, పూరక ప్రశ్నలు, ఒక మాటలో సమాధానం వచ్చే ప్రశ్నలు, ఒక వాక్యంలో జవాబు వచ్చే ప్రశ్నలు, ఈ మాత్రం నియోజనాలుంటే చాలు. అయిదవ తరగతికి వచ్చేటప్పటికి జవాబుగా రెండు, మూడు వాక్యాలు గూడా అవసరమయ్యే ప్రశ్నలు కొన్ని చేర్చవచ్చు. నామవాచకాలు, క్రియలు, సర్వనామాలు, విశేషణాలు, వచనాలు మొదలైన వ్యాకరణాంశాలను ఆగమన పద్ధతి ద్వారా బోధించే విధానం ఉపాధ్యాయునికిచ్చే సూచనల కిందికి రావాలి. కొన్ని పదాలకు కేవలం అర్థం చెబితే చాలదు. సుదీర్ఘమైన వివరణ అవసరమవుతుంది. ఉదాహరణకు, క్రీ.శ.ం అన్న పొడి అక్షరాలనే తీసుకోవచ్చు. వీటిని గురించి వివరించండిః అన్న సూచనతో పాఠం చివర అలాంటి పదాల పట్టిక ఇవ్వడం బాగుంటుంది. ఆరు, ఏడు తరగతుల్లో ఉపాధ్యాయులకిచ్చే సూచనలకు, విద్యార్థులకిచ్చే నియోజనాలకు మరింత ప్రాధాన్యం యివ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇంగ్లీషు పాఠ్యపుస్తకాల్లోనైతే పాఠం ఆరుపేజీలుంటే, ఉపాధ్యాయులకు సూచనలు, విద్యార్థులకు నియోజనాలు కలిసి అంతకు రెట్టింపుగా, ఒక్కొక్కప్పుడు మూడింతలుగా గూడా ఉన్నాయి. ఈ విషయంలో మనం ఆంగ్ల పాఠ్యగ్రంథాలను అనుసరించడం సముచితం. ఉపాధ్యాయుడు పాఠాన్ని కొన్ని భాగాలుగా విభజించి కొన్ని వేరాలు తాను చదివి, కొన్నింటిని విద్యార్థులచేత చదివించి, మరికొన్నింటిని మౌనపఠనం చేయించి ఆయా భాగాలలో నుంచీ రూపొందించిన ప్రశ్నలకు జవాబులు రాయించడం ద్వారా, ఖాళీలు పూరించడం ద్వారా పిల్లల అవగాహనను పరీక్షించే అభ్యాసాలతోను, పర్యాయపదాలు, వ్యతిరేకపదాలు, నామవాచకాలకు క్రియా రూపాలు రాయించడం ద్వారా పదకోశాన్ని పెంపొందించే అభ్యాసాలతోను, జాతీయాలు, నుడికారాలు ఉపయోగించడం ద్వారా, ఇచ్చిన పదాలు ఆధారంగా వ్యాసరచన చేయడం ద్వారా భాషా కౌశలాన్ని అభివృద్ధి పరిచే అభ్యాసాలతోను నియోజనాలకు సమగ్ర రూపం ఇవ్వవలసిఉంది.

ఒక్కొక్క తరగతిలోను అదనంగా కొంత శబ్దరాశి పిల్లల పదకోశానికి చేరేటట్టుగా, కొత్తగా కొన్ని సామెతలు, జాతీయాలు

**తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి**

**తాజావార్త**

## కేంద్రప్రభుత్వ నిర్ణయం
## నెల్లూరులో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం

ఎంతో పోరాటం చేసి ప్రాచీన తెలుగు హోదాను సాధించుకొన్న తర్వాత, పరిశోధన, తదితర కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి వ్యవస్థను మైసూరులోని భారతీయ భాషల కేంద్ర సంస్థలో ప్రారంభించారు. దానిని తెలుగు నేలపైకి తెచ్చుకోవాలన్న కొందరి ప్రయత్నాలు, రాష్ట్ర ప్రభుత్వాల పాలకుల అశ్రద్ధ, పట్టనితనం వల్ల ఇంతకాలం నెరవేరలేదు. జులై 13న మైసూరులోని సంస్థను దర్శించిన ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యానాయుడుగారు ఈ విషయమై పట్టించుకొని, తగు చర్యలు చేపట్టిన ఫలితంగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం – ప్రాచీన తెలుగు కేంద్రాన్ని నెల్లూరుకు తరలించాలని నిర్ణయించింది. ఈ సంగతి ఆగస్టు 31న పత్రికల ద్వారా వెల్లడయింది. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జరిగిన ఈ నిర్ణయాన్ని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలూ స్వాగతించాలని, త్వరలో ప్రాచీన తెలుగు కేంద్రానికి కావలసిన 20 ఎకరాల స్థలాన్ని, 2000 చదరపు అడుగుల భవన సదుపాయాన్ని నెల్లూరులో ఇచ్చేందుకు స్థానిక అధికారులు చర్యలు తీసుకొని, త్వరలో ఈ కేంద్రాన్ని తరలించే ఏర్పాటు జరగాలని కోరుతున్నాము. కేంద్రస్థాయిలో జరిగిన ఈ నిర్ణయాన్ని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలూ స్వాగతించి కలిసి మెలసి పనిచేయాలని కోరుతున్నాము.

– తెలుగుభాషోద్యమ సమాఖ్య

అవగాహనకు వచ్చేటట్టుగా, కవులను గురించి, కావ్యాలను గురించి తెలిసి వచ్చేటట్టుగా, ప్రాచీన సంస్కృతికి, చరిత్రకు చెందిన అంశాలు, ఆధునిక సమాజానికి, విజ్ఞానానికి సంబంధించిన విషయాలు అవగతమయ్యేటట్టుగా, ముచ్చటైన ముద్రణలో సముచితమైన చిత్రాలంకరణతో పాఠ్య గ్రంథాలు రూపొందించవలసిన ఆవశ్యకతను గురించి విద్యావేత్తలు పదేపదే వివరించి వున్నారు. విద్యార్థికప్పటికే తెలిసిన పదాలకు, వాచకంద్వారా తెలియవచ్చే కొత్తపదాలకూ మధ్య 3 :1 నిష్పత్తి వుండాలన్న విషయం గూడా భాషావేత్తలచేత ఆమోదం పొందింది. ఈ కొత్త పదాల పట్టికను పాఠాలకు చివర,వాచకంలో చేర్చడం అవసరం.

వాచకమెంతగా యిలా క్షుణ్ణ పఠనానికి తోడ్పడినప్పటికీ, విద్యార్థి దాన్ని చదివి పరీక్షలో ఉత్తీర్ణతనందడం మాత్రమే విద్యా బోధనకు లక్ష్యం కారాదు. విద్య అనేది ఒక విజ్ఞాన భాండాగారమనీ, ఎంత చదివినా యింకా చదవవలసింది వుంటుందనీ విద్యార్థికి అవగతం కావాలి. మౌనంగాను, వేగంగాను చదివే అలవాటును విద్యార్థిలో ప్రోదిచేసి, విస్తారపఠనానికి దోహదం చేయడమే విద్య యొక్క పరమలక్ష్యం. ఇందుకు తోడ్పడేవి పిల్లల పత్రికలు, ఉపవాచకాలు, గ్రంథాలయాలు. అక్షరజ్ఞానం కలిగి, సునాయాసంగా వాక్యాలను చదువుకోగలిగిన పిల్లలు, నాలుగో తరగతికి వచ్చినప్పటి నుంచీ చదువుకోదగ్గ పుస్తకాలకోసం అన్వేషణ ప్రారంభిస్తారు. చందమామ, బొమ్మరిల్లు లాంటి పత్రికలు దొరికితే, వాటిని అపురూపంగా దాచుకుని చదువుకుంటారు. ఎటొచ్చీ వారి పఠనాసక్తికి తగినంత పుస్తక సముదాయాన్ని మనం వారి కందించలేక పోతున్నాము. బాల వాఙ్మయ నిర్మాణంలో పురోగతి బొత్తిగా కానరావడంలేదు. అమెరికా, బ్రిటన్, రష్యా దేశాలలోనుంచీ వస్తున్న బాల సాహిత్యాన్ని పరిశీలిస్తే, ఈ రంగంలో మన ఉనికి ఎక్కడో మనకు తెలిసి వస్తుంది. బాలల అకాడమీ ఈ విషయంలో కొంత కృషిచేస్తూ ఉందిగానీ, ఆ పుస్తకాలు గూడా బహుళ ప్రచారానికి నోచుకోవడం లేదు. తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీలాంటి సంస్థలు, విశాలాంధ్ర, నవోదయ, ఆంధ్ర సారస్వతపరిషత్తు లాంటి ప్రచురణాలయాలు పూనుకుంటే ప్రతి సంవత్సరము కొన్ని మంచి పుస్తకాలు వెలువడే అవకాశం వుంటుంది. గలివర్ దూరదేశయాత్రలు, సిందుబాదు విదేశీయాత్రలు, రాబిన్‌హుడ్ సాహసకృత్యాలు, టెన్సింగ్ హిమాలయ పర్వత ఆరోహణ మొదలైనవి చిన్నచిన్న కథలుగా రాసి సచిత్రంగా ప్రచురిస్తే అవి ఆరు, ఏడు తరగతులకు చక్కటి ఉపవాచకాలుగా ఉపకరిస్తాయి. ఆసక్తి జనకంగా ఒక కథ మాత్రంచెప్పి మిగిలినవి మీరే చదువుకో వచ్చునని చెబితే, పిల్లలు కుతూహలంతో చదువుకుంటారు. ఇంకా అలాంటి పుస్తకాలు కనిపిస్తాయేమోనని ఉవ్విళ్లూరి పోతారు. గ్రంథాలయాల ఆవశ్యకత ఏర్పడేది. ఈ దశలోనే. ఒకటో రెండో చెక్క బీరువాలు, వాటిలో చెత్తకుప్పల్లాంటి పాత పుస్తకాలు – యిదే మన హైస్కూలు గ్రంథాలయాల సౌభాగ్యం. ఈ రంగంలో ఎంతో సంస్కరణ జరగాలి. ఇక్కడ నిధులకొరత అన్న మాటకు తావులేదు. విద్యార్థులు లైబ్రరీ ఫీజు చెల్లిస్తూనే ఉన్నారు. హైస్కూలు లైబ్రరీలో పిల్లలకు వినోద, విజ్ఞానాలందించే బాలసాహిత్యం, పాఠ్యబోధనలో ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన రిఫరెన్సు పుస్తకాలు – ఇవి మాత్రం వుంటే చాలు. వారానికొక్క పీరియడ్ యిందుకోసమని కేటాయిస్తే, పిల్లలకు పుస్తకాలు చదవడం ఒక అలవాటుగా పరిణమిస్తుంది.

అయితే పాఠశాలల్లో తెలుగు భాషాబోధన సఫలీకృతం కావడం వాచకాలు, ఉపవాచకాలు, గ్రంథాలయాలు, బోధనోపకరణాలు మొదలైన వాటిపైన మాత్రమే ఆధారపడి వుండదు. వీటి కన్నా ప్రధానపాత్ర అధ్యాపకునిది. ఆదర్శప్రాయమైన విశిష్టవ్యక్తిత్వం, ఆకర్షణీయమైన వాక్చాతుర్యం, పిల్లలపట్ల వాత్సల్యం, కర్తవ్యనిష్ఠ విశాల సాంఘిక దృక్పథం, ఆధునిక విజ్ఞానంతో అవసరమైనంత పరిచయం, మనస్తత్వ పరిజ్ఞానం, వీటితోబాటు మాతృభాషపట్ల గాఢమైన అభిమానం– ఇవి భాషాబోధకునికి ఉండదగిన లక్షణాలు. అత్యంత పరిమితమైన భాషాజ్ఞానంతో, లేశమాత్రమైన లోకజ్ఞానంతో బడిలో అడుగుపెట్టే అయిదేండ్ల పసివాడి చేయిపట్టుకుని మెల్లమెల్లగా బహుళాంధ్రోక్తిమయ ప్రపంచం వైపుగా, విశాల విశ్వంవైపుగా, అనంత విజ్ఞానం వైపుగా నడిపించే గురుతరబాధ్యత మాతృభాషా బోధకుల పైనే వుంది. చిరుదివ్వెల్ని అఖండ జ్యోతులుగా మలచడానికి మించిన విశిష్టకార్యం మరొకటిలేదు.

***(ఈ వ్యాసాన్ని తొలుత 'తెలుగు' పత్రిక 1988 సెప్టెంబరు – అక్టోబరు పత్రికలో ప్రచురించారు)***

తెలుగుభాషా దినోత్సవం

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన గిడుగు రామమూర్తి జయంతి సభ




ప్రాచీన, ఆధునిక జానపద సాహిత్యంలోని విశిష్టమైన తెలుగు పదాలను సేకరించి, పత్రికలు, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల సహకారంతో, ఆ పదాలను జనబాహుళ్యంలోకి ప్రవేశ పెట్టి, ప్రజలు ఆ పదాలను విరివిగా వాడే విధంగా కార్యక్రమాలను రూపొందించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, అధికారభాషా సంఘం అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రకటించారు.

గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన అధికార భాషా దినోత్సవ సభకు ఆచార్య యార్లగడ్డ అధ్యక్షత వహించారు.

విశాఖపట్నం ఉడా చిల్డ్రన్స్ ఎరీనా హాలులో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ మాట్లాడుతూ శ్రీకాకుళం మొదలు చిత్తూరు వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల మాండలికాలతో నిఘంటువును రూపొందిస్తామన్నారు. అలాగే, తెలుగు భాషకే స్వంతమైన అవధాన ప్రక్రియను అభివృద్ధి పరచడానికి, అవధాన శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నత పాఠశాలల స్థాయి విద్యార్థినీ, విద్యార్థులలో పద్య రచనా ప్రక్రియను పెంపొందించడానికి 'భవిష్యత్ సాహిత్య నిధి' కార్యక్రమాలు రూపొందిస్తాం.

ప్రపంచ ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహించి, తెలుగు సాహిత్యంలో, సమకాలీన సాహిత్య విలువలు ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి ప్రధానంగా కృషి చేసినది మాజీ ముఖ్యమంత్రి డా.వై.యస్. రాజశేఖరరెడ్డి అని నివాళులర్పించారు. మాండలికాల ముత్యాల సరం మన తెలుగు భాష అని, అలాంటి తెలుగు భాషను ప్రజల భాషగా తీర్చి దిద్దడంలో మహోద్యమం చేసిన గిడుగు రామమూర్తి పంతులుగారికి తెలుగుజాతి రుణపడి వుంటుందని అన్నారు. అధికార భాషగా తెలుగును పరిపాలనా రంగంలో పూర్తిగా అమలు చేయడం గురించి 'అధికార భాషా సంఘం' అధ్యక్షుడు ఏమీ ప్రస్తావించలేదు.

సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ మంత్రిత్వ శాఖలో భాగమైన అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. సభలో అతిధిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి వినయ్‌కుమార్ తన ప్రసంగంలో భాషా, సంస్కృతుల కన్నా, పర్యాటక శాఖ గురించి ఎక్కువగా మాట్లాడి, గిడుగు రామమూర్తి పంతులుగారి గురించి, భాష గురించి మూడే నిముషాలు ప్రసంగించడం సభికులను ఆశ్చర్య పరిచింది.

అతిధిగా పాల్గొన్న గాజువాక శాసన సభ్యులు టి.నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే అన్ని ఉద్యోగ ప్రవేశ పరీక్షలు మాతృభాషలో నిర్వహించ గలిగినప్పుడే తెలుగు భాషపైన ప్రేమ పెరుగుతుందన్నారు. తెలుగువారు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేశ పరీక్షలలో తెలుగు అభ్యర్థులకు గతంలో వున్న పదిహేను అదనపు మార్కుల సౌలభ్యం ఇటీవల తొలగించేశారన్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్వాసితులైన నిరుద్యోగులకు ఈ అంశంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, పాలనా వ్యవహారాల్లో పూర్తిగా మరాఠీభాషనే ఉప యోగిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వాన్ని, అక్కడి ప్రజల్ని మనం ఆదర్శంగా తీసుకున్నప్పుడే, తెలుగు భాష మనుగడ కాపాడగలుగుతామన్నారు. తాను చిన్నతనంలో 'మమ్మీ' అని పిలిచిన పిలుపుకు, తర్వాత 'అమ్మ' అని పిలిచిన పిలుపుకు ఉన్న తేడాను అనుభవించానని తన స్వానుభవాన్ని ఉదహరించారు.

గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ డా.జి.సృజన ప్రసంగిస్తూ, జర్మన్, ఫ్రెంచి, స్వీడిష్ దేశాలు పరిపాలన తమ మాతృభాషలోనే చేస్తున్న అంశం మనం గమ నించాలన్నారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలిపే మంచి గీతాన్ని ఆలపించి – అందరి ప్రశంస లందుకున్నారు.

జిల్లా సంయుక్త కలెక్టరు శివశంకర్, తాను తెలుగు మాధ్యమంలో చదువుకున్నానని, తెలుగుభాషలోనే సివిల్ సర్వీస్ పరీక్షరాసి ఉత్తీర్ణుడైన తీరు వివరించారు. ఒక ఉపాధ్యాయుని తరహాలో తెలుగుభాషా విశిష్టతను సోదాహరణంగా వివరించిన తీరు అందరినీ ఆనందభరితుల్ని చేసింది.

గిడుగు రామమూర్తి పంతులు మనుమలు గిడుగు వెంకటరామకృష్ణారావు, గిడుగు వెంకట నాగేశ్వరరావు, గిడుగు వెంకట రామరాజులను సత్కరించారు. గిడుగు వెంకట రామకృష్ణారావు రచించిన "ఇద్దరూ ఇద్దరే" పుస్తకాన్ని మంత్రి ముత్తంశెట్టి ఆవిష్క రించారు.

ఈ సభలో ఇంకా, విశాఖ, అనకాపల్లి లోక్‌సభ సభ్యులు ఎం.వి.వి. సత్యన్నారాయణ, డా.భీశెట్టి వెంకట సత్యవతి, వి.ఎం.ఆర్.డి.ఎ. ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, జిల్లా కలెక్టరు వి.వినయ్‌చందు పాల్గొన్నారు.

సభ చివరలో ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య సిమ్మన్న, ఎల్.ఆర్.స్వామి, డా.డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయన సూరి, విరి యాల గౌతం, వంగపండు ప్రసాదరావు తది తరులను సత్కరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఉద్యోగిని శ్రీమతి అన్నపూర్ణ వ్యాఖ్యానం సభకు వన్నె తెచ్చింది.

– బి.వి. అప్పారావు

9347039294

**(అధికార భాషా సంఘ అధ్యక్షునిగా లక్ష్మీప్రసాద్‌గారి నియామక ఉత్తర్వు జి.ఓ ను 47వ పుటలో చూడండి)**

తెలుగుభాషా దినోత్సవం

డా॥ సామల రమేష్‌బాబు

# మాతృభాషలోనే ప్రాథమిక విద్య

మళ్లీ తెలుగుభాషాదినోత్సవం వచ్చేసింది. గిడుగు రామమూర్తిగారి జయంతిని తెలుగుభాషాదినోత్సవంగా 15 ఏళ్లకు పైగా – జరుపుకుంటూనే ఉన్నాం. ప్రభుత్వం కూడా ఎంతో కొంత పట్టించుకుంటూనే ఉంది. ఈ రోజున ప్రభుత్వం అధికారికంగా సభ జరుపుతుంది. ముఖ్యమంత్రి, ఇతర ముఖ్యులు పాల్గొని, తెలుగు పండితులకు, తెలుగు సేవకులకు కొందరికి సన్మానాలు చేస్తారు. తెలుగు గొప్పదనం గురించీ భాషపట్ల తమకున్న ప్రేమాభిమానాలను గురించి ఉపన్యాసం చేస్తారు. ఇదంతా పత్రికల్లో, టీవీల్లో రావడంతో అందరూ సంతోషించి తర్వాత అన్నీ మర్చిపోతారు. తెలుగుభాషోద్యమ సమాఖ్య, ఇతర తెలుగు భాషోద్యమ కారులు వెంటబడి అప్పుడప్పుడు ప్రభుత్వంతో కీలకమైన పనులు చేయించడానికి ఈ సందర్భాన్ని కొన్నిసార్లు ఉపయోగించుకున్నారు. దాని ఫలితంగానే తెలుగుకు ఒక మంత్రిత్వశాఖ (2013) నూ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థనూ (2018) తేగలిగారు. నాటి ప్రభుత్వ నేతలు వాటిని కేవలం ప్రభుత్వ ఉత్తర్వులుగా ఇచ్చారు తప్ప చట్టం రూపంగా ఇవ్వలేదు. వాటికి బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయడంలోగాని, వ్యవస్థలను ఏర్పరచడంలోగాని ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. అప్పటికే ఉన్న సాంస్కృతిక శాఖకు భాష అనే రెండక్షరాలను కలిపి భాషాసాంస్కృతిక మంత్రిత్వశాఖ అని నామకరణం చేశారు తప్ప ఏనాడూ అది తగినట్లు పనిచేయలేదు.

ప్రత్యేక మంత్రిత్వ శాఖతోపాట ప్రాధికార సంస్థను కూడా పెట్టాలని సమాఖ్య కోరింది. సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా పాలనలోనూ శాస్త్ర సాంకేతిక అవసరాల్లోనూ ఒక అధునిక భాషగా తెలుగును ఎదిగించుకోవడానికి ఇది కీలకం. ఇందుకోసం ఉద్యమించిన తెలుగు భాషోద్యమ సమాఖ్య పదేపదే ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. అయినా పాలకుల పట్టనితనం వల్ల అంతా 'ఎవరికి పుట్టిన బిడ్డ?' అనే ధోరణిలోనే వ్యవహరించారు. తర్వాత మళ్లీ ఐదేళ్ల ఉద్యమంతో ప్రాధికార సంస్థను ఏర్పరచడానికి నాటి ముఖ్యమంత్రి ఒప్పుకొని మూడేళ్లక్రితం ఇదే రోజున – గిడుగు జయంతినాడే ప్రకటన చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులాగాకుండా చట్టసభలో ప్రవేశపెట్టి ఒక సాధికార సంస్థగా ఏర్పాటు చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. నెలరోజుల్లోనే చేస్తామన్న పనిని రెండేళ్ల తర్వాత కేవలం ఒక సాధారణ జి.ఓ గా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత నెలలు గడిచినా ఆ వ్యవస్థ ఏర్పాటే పూర్తి కాలేదు.

ఇప్పుడు ప్రభుత్వం మారింది. గత ఐదేళ్లకు పైగా అస్తిత్వంలో లేని అధికార భాషా సంఘానికి ప్రాణం పోసి, తెలుగును అధికార భాషగా అమలు పరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది సంతోషించాల్సిన విషయమే. అయితే ఇక్కడ విచారకరమైన సంగతి ఒకటి చెప్పుకోవాలి. 1966 లో రాష్ట్ర చట్టం ద్వారా ఏర్పాటయిన రాజ్యాంగబద్ధమైన చర్య ఇది. అధికార భాషగా తెలుగును ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు పరిపాలనలో ఎంత వరకు అమలు చేస్తున్నాయో పరిశీలిస్తూ తరచూ ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడం, తగు సలహాల నివ్వడం మాత్రమే దీనిపని. ఏ చట్టానికయినా నిబంధనలను రూపొందించాలి. కాని, 50 ఏళ్లు దాటినా నేటివరకూ వాటిని రూపొందించలేదు. ఏ చిన్న ప్రభుత్వ అధికారికి శిక్షలు వేయడానికి ఈ సంఘానికి అధికారం లేదు. అందువల్ల ఇది నిరుపయోగంగా ఉండిపోయింది. ప్రభుత్వం తనకుగల భాషా ప్రేమను గూర్చి చెప్పుకోడానికి ఇదొక సాధనంగా మాత్రమే మిగిలిపోయింది. దీనిలో అధ్యక్షుడుతోపాటు నలుగురు సభ్యులుంటారు. వారి పదవీ కాలం రెండేళ్లు. ఈ సంఘానికి ఒక నిరంతర కార్యాలయమంటూ లేదు. రెండేళ్లు ముగిసిన తర్వాత మళ్లీ వెంటనే దీనిని నియమించాలనే నిబంధన ఏమీ లేదు. దానితో ఇది పూర్తిగా నిరుపయోగమైపోయింది.

గత ప్రభుత్వం ముందుకు తెచ్చిన ప్రాధికార సంస్థ ఏర్పాటుతో అధికార భాషా సంఘం అదృశ్యం కావాల్సింది. జి.ఓ. గా కాక ఒక చట్టంగా ప్రాధికార సంస్థ వచ్చి ఉన్నట్లయితే అది జరిగి ఉండేది. అందువల్ల ఇప్పుడు అధికార భాషా సంఘం ఏర్పాటు చట్టబద్ధమే. ఇదంతా గత ప్రభుత్వ నేతల పట్టనితనాన్ని నిరూపిస్తున్నది. ఇప్పుడు అధికారభాషా సంఘానికి నిబంధన లను రూపొందించాలి. తగు అధికారాలు ఇవ్వాలి. పాఠశాల విద్యలో తెలుగును బోధనా మాధ్యమంగా ఉపయోగించడంతో పాటు పరిపాలనలోను శాస్త్ర సాంకేతిక రంగాలలోను తగిన ట్లుగా ఒక ఆధునికభాషగా అభివృద్ధి చేసుకోవడానికి, దాని వినియోగానికీ కావలసిన కృషి చేయడం కోసం నిపుణులతోను ఉద్యమకారులతోను కూడిన ఒక సంస్థను తెలుగు ప్రాధికార సంస్థగా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇది నిరంతరం పనిచేసే వ్యవస్థగా ఉండాలి.

జగన్‌మోహనరెడ్డిగారు అధికారంలోకి రాగానే ఒక విధాన నిర్ణయాన్ని ప్రకటించారు. తెలుగును ఒక భాషగా మాత్రమే పాఠశాల విద్యలో బోధించాలని, బోధనా మాధ్యమంగా ఒకటి నుండి పది వరకు ఇంగ్లీషే ఉంటుందని ఆ విధాన సారాంశం.

కేవలం ఒక భాషగా తెలుగును బోధించినందువల్ల అది ఒక ఆధునిక భాషగా సంపూర్ణమైన భాషగా ప్రజల అవసరాలను తీర్చగల భాషగా ఎదగజాలదు. అన్ని రంగాలలో వినియోగించ గల భాష మాత్రమే అభివృద్ధి చెందుతుంది. కేవలం సాహిత్య భాషగా కాక ఆధునిక భాషగా ఎదిగితేనే నేటి పరిస్థితులలో అది నిలువగలుగుతుంది. తోటి భాషా రాష్ట్రాలను, ఇతర దేశాలను ఈ విషయంలో మనం ఆదర్శంగా తీసుకోవాలి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారు గమనించవలసిందేమిటంటే – పాఠశాల స్థాయిలో కనీసం ప్రాథమిక విద్యవరకైనా మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి. విద్యాహక్కు చట్టం, కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విధ్యావిధానం, యునెస్కో పదేపదే మొత్తుకుంటున్నదీ మేధావులూ విద్యా నిపుణులూ ఎలుగెత్తి చెబుతున్నదీ ఇదే. ప్రాథమిక విద్యను విద్యార్థి మాతృభాషలో కాకుండా ఇతరభాషలో నేర్పడం అశాస్త్రీయం, అమానవీయం, అర్థరహితం కూడా. ప్రభుత్వం ఈ శాస్త్రీయమైన పంథాను చేపట్టి, కనీసం 5వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలో బోధనను తప్పనిసరి చేస్తూ ఇంగ్లీషు భాషనూ దానితోపాటు 1 లేక 2 ఇతర భాషలను కూడా నేర్పవచ్చు. బోధనా మాధ్యమంగా మాత్రం పరభాషలను పసివారిపై రుద్దకూడదు.

ఒక భాషగా తెలుగును బోధించడాన్ని పాఠశాల విద్యలో తప్పనిసరి చేస్తున్న జి.ఒ నెం. 86/2003ను గాని ఆ తర్వాత ప్రభుత్వాలు ఇదే విషయంపై జారీ చేసిన అనేక ఉత్తర్వులనుగాని ఏనాడూ ప్రభుత్వాలు సరిగా అమలు చేయలేదు. మొక్కుబడి చదువుగా మాత్రమే తెలుగు బోధన మిగిలిపోయింది. అందువల్లనే తెలుగువారి పిల్లలు కనీసం పాఠశాల స్థాయిలోనైనా మాతృభాషలో తగిన మార్కులు తెచ్చుకోలేక చతికిలబడుతున్నారు. ఇంగ్లీషుభాష అవసరాన్ని ఎవరూ కాదనడంలేదు. కాని తన సొంతభాషపై పట్టు సాధించిన తర్వాత మాత్రమే పరభాషలను గురించి ఆలోచించాలి. ఇక్కడ గిడుగు రామ్మూర్తిగారేం చెప్పారో గుర్తు చేసుకుందాం – "ప్రజలకు సులభంగా తెలిసేటట్లు మాతృభాషలో సమస్త శాస్త్రములు బోధించవలెను... భావము స్పష్టంగా తెలియవలెనంటే భాష సుపరిచితముగా ఉగ్గుపాలతో అలవడ్డ మాతృభాష అయి ఉండాలి. ఒకరి మనస్సును ఇంకొకరి మనస్సుతో కలిపే సాధనము భాష. కళ్లజోడు నేత్రాలను ఎదుట ఉన్నవారి వస్తువులనూ ఎలాగ కలుపుతుందో అలాంటిది. ఈ ఉపకరణము ఉండిన్నీ అది అక్కడ ఉన్నట్టు ఉపయోగించేవాడు గుర్తించకుండా ఉండేటంత చక్కగా అమరి ఉండవలెను. దృష్టిని నిరోధించేదిగా కాకుండా సాయము చేసేదిగా ఉండవలెను. అటువంటి చక్కని భాష సర్వ వ్యవహారములకూ సారస్వతానికీ సాధనముగా ఉంటుంది. ఉండవలెను. అదే మీకు జయమును చేకూరుస్తుంది". ఇదే మాతృభాష ప్రాధాన్యత. తగిన స్థాయికి చేరిన తర్వాత ఎన్ని భాషలనయినా అవలీలగా విద్యార్థి నేర్చుకోగలడు. వాటిలో పాండిత్యాన్ని చేకూర్చుకోగలడు. ఈ వాస్తవాన్ని, ఇందులోగల శాస్త్రీయతనూ బాధ్యులందరూ తెలుసుకోవాలి.

ఈ రాష్ట్రం తెలుగు వారి రాష్ట్రం. భాషా ప్రాతికన ఏర్పడిన రాష్ట్రం. ప్రజల వారిభాషలోనే పరిపాలనా వ్యవహారాలను అందుకోవాలనే మౌలిక అంశం దీని ప్రాతిపదిక. అంతేకాదు తమ మాతృభాషలోనే జ్ఞానాన్ని ఎంతవరకైనా సంపాదించుకోగల అవకాశాన్ని, సౌకర్యాలను ప్రభుత్వం కలిగించాలి. ఇందుకు విరుద్ధంగా ఏం జరిగినా అదంతా ప్రజాస్వామ్యానికీ, ప్రజలకు వ్యతిరేకమే.

**– వ్యాసకర్త తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు**

**(ఆగస్టు 29, ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో)**

# చెన్నైలో తెలుగు భాషా దినోత్సవం



చెన్నైలో గిడుగు జయం తిని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటి, కేసరి మహోన్నత పాఠశాల సంయుక్తంగా ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భాన్ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొన్నారు. టి.నగర్‌లో కేసరి మహోన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యయుడు నాగులు గోపాలయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా బి.మురళీకుమార్ , కె.యస్.వి.ప్రసాద్, కె.నరసారెడ్డి పాల్గొన్నారు. వి.కృష్ణారావు తదితరులు సభ నిర్వహించారు. అనేక సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి. తెలుగులో ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చారు.

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# తెలుగుభాషా దినోత్సవం అంటే !!

ఇప్పుడు రాష్ట్రమంతా గిడుగురామ్మూర్తి పంతులుగారి జన్మది నాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాలు జరుగుతు న్నాయి. నాకు తెలిసి తెలుగు ఉపాధ్యాయులు, ఉపన్యాసకుల్లో చాలా మందికి గిడుగు వారు ఆశించిన తెలుగు ఏది? అనేది తెలియదు.

అందుకే పిల్లలతో పద్య పఠనాలు చేయించి, పండితుల్ని పిలిపించి అష్టావధానాలు నిర్వహించి, కృష్ణదేవరాయల కాలపునాటి భువనవిజయం ప్రదర్శించి బహుమతులు ప్రదానం చేసి, సన్మానా లతో ముంచెత్తు తున్నారు. ఇది గత సంవత్సరం నేను చాలా పాఠశా లలు కళాశాలల్లో ప్రత్యక్షంగా గమనించినది. అష్టావధానం, భువన విజయం వంటి వాటిని నేను వ్యతిరేకించడం కాదు. అవి భాషకు సంబంధించిన కళారూపాలు. వాటికీ గిడుగువారు ఆశించిన తెలుగుకూ సంబంధమే లేదు.

కొన్ని చోట్లయితే గిడుగువారు ఎక్కడ పుట్టినారు? అతని అమ్మానాయనగార్ల పేర్లు? ఎక్కడెక్కడ పని చేశాడు? ఏ పుస్తకాలు రాశాడు? ఎప్పుడు కనుమరుగైనాడు వంటి విషయాలు పిల్లల చేత బట్టీ పట్టిస్తున్నారు!! ఇప్పటిదాకా తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన వందలూ వేలకొద్దీ భాషాభిమానుల్లో గిడుగువారి జన్మదినాన్ని మాత్రమే భాషా దినోత్సవంగా ఎందుకు జరుపుతున్నారో మూలా లకు వెళ్లి ఆకళింపు చేసుకోలేక పోతున్నారు.

గిడుగురామ్మూర్తి గారు 1880 లో పర్లాకిమిడి మహారాజా వారి కళాశాలలో చరిత్ర ఉపన్యాసకులుగా పని చేశారు. అక్కడికి దగ్గర అడవుల్లో ఉండే సవరభాష అమ్మనుడిగా మాట్లాడే విద్యార్థులు కూడా వచ్చేవారు. అంటరానితనమూ, బడుగుల అణచివేతా విరివిగా ఉన్న ఆకాలంలోనే అతను కొందరు బీద సవర విద్యార్థు లను తన ఇంట్లోనే ఉంచుకొని చేయూత నిచ్చేవాడు. ఆ పిల్లలు మంచి క్రమశిక్షణతో కష్టపడి చదివేవారు. ఇంటి పనులు పొలం పనులూ కళాత్మకంగా చేసేవారు. అయినా చదువులో మాత్రం అందరికంటే వెనుకబడి ఉండేవారు. ఏ విషయాన్నడిగినా మూగగా ఉండేవారు... స్వేచ్ఛగా గొంతువిప్పి మాట్లాడేవారుకారు! అది ఎందుకో అతనికి అర్థమయ్యేదేకాదు!! అందుకే అడవుల్లోని వారి జీవన విధానం తెలుసుకోవాలన్న కుతూహలంతో తరచూ వారి ఆవాసాలకు వెళ్లేవాడు.

వారు పాఠశాలలో ఉన్నదానికి భిన్నంగా అక్కడ చురుగ్గా గంతులేస్తూ గలగలా మాట్లాడుతూ ఉన్నదాన్ని గమనించి ఆలోచన లో పడ్డాడు. ఫలితంగా వారు నిత్యవ్యవహారంలో మాట్లాడే సవర భాషకు అక్షరాలు వ్యాకరణం తయారు చేసి వారి భాషలోనే పాఠాలు బోధించాడు. అప్పుడు ఆ విద్యార్థులు మునుపటికన్నా చలాకీగా పాఠాలు చదువుతూ అడిగినవాటికి టకటకా జవాబులు చెబుతూ పరీక్షల్లో మునుపటికన్నా ఎక్కువ మార్కులు సాధించ గలిగారు!!

ఈ ప్రయోగం ఆధారంగా వ్యవహారిక భాషోద్యమం ప్రారంభించాడు. దానితో ఇనుప పదాలయిన "నావుడు..అనువుడు" నుంచి కొంత సరళీకరించ బడినప్పటికీ మన పాఠ్యాంశ బోధన ప్రజల నిత్యవ్యవహార పదాల సహజత్వాన్ని అందుకోలేక పోతున్నది. ఆ విషయాన్ని నా అనుభవపూర్వకంగా చెబుతాను...


వానాకాలం చదువులవంటి వాటితో పట్టాపుచ్చుకొని ఉపాధ్యా యుడిగా బడిలో చేరి 1995 అనుకొంటా....మూడవ తరగతికి, కిరికెర హరిజన వాడ అనే ప్రాథమిక పాటశాలలో ఒక పాఠం. పేరు "కొబ్బరి చెట్టు". ఇది జలవనరులు మిక్కుటముగా ఉన్న చోట ఏపుగా పెరుగుతుంది. ఇది వివిధరకాలుగా మనకు ఉపయోగ పడుతుంది. లేత కాయలను కొబ్బరిబోండాలంటారు. వేసవికాలంలో ఇష్టంగా తాగుతారు. మగ్గిన కొబ్బరికాయల నుంచి తైలం తీస్తారు. దీనిని తలకు నూనెగానూ, వంటకాలకూ ఉపయోగి స్తారు. కొబ్బరి చెట్టు ఆకుల నుండి ఈనెలు తీస్తారు, వీటిని చీపు ళ్లుగా వాడుతారు. కొబ్బరి కాయ మీద ఉండే పీచుతో తాళ్లు పేను తారు. పరుపులు, తలదిళ్లకు వాడుతారు...ఇలా సాగుతుంది పాఠం.

ఆ బడి ముందే కొబ్బరిచెట్టు ఉంది. పాఠాన్ని చెప్పిన తరువాత జవాబులడిగితే తరగతిలో ఉన్న పది మందిలో ఏ ఒక్కరిద్దరు మాత్రమే చెప్పగలిగారు. వారి తడబాటు నాకు అర్థమయ్యింది. వెంటనే పాఠాన్ని "టెంకాయ మాను" అని మార్చి, ఇది నీళ్లు దండిగా ఉండే తావున ఎత్తుగా పెరుగుతుంది. దీన్ని మనము చాలా రకాలుగా వాడుకోవచ్చు. న్యాత(లేత) కాయలను యళనీరు అంటారు. యండాకాలములో దీనిని బాగా తాగుతారు. ఎండిన కొబ్బెర నుంచి నూనెను తీస్తారు. దీనిని వెంట్రుకలకు పూసుకొంటారు. వంటల్లోకూడా వాడుతారు. టెంకాయ ఆకుల నుంచి ఊచలు తీస్తారు. ఈ ఊచలతో పరకలు తయారు చేస్తారు. టెంకాయ మీద ఉండే నారతో పగ్గాలు పేడుతారు. లేపులు (పరుపులు) తలమూటలకూ వాడుతారు...అని బోర్డు మీదరాసి జవాబులడిగితే పదిమందిలో ఎనిమిది తొమ్మిదిదాకా టకటకా

( ...తరువాయి 20 వ పుటలో )

వకుళాభరణం రామకృష్ణ
9866841409

# చారిత్రక సంపదను కోల్పోతున్నామా?



ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి రెండు రాష్ట్రాలు ఏర్పాటయ్యాక, ఉమ్మడిగా వున్న స్థిరచరాస్తుల విషయం అటుంచి, చరిత్ర, సంస్కృతులకు చెందిన ఆర్కైవ్స్, ఆర్కియాలజీ, అపురూప రాతప్రతుల గ్రంథాలయం – ఈ సంస్థలను, వీటిలోని గ్రంథ, వస్తు సామాగ్రిని శాస్త్రీయంగా, సక్రమ రీతిలో విభజించడానికి అనువుగా, ఇరు ప్రభుత్వాల తరపున 3 కమిటీలు నియమించారు. ఈ వకుళాభరణం రామకృష్ణ కమిటీలు సమావేశమై, రెండు రాష్ట్రాలకు చెందిన డాక్యుమెంట్లు, గ్రంథాలు, పురావస్తు సామగ్రి – వీటిని ఇరుప్రాంతా లకు ఆమోదయోగ్యమైన రీతిలో విభజించి పట్టికలను తయారు చేశారు.

ఇది పూర్వరంగం. కాగా, ఆంధ్రప్రదేశకు చెందిన చారిత్రక సంపద, కొద్ది భాగం ఆర్కైవ్స్ మినహా, ఆంధ్రప్రదేశ్‌కు చేర్చ లేదు. ఆర్కియాలజీ గ్రంథాలయంలోని గ్రంథాలు బదిలీ చేశారని

**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చారిత్రక సంపద, కొద్ది భాగం ఆర్కైవ్స్ మినహా, ఆంధ్రప్రదేశ్‌కు చేర్చలేదు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడి నప్పుడు, మద్రాసు ఆర్కైవ్స్ నుండి బదిలీ చేసిన అనేక విలువైన గ్రంథాలు, డాక్యుమెంట్లు పోగొట్టుకొన్నామని, అప్పట్లో ఎందరో భావించారు. అదే పరిస్థితి నేడు రాకూడదు.**

తెలుస్తున్నది. విభజించాల్సిన గ్రంథాలు యింకా కొన్ని మిగిలి వున్నయని తెలుస్తున్నది. దీనిలో నిజానిజాలు ఎంత వరకు విశ్వసించాలో తెలీడం లేదు. ఇదిలా వుండగా, బదిలీ చేసిన కొద్ది భాగం డాక్యుమెంట్లు, గ్రంథాలు, ఎక్కడ, ఎలా భద్రపరచారో తెలుసుకోవాలి. గ్రంథాల విషయంలో, భద్రంగా వుంచితే, వాటిని సక్రమంగా ఏర్పాటు చేసుకోవచ్చు. చారిత్రక డాక్యు మెంట్లు, గెజిట్లు, జనాభా లెక్కలు, రెవెన్యూ రికార్డులు, వీటిని క్రమపద్ధతిలో కేటలాగు చేసి, పరిశోధకులకు అందుబాటులో వుండే విధంగా ఏర్పాటు చేయాలి. దీనికి ఇప్పుడున్న డైరెక్టరు మినహా, సుశిక్షితులైనవారు లేకపోవడం, అనర్థాలకు, ఇబ్బందులకు దారితీస్తుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న సంస్థ కాబట్టి, ప్రారంభం లోనే తగుజాగ్రత్తలు తీసుకోకుంటే, ఆ తర్వాత పరిశోధకులు అనేక ఇబ్బందులకు లోనవుతారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు, మద్రాసు ఆర్కైవ్స్ నుండి బదిలీ చేసిన అనేక విలువైన గ్రంథాలు, డాక్యుమెంట్లు పోగొట్టు కొన్నామని, అప్పట్లో ఎందరో భావించారు. అదే పరిస్థితి నేడు రాకూడదు. హైద్రాబాద్‌లో వున్నంత కాలం వాటిని సురక్షితంగా భద్రపరిచారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థకు, గతంలో పని చేసి రిటైరయిన ఉద్యోగుల సహాయ, సహకారాలను తీసుకోవచ్చు. అదే క్రమంలో అనుభవజ్ఞులైన పరిశోధకుల మార్గదర్శకత్వం కూడా ఆర్జించ వచ్చు. ఆర్కియాలజీ, రాతప్రతుల గ్రంథాలయాలకు సంబంధించి, పంపకం జరిగినా, అక్కడికి చేరవేయడంలో జాప్యం ఎందుకు జరుగుతుంది? ఈ ప్రక్రియకు కావల్సిన నిధులు కొరవడ్డవనా? సంబంధిత అధికారు లను ప్రభుత్వం నిర్దేశాలు పంపడంలో అలసత్వమా? ఈ సంస్థల విభజనలు, ఉభయ ప్రభుత్వాల సమ్మతితో జరుగుతున్న ప్రక్రియ. ఈ సందర్భంలో మరో ముఖ్యమైన సంస్థ గూర్చి ప్రస్తావించాలి. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భాగంగా వున్న ఓరియంటల్ రీసెర్చి లైబ్రరీకి సంబంధించినది. గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ అపురూప ప్రాచ్య పరిశోధనా సంస్థ నిన్న, మొన్నటిది కాదు. 1939 సంవత్సరంలో తిరుపతి – తిరుమల దేవస్థానం దీన్ని స్థాపించింది. తాళపత్రగ్రంథాలను, రాగి రేకులను, అరుదైన గ్రంథాలను పరిష్కరించి, ప్రచురించడం, తద్వారా సాహిత్య, భాషా, సాంస్కృతిక (నృత్యం, సంగీతం మొ.) పరిశోధనలకు చేయూత నివ్వడం ఈ సంస్థ ప్రధాన ఆశయం. గతంలో ప్రముఖ పరిశోధకులు, పండితులు, శ్రీయుతులు వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ, డి.టి. తాతాచార్య, మానవల్లి రామకృష్ణ కవి, తిరుమల రామచంద్ర ప్రభృతులు ఇక్కడ తమ పరిశోధనలు చేపట్టారు. అన్నమా చార్య రాగి రేకుల పై రాసిన కీర్తనలను పరిష్కరించి, అచ్చుకు సిద్ధం చేసినది ఈ సంస్థ ఆధ్వర్యంలోనే! 'సంస్కృత వాఙ్మయ చరిత్ర' లాంటి ప్రసిద్ధ గ్రంథాలు ఈ సంస్థ ప్రచురించినవే. పురావస్తు పరిశోధకుడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి తిరుమల దేవాలయపు గోడల పై వున్న శాసనాలను పరిశీలించి, పరిష్కరించింది ఈ సంస్థ ఆధ్వర్యంలోనే! శ్రీ వేంకటేశ్వర స్వామి, అన్నమాచార్య పేర్లతో గౌరవ పీఠాలు ఏర్పర్చారు కూడా. 1956లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించినప్పుడు, దేవస్థానం వారు, ఈ సంస్థకొక భవనాన్ని నిర్మించి విశ్వవిద్యాలయానికి బదిలీ చేశారు. అపురూప పరిశోధనా సామగ్రి ఈ సంస్థ కాణాచి. ఇక్కడున్న అరవైవేల రాతప్రతుల్లో, ఇరవై వేలదాకా తెలుగులో, మిగతావి 'గ్రంధి', 'నందినగరి', దేవనాగరి, తమిళం, మళయాళం లిపుల్లో వున్నాయి. 'గ్రంధి' లిపి తెలిసిన పండితులు కొద్దిమందే వుండగా, అది పరిష్కారానికి ఎక్కువగా నోచుకోలేదు.

అసంఖ్యాకంగా వున్న ఈ అపురూప రాత ప్రతుల్లో సుమారు సగం మాత్రమే డిజిటలైజ్ చేశారని అభిజ్ఞుల అంచనా.

ఇక్కడున్న గ్రంథాలయం కూడ సంపన్నమైనదే! అచ్చయిన ముఖ్య గ్రంథాలతోపాటు, 'ఇండలాజికల్ జర్నల్' కాపీలు పెద్ద సంఖ్యలో వున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థ తరఫున 'జర్నల్' క్రమం తప్పకుండా ప్రచురింపబడి, ఇతర దేశాలకు కూడా పంపిస్తున్నట్లు తెలుస్తున్నది..

ఇంతటి గతవైభవం ఉన్న ఈ మహోన్నత సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తిరుమల - తిరుపతి దేవస్థానం వారు ఇటీవల దాకా సాలుకు కోటి రూపాయల భారీ గ్రాంటు యిచ్చేవారు, కొన్నేళ్ళుగా అది ఆగిపోయింది. ఇది ఎందుకు ఆగిపోయిందో, ఎవరి పొరపాటు లేక నిర్లక్ష్యం వల్ల జరిగిందో తెలియరావడం లేదు. దీన్ని గూర్చి విచారణ జరపాల్సి ఉంటుంది. దేవస్థానం వారిని అర్థించి, ఈ గ్రాంటును పునరుద్ధరించుకోగలిగితే, ఈ సంస్థ భవిష్యత్తు నిర్వహణకు ఎంతగానో దోహదపడుతుంది. గతంలో ముప్పై మందికి పైగా పని చేస్తున్న సంస్థలో, ఇవ్వాళ ఇద్దరు శాశ్వత ఉద్యోగులు, కొద్ది సంఖ్యలో సహాయకులు, అటెండర్లుగా వున్నారని వింటున్నాం. వీరి జీతభత్యాలకు, తాళపత్రాల పునరుద్ధరణకు కావాల్సిన కొద్దిపాటి గ్రాంటును, విశ్వవిద్యాలయం తనకున్న పరిమిత నిధుల నుండి ఈ సంస్థకు ఇస్తున్నది. కాబట్టే ఇది ఇంకా మనుగడ కొనసాగిస్తున్నది.

పరిస్థితులు ఇలాగే కొన్నాళ్ళు కొనసాగితే ఇక్కడున్న అమూల్య మైన రాత ప్రతులు శిథిలావస్థకు చేరుకోక తప్పదు. ఇప్పటికే కొన్ని శిథిలమై పోయాయేమో కూడా! ఇటీవల ఈ సంస్థ నడుస్తున్న తీరు, సంస్థ భవిష్యత్తు గూర్చి లోక్‌సభలో ఒడిషా నుంచి ఎన్నికయిన సభ్యుడు (ఆంధ్రప్రదేశ్ నుండి కాదు) ప్రస్తావించి, దీన్ని కాపాడాలని సూచించడం గమనార్హం. దీని భవిష్యత్ కార్యాచరణ, విశ్వవిద్యాలయ పరిధిలో వున్నా, నిధులు దేవస్థానం నుండి, ప్రభుత్వం నుండి గ్రాంటు రూపంలో పొంది, దీన్ని ఆదుకోవాల్సి ఉంటుంది. ఈ విజ్ఞప్తులు, సూచనలు ప్రభుత్వానికి విన్పిస్తున్నాయా? అరుదైన చారిత్రక, సాంస్కృతిక సంపదను కాపాడుకోలేకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోమా?

23-8-2019 ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

(18 వ పుట తరువాయి....)

చెప్పారు!!

ఇక్కడ రెండు చోట్లా ఉన్నది తెలుగే!! మరి తేడా ఏమిటి? "కొబ్బెరచెట్టు" శిష్టవ్యవహారికము. "టెంకాయ మాను" ఆ పల్లె ప్రజల నిత్యవ్యవహార జీవభాష!! మొదటి దానిని వారు నేర్చుకొని గుర్తుపెట్టుకోవాలి. రెండవది మాత్రం మనం ఊపిరి తిత్తుల లోనికి అసంకల్పితంగా గాలిని పీల్చినట్లు అప్రయత్నంగా పలుకగలిగే అమ్మనుడి. ఈ అమ్మనుడి పదజాలం తోనే విద్యాబోధన ఉండాలని ఉద్యమాన్ని నడిపినవారు గిడుగురామమూర్తిగారు.

ఆ చిన్న కిటుకును ఉపాధ్యాయులు తెలుసుకొని విద్యాబోధన పదవతరగతిదాకా చేయగలిగితే ఆయా ప్రాంతాల విద్యార్థుల శ్రమ తగ్గడమేకాక ప్రతి ప్రాంతంలోనూ మారుమూల పల్లెల్లో ప్రజల పెదాల మీద జీవం పోసుకొని బతుకీడుస్తున్న ఎన్నో అపురూపమైన, అందమైన పదాలను రక్షించి భాషా సంపదను వృద్ధి చేసికొన్నవారమవుతాం.

ఇలా చెబితే..."మన ఇతిహాసాలు, పురాణాలు, ప్రబంధాలు,శతకాలు....వగైరాలు ఎంతో గొప్పవి! ఎంత అద్భుతమైన భాషలో రాశారు! వాటిని తక్కువచేయడం అవివేకం మూర్ఖత్వం" అని చాలా మంది పండిత శ్రేష్ఠులు ఒంటికాలిపై లేస్తారు!! వారికి ఒక్కటే సమాధానం.. "అవి చక్రవర్తులు, రాజులు, రాణులు ఆస్థాన విద్వాంసుల చేత ఆ కాలానికి తగ్గట్టు రాసినవి. ఇప్పుడున్నది ప్రజాస్వామ్యం కాబట్టి ప్రతిదీ వారికి చేరువగా వారికోసమే తయారు చేయాలి. రాజులు రాణుల దగ్గర ఉన్న వజ్ర వైఢూర్య, బంగారూ వెండికన్నా ప్రజలు నిత్యం పొర్లాడే మట్టి ఎప్పటికీ గొప్పదే!!వెలకట్టలేనిదే!!"

ఈ వ్యాస రచయిత ప్రముఖ కథా రచయిత, కవి, ఉపాధ్యాయుడు, హిందూపురం

# కడపజిల్లా మైదుకూరులో తెలుగు భాషా దినోత్సవం




కడపజిల్లా మైదుకూరులో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండల వనరుల కేంద్రంలో తెలుగుభాషా దినోత్సవాన్ని 29న నిర్వహించారు. మండల విద్యాశాఖ, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎం.ఇ.ఓ.టి.ఎం. పద్మలత అధ్యక్షత వహించారు. తెలుగు పద్యపఠన పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. సమాఖ్య ప్రతినిధులు మహానందప్ప, వీరాస్వామి, ధరిమిశెట్టి రమణ, ఉపాధ్యాయ ప్రతినిధులు, పాలకొండయ్య బి.కె.సురేష్, వీర గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

# 'ఇంటిపేరు కస్తూరివారు...'

శాస్త్రవేత్తలు - ప్రజా శాస్త్రవేత్తలు విద్యావిధానాలు. కస్తూరి రంగన్ కమిటీ నివేదిక.

'చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్రవిజ్ఞానంలోని ప్రాథమిక భావనలకు బీజాలుంటాయి. విద్యార్థికి క్లాస్ రూమ్ బయట మాతృ భాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, క్లాస్‌రూంలో పరాయి భాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదేకాక, చదువుమీద ఆసక్తి తగ్గుతుంది.'

మన విద్యావిధానం మీద వేసిన కమిటీలలో ప్రసిద్ధమైన కొఠారి కమిటీ చెప్పిన ఈ మాటలకు తగ్గట్లు పాఠాలు పెట్టకుండా, మన విద్యావేత్తలు దంతవేదాంతాలతో, ఉపదేశాలతో, కొత్త ప్రణాళికలతో పొద్దుపుచ్చుతుంటారు. ఆ పరంపరలో వచ్చినదే కస్తూరి రంగన్ నివేదిక.

2014 లో భాజపా అధికారంలోకి వచ్చిన కొత్తలో, పోటీ పరీక్షలలో నగరాలలో చదివినవారితో సమానంగా గ్రామీణ విద్యార్థులకు అవకాశాలు లేవంటూ ఆందోళన మొదలై క్రమంగా చప్పబడింది. అప్పట్లో వేసిన టి.యస్.సుబ్రమణియన్ కమిటి నివేదికను సరిదిద్దవలసిందిగా అంతరిక్ష శాస్త్రవేత్త కస్తూరి రంగన్ కమిటీని కోరింది.

ఈ కమిటీ తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు కత్తిపట్టకుండా భారతీయ విద్యలు ఖండాంతరాలను ప్రభావితం చేసాయని చెపుతూ, అటువంటివే స్వామి వివేకానంద సూక్తులను పేర్కొంటూ ముందుకు సాగింది.

జ్ఞానం ఒక పరిమళం. అది జిజ్ఞాసువులను ఆకర్షిస్తూనే ఉంటుంది. ఇచ్చి పుచ్చుకోటాలు జరుగుతూనే ఉంటాయి. పాహియన్, హుయన్‌సాంగ్ వంటి చైనా విద్యార్థులు చిరకాలం ఇక్కడవుండి, మన గ్రంథాలు తీసికెళ్ళి అనువదించుకున్నారు. పర్షియన్ పండితులు మన దేశాన్ని హిందూ దేశమన్నట్టే, మన అంకెలకు హిందూ అన్నారు. వారిద్వారా మన చదువులు యూరప్‌కు అందాయి. ధ్వంసమైన బౌద్ధగ్రంథాలను తిరిగితేవటంలో రాహుల్ సాంకృత్యాయన్ వంటి వారు చాలా శ్రమ పడ్డారు .ముస్లిం పాలనలో మందుగుండు సామగ్రి, పారసీగుర్రాలు, పెర్షియన్ చక్రం, కాగితం వచ్చాయి. పోటీ, వేగం, రాత కోతలను పెంచాయి.

మనదేశంలో అష్టాదశవృత్తులవారి ఉత్పత్తులకు ప్రపంచ మంతా గిరాకీ ఉండేది.కానీ వారి శాస్త్ర సాంకేతిక విశేషాలు మన వాచకాలలో చోటుసుకుంటే ఆ యా నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థులకు సమానావకాశాలు దక్కి ఉండేవి. నగరాలలో ఉన్న విద్యార్థులకు కూడా ఈ మూలాలు తెలిసి ఉండేవి. ఆంగ్లేయుల పాలనలో సంప్రదాయ జ్ఞానాన్ని బాగానే అధ్యయనం చేసారు కానీ వాటిని పాఠాలలో చేర్చలేదు.

ఈ అవసరాన్ని గుర్తుచేయటానికి కావచ్చు సంఘపరివారంలో సామాజిక సమరసత 150 వ వివేకానంద జయంతి ఉత్సవాలలో వనవాసి, మత్స్యకార, అస్మితలను చేర్చింది. స్థానిక సంస్కృతులను గుర్తించ వలసిందిగా, గౌరవించ వలసిందిగా పిలుపునిచ్చింది.

కస్తూరి రంగన్ పనిచేసిన ఇస్రో, ప్రళయ కావేరిలోని శ్రీహరి కోటలో యానాదులను, మత్స్యకారులను తొలగించి రాకెట్ ప్రయోగ కేంద్రం నెలకొల్పింది.యానాదులకు మొక్కుబడిగా సంక్షేమ కార్యక్రమాలను నడుపుతుంది. కానీ, పక్కనే ఉన్న చెన్నైలో యానాదులను ఇరులవారుగా పిలుస్తారు. పాముల విషంపిండి తోలుతీసి అమ్మటం, ఎలుకలు పట్టటం ఇదీ వారి జీవన విధానం. పాము తరచు విషం పెడుతుంది, తోలుతీసి చంపేస్తే ఒకసారి మాత్రమే ఆదాయం వస్తుంది, కాబట్టి చంపకుండా విషం తీయడం నేర్చుకోండి అని నచ్చ చెప్పి, ఉద్యోగ రీత్యా చెన్నైలో స్థిర పడిన విదేశీయుడు జాన్ వారికి నచ్చచెప్పి శిక్షణ ఇచ్చాడు. వారిని సహకార సంఘంగా ఏర్పరచాడు. అతని కొడుకు రాములస్ విటేకర్ కూడా ఇదేకృషి కొనసాగించి డిగ్రీలు లేని సర్పశాస్త్రవేత్తగా పేరు పొందాడు. అతనికంటే 20ఏళ్ళు చిన్నదైన జానకి అనే స్థానిక ఫోటోగ్రాఫర్ సహచరిగా చేరింది'. మై హస్బండ్ అండ్ అనిమల్స్' అనే శీర్షికతో ఆంగ్ల దినపత్రిక ది హిందూలో ఆదివారం తమ అనుభవాలు రాస్తుంటుంది.

వాళ్ళు ఆగుంబేలో పాముల అభయారణ్యం అభివృద్ధి చేస్తున్నారు. ప్రపంచంలో ఇటువంటిది ఎక్కడాలేదు.

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం సరస్సులలో పాముల సంతతి పెరిగి పోయింది.వాటిని అదుపులో పెట్టటానికి అక్కడి శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి.వారు రామ్ ను సంప్రదించారు. అయన ఇరుల బృందంతో వెళ్ళాడు. వాళ్ళు పాములతో ఆటాడుతూ వేటాడుతూ పాముల సంఖ్యను అదుపులోకి తెచ్చిన వార్త ప్రపంచ మంతా మారుమోగి పోయింది. స్ఫూర్తిదాయకమైన ఈ కృషి రాకెట్ కేంద్రం శాస్త్రవేత్తల దృష్టికి రాలేదు. నెల్లూరు, చెన్నైలలో ఉండే ప్రముఖులు ఈ కేంద్రానికి వచ్చే ప్రధాన మంత్రుల దృష్టికి ఈ విషయం తేలేదు.

ఇరుల యానాది తెగలవారు పొలాల్లో ఎలుకలు పడతారు. వారికి ఉపాధి భద్రత కల్పిస్తే ఎలుకలను చంపటానికి విష గుళికల వాడకం తగ్గించవచ్చునని, రామ్, జిల్లా కలెక్టరుకు ప్రతిపాదించారు. వాళ్ళను చదివించి పైకి తీసుకు రావాలి కానీ, వాళ్ళచేత ఎలుకలు పట్టించటం ఏం బాగుంటుంది అంటూ కలెక్టర్ పెదవి విరిచాడు. వాళ్ళు తమ పిల్లలు బాగుపడతారని చదివిస్తారు.ఒకరిద్దరికి చిన్న

# తెనాలిలో తెలుగుభాషా దినోత్సవం



తెలుగుపట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధాన మేమిటో స్పష్టంగా ప్రకటించాలని ప్రాథమిక విద్యను మాతృభాషలో తప్పనిసరి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ముఖ్యమంత్రికి రాసిన లేఖను తెనాలి ప్రాంత తెలుగుభాషోద్యమ సమాఖ్య నేతలు ఆర్ డి ఓ గారికి అందజేశారు. సమాఖ్య కేంద్ర ఉపాధ్యక్షులు శ్రీ కొత్తపల్లి రవిబాబు, తెనాలి శాఖ అధ్యక్షులు శ్రీ సామల లక్ష్మణబాబు, అధ్యక్షులు శ్రీ దావులూరి కాంతారావు, కార్యదర్శి ఎర్రంశెట్టి హనుమంతరావు, రచయిత చందు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న ఉద్యోగాలొస్తాయి. కానీ చాలామంది మామూలు కూలి పనులు చేసుకుంటూ ఆకలి దప్పులతో అలమటిస్తుంటారు.

ఇస్రో సంస్థలలో ఒకటి ఇంకోయిస్ చేపలు దొరికే ప్రాంతాలను, సునామి, తుఫాను లాంటి ప్రమాదాలను గుర్తించి హెచ్చరికలు పంపుతుంది. అయితే ఈ హెచ్చరికలు సముద్ర తీరానికి 50 కి.మీ. దాటి వెళ్లి, వేటచేసే వ్యాపారుల భారీ వాహనాలకు తప్ప, పడవలతో 10,15 కి.మీ.ల లోపల వేటాడే మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసే సూక్ష్మ ప్రణాళికలు ఇంకా తయారు చేయలేదు. మన పరిశోధనల ప్రాథమ్యాలను, శాస్త్రజ్ఞుల దృష్టిని ఈ రెండు ఉదాహరణలు స్పష్టం చేస్తాయి. అస్మిత ఉత్సవాలు జరిపిన పరివారం అవి ఐపోగానే చేతులు దులుపుకుంది...కమిటీ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్ళే ప్రయత్నం చేయలేదు. అన్నట్టు వేదిక్ మాథమాటిక్స్‌లో నిపుణుడైన ఒక శంకరా చార్యను రాకెట్ కేంద్రం వారు ఆహ్వానించారు. బాగానే ఉంది. మరి పక్కనే ఉన్న రామ్ దగ్గర ఎప్పటికి నేర్చుకుంటారో!

మత్స్యకారులకోసం ఏనాటికి పని మొదలు పెడతారో!?. మన బడాయి అంతా ఇంట్లో ఈగలమోత - బయట పల్లకి మోత.

అవినీతి గురించి ఈ నివేదిక ప్రస్తావించింది కానీ అందుకు తగ్గ చదువులేవీ నేర్పటం లేదని గుర్తించలేక పోయింది. ఈ విషయంలో ప్రభుత్వం, విద్యాలయాలు-ఇద్దరూ తోడు దొంగలే.

భూమి, అడవి, నీరు- వీటికి సంబంధించిన ప్రభుత్వం వాడే పటాలు లెక్కల గూర్చి మన బడులలో చెప్పరు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం, గూడెం సంప్రదాయ సరిహద్దుల మధ్య ఉమ్మడి వాడుకలను పేర్కొంటూ, వాటి గుర్తింపు కోసం పటంతో దరఖాస్తు చేయ వలసిందిగా ఆదేశించింది. అదేవిధంగా తీరంనుడి సముద్రం లోకి ఐదు కి.మీ.ల వరకు మత్స్యకారులకు హక్కులు కల్పిస్తామంటూ 2009లో బిల్లు తయారు చేసారు. ఈ పటాలు ఎలాగీయాలో, ఐదు కి.మీ. ఎంతవరకో ఎలాగుర్తించాలో బడిలో సార్వత్రిక విద్యలో భాగంగా చెప్పక పోతే ఎలాతెలుస్తుంది?. అరకొర జ్ఞానంతో ప్రజలను మభ్యపెట్టి దోచుకునే దళారీలు పెరుగుతున్నారు. దోపిడీ అసమానతలకు దారి తీస్తుంది. ఇలా ఉన్నది గుర్తించక పోవటం, కావలసినది నేర్పకపోవటం మన విద్యావిధానం!

బోధనామాధ్యమంగా మాతృభాష ఉండాలి. అయితే భాషలో బతుకు తెరువులలో విజ్ఞానం నుడికారంలో ఉంటుంది. ఇవేళ శాస్త్రాలను బోధించే మాతృభాషలో రంగు రుచి వాసనతో కూడిన ఈ నుడికారం ఉండదు. సుమారు నాలుగైదు వందల భాషలు గల మనదేశంలో ఎంత ప్రయత్నిస్తే అంత జ్ఞానం ఈ నుడికారంలో లభిస్తుంది. చదువుకున్న వాళ్ళు లేకపోయినా పరవాలేదు, తరతరాలుగా వస్తున్న ఈ బతుకు తెరువులు, జ్ఞానం ఆగిపోతే ప్రపంచం ఆగిపోతుంది. వీటి మీద స్వచ్ఛందంగా జరుగుతున్న కృషి చెప్పుకో దగినది.

శాస్త్రవేత్తల సైన్సు కాంగ్రెస్ కు ప్రధాని హాజరౌతారు. అటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా నిజమైన దేశభక్తులు సంప్రదాయ సైన్సు కాంగ్రెస్ జరుపుకుంటున్నారు. 2012లో సారనాథ్ లో జరిగిన లోక విద్యా సదస్సు ఈ రంగంలో పనిచేసే కూలీలు, పనివారు, కళాకారుల స్థితి గతులను చర్చించింది. కస్తూరి రంగన్ నివేదిక కూడా ఈ జ్ఞానాన్ని చేర్చుకోమని సలహా ఇచ్చింది. అందుకు ముందు తాము పూనుకుని దారిచూపాలి. జ్ఞానాన్ని తరతాలకు అందించడంలో మాతృభాషది ప్రధాన పాత్ర. అయితే భాషోద్యమంలో పెరుగుతున్న పోకడలను అమ్మనుడి ఆగస్ట్ 2009 సంపాదకీయంలో 'భావోద్వేగాలకు దూరంగా, హేతువాదంతొ, శాస్త్రీయ దృక్పథం ఆధునిక యుగం లో మాతృభాషల పాత్ర కేవలం సాహిత్య సృజనకు పరిమితం చేసి, శాస్త్ర సాంకేతిక రంగాలలో పనినంతా ఇంగ్లిష్, జాతీయ భాషలకు వదిలి వేయటం'గా పేర్కొంటూ 'బ్రతుకు తెరువుకు అభివృద్ధికి ఉపయోగించని భాష క్రమంగా నశించి పోతుంది' అని హెచ్చరించింది.

ఈ హెచ్చరిక స్వామి వివేకానంద జాతిని మేలుకొలుపుతూ ఇచ్చిన సందేశాన్ని ప్రతి ధ్వనిస్తుంది.

***'నవభారతం రైతుల గుడిసెలనుండి. నాగళ్లనుండి చేనేత మగ్గాలనుండి జాలరుల వలలనుండి, పడవలనుండి పండ్లు, కూరలు, మాంసం అమ్ముకునే చిరు వ్యాపారుల నుండి, కొండల నుండి అడవుల నుండి ఉదయించాలి'.***

డా. మండలి బుద్ధప్రసాద్
9848780872

# నడుస్తున్న సారస్వతమూర్తి శివరాజు సుబ్బలక్ష్మి



శివరాజు సుబ్బలక్ష్మిగారిని ప్రసిద్ధ సాహితీవేత్త కీ.శే. బుచ్చిబాబుగారి ధర్మపత్ని అనటం చిన్న పరిచయవాక్యం. ఆమె కథారచయిత్రి. నవలాకారిణి. చిత్రకారిణి. తొమ్మిది పదుల ముదిమి మీద పడుతున్నా ఇంకా రచనలు చేస్తున్న విదుషీమణి. అంత వార్థక్యంలో కూడా తన మేధా శక్తులు పదిలంగా ఉండి తన చిన్ననాటి విశేషాలను కూడా పూసగుచ్చినట్టు చెప్పగల జ్ఞాపకశక్తి కలిగి ఉన్నారామె!

2019 జూన్ 28న బెంగుళూరులో వారింటికి వెళ్లినప్పుడు ఆమె చూపించిన మాతృవాత్సల్యం గొప్పది. కదిలిస్తే మాటలు జలజలా రాలి ముప్పిరి గొలిపాయి. ఆమె వాగ్ధాటిలో రవ్వంతైనా తరుగుదల నాకు కనిపించలేదు. ఆమె చలాకీదనంలో కూడా మార్పు లేదు. ఇప్పటికీ ఆమె ఇంటిపనులు, వంటపనులు, దైవారాధనలు కొనసాగిస్తూనే, దేశంలో జరుగుతున్న సామాజిక రాజకీయ పరిణామాలను కూడా అధ్యయనం చేస్తూనే ఉన్నారు. వయోభారం అనేది ఆమెకు లెక్కలోని విషయం కాదనిపించింది. దేశ రాష్ట్ర రాజకీయాలమీద ఆమె అనర్గళంగా మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేసింది.

బుచ్చిబాబుగారి సాహచర్యం గురించి, ఆయన గతించి 50 యేళ్లయినా (1967 సెప్టెంబరు 20) ఆ జ్ఞాపకాలను ఆమె చెప్తుంటే ఓ కావ్యం దృశ్యమానం అవుతున్నట్లనిపించింది. మద్రాసులో మహాత్మాగాంధీ దర్శనం జరిగినప్పుడు వారికి తాను వేసిన చిత్రపటం బహూకరించటం, మహాత్ముడు మెచ్చుకొని ఆశీర్వదించటం గురించి చెప్తున్నప్పుడు ఆమె నయనాలు అశ్రుపూరితాలయ్యాయట.

పండిట్ నెహ్రూ శ్రీశైలం ప్రాజెక్టు శంకుస్థాపనకు వచ్చినప్పుడు రేడియో కవరేజి కోసం బయల్దేరిన బుచ్చిబాబుగారితో, పాటు తానూ ప్రయాణం కావటం, ఆకాశవాణి కారులో వెళ్లటానికి తాను డబ్బులిస్తానంటే, డైరెక్టరుగారు అక్కర్లేదనటంలాంటి జ్ఞాపకాలెన్నో ఆమె నెమరు వేసుకున్నారు.


బుచ్చిబాబుగారికి చిన్ననాడు మశూచికం పోసి లివర్ దెబ్బ తిందట. ఆయన మధ్యవయసులోనే లివరు పని చేయక పోవటంతో అకాల మరణం పొందారు. లివరు చెడటానికి ఆయనకు ఎలాంటి దురలవాట్లూ లేవని ఆమె వివరించారు. "అప్పట్లో పి.వి. నరసింహారావుగారు వైద్య ఆరోగ్య శాఖామాత్యులుగా ఉన్నారు. బుచ్చిబాబుగారికి చికిత్స అందించే వైద్యులను అత్యున్నత స్థాయి వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు కూడా! అయినా ఫలితం లేకుండా పోయింది" అని కన్నీటి పర్యంతం అయ్యారామె.


'దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆ రోజున దగ్గరుండి బుచ్చిబాబుగారి అంత్య క్రియలు జరిపించారు. అప్పటినుండీ బుచ్చిబాబు జయంతులు జరుపుతూ వస్తున్నాం'. 2017లో శతజయంతి కూడా జరిపినట్టు ఆమె వివరించారు.

ఇప్పుడు ఏమైనా వ్రాస్తున్నారా అంటే, బుచ్చిబాబుగారి జ్ఞాపకాలనే వ్రాయాలని ఉందన్నారు.

బుచ్చిబాబుగారు ఎంత కథారచయితో అంత చిత్రకారులు కూడా! ఆయన జీవించి ఉన్నప్పుడే తన చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు కూడా. సుబ్బలక్ష్మిగారు కూడా చిత్రకారిణే. వారిద్దరూ చిత్రించిన బొమ్మలను రంగుల్లో 'నేచర్ ఇన్ థాట్స్' పేరుతో పుస్తకంగా

సుబ్బలక్ష్మిగారితో
వ్యాసరచయిత





సుబ్బలక్ష్మి బుచ్చిబాబు

బాపు చిత్రం

వచ్చింది! ఆ యిద్దరూ ఏదైనా యాత్రలకు వెడితే వెంట చిత్రకళా సామగ్రిని కూడా తీసుకు వెళ్లేవారు. చూసిన ప్రకృతి దృశ్యాలను చూసినట్టు చిత్రించేవారట. వాటర్ కలర్సులో బొమ్మలు వేయటం బుచ్చిబాబుగారికి ఇష్టం అన్నారామె. బుచ్చిబాబుగారి ప్రతి జయంతికీ ఒక చిత్రం వేసి, ఆయనకు నివాళిగా సమర్పిస్తున్నానని ఆమె చెప్పారు.

ఆమె నన్ను ఒక చిన్నగదిలోకి తీసుకెళ్లారు. ఒక మంచం, దాని పక్కనే ఆమె వేస్తున్న పెయింటింగ్, దాని పక్కనే పూజా మందిరం, అందులో ఎక్కడెక్కడో ఆమె సేకరించిన దేవతా ప్రతిమలు, ఆ పక్కనే ఒక చిన్న షెల్ఫూ, అందులో ఇటీవల వచ్చిన పత్రికలు, పక్కనే పెద్ద అలమరా- అందులో తనవీ, బుచ్చిబాబుగారివీ పుస్తకాలు ఆ గది మొత్తం ఒక సారస్వత దేవాలయంగా కనిపించింది.

సుప్రసిద్ధ చిత్రకారుడు బాపుగారికి ఆమె పిన్ని అవుతారు. చిన్నప్పుడు బాపుగారు పిన్ని దగ్గర చనువుగా ఉండేవాడట. వరల్డ్ హౌస్ పత్రికలో బాపుగారు ఆంధ్ర చిత్రకారుల్ని పరిచయం చేస్తూ బుచ్చిబాబు, సుబ్బలక్ష్మిగార్ల గురించి వ్రాశారట.

2007లో బుచ్చిబాబు, సుబ్బలక్ష్మిగార్ల చిత్రం వేసి, ఆమెకు పంపించారు. సుబ్బలక్ష్మిగారు ఆ చిత్రాన్నీ, బాపుగారు వ్రాసిన ఒక లేఖను నాకు చూపించారు. అందులో, కొత్త సినిమా మొదలు పెట్టబోయే ముందు, రాముడి బొమ్మ వేయటం తనకొక అలవాటనీ, ఈసారి మీ ఇద్దరి చిత్రం వేసి పంపిస్తున్నానని వ్రాశారు.

తన తమ్ముడి కుమారుడు సుబ్బారావును ఆమె చిన్ననాటి నుండీ పెంచి పెద్దచేసింది. ఆమెను సుబ్బారావుగారు బెంగుళూరులో తన ఇంట్లో ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు. 2019 జనవరిలో కృష్ణాజిల్లా రచయితల సంఘంవారు ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహా సభలను ప్రారంభించే అవకాశం నాకు కలిగిస్తూ ఆహ్వానించినా దూరా భార ప్రయాణం చేయలేక రాలేకపోయానని, అందుకు తనకెంతో బాధగా ఉందనీ అన్నారు.

2017లో బుచ్చిబాబు శతజయంతి సందర్భంగా ఆయన పాత ఫోటోలన్నింటినీ సమీకరించి వరుసగా ఫేస్‌బుక్‌లో పెడుతూ వచ్చారు. వాటిని నేను చూసి, ఆమెతో ఫోనులో మాట్లాడాను. నా కోరిక మీద వాటన్నింటిని మెయిల్లో పంపించారామె! వారి మీద సమకాలీన రచయితలు వ్రాసిన వ్యాసాలు కూడా దొరికితే సేకరిం చమని కోరాను. వారి దత్తుడు సుబ్బారావుగారు శ్రమకోర్చి అన్నింటినీ సేకరించి పంపారు.

ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సంస్కృతి సమితి సంచాలకులు, స్వయంగా నాటక రచయిత డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ ప్రభుత్వ పక్షాన బుచ్చిబాబు నాటకాలను ఒక గ్రంథంగానూ, ఆయన చిత్ర మాలిక, ఆయనపైన వెలువడిన విమర్శనా సాహిత్యాన్ని ఒక భాగం గానూ రెండు పుస్తకాలుగా ప్రచురించారు. ఆ పుస్తకాలను చూసి ఆమె పరమానందం చెందారు.

అత్యంత మేధా సంపన్నురాలైన ఒక రచయిత్రి, తన జీవిత సహచరుడి జ్ఞాపకాలలో గత 50 యేళ్లుగా జీవనం సాగిస్తూ, ఆ మహా రచయిత సాహిత్యాన్ని పదిలపరుస్తూ, తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, చీకటి లోకం మీద వెలుగు రేఖలు ప్రసరిస్తూ, తన జీవితానికొక సార్థకతను నిలుపుకుంటున్నారామె! ఆ సారస్వత మూర్తికి ప్రణమిల్లుతున్నాను.

ఈ వ్యాస రచయిత - ఆంధ్రప్రదేశ్
శాసనసభ పూర్వ ఉపసభాపతి

# ప్రకాశం జిల్లా రచయితల సంఘం
## 9వ రాష్ట్రస్థాయి రచయితల మహాసభలకు
## ఆహ్వానము

స్వర్ణోత్సవ సంస్థ ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వ ర్యంలో 9వ రాష్ట్రస్థాయి మహాసభలను ఒంగోలులోని అంజయ్య రోడ్డులో గల ఆంధ్రకేసరి విద్యాకేంద్రం ఎ.కె.వి.కె. జూనియర్ కళాశాల ఆవరణలో 2020 జనవరి 17.18.19 తేదీలలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు బి.హనుమారెడ్డి తెలిపారు. మూడురోజులు సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలలో అన్ని రాష్ట్రాల కవులు, రచయితలు ప్రతినిధులుగా పాల్గొనవచ్చని అన్నారు. ప్రతినిధులుగా పాల్గొన్న అందరికీ కవి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం కల్పించడమే కాకుండా ముగింపు సభలో జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామని అన్నారు. ప్రతినిధులుగా పాల్గొనే కవులు, రచయితలకు భోజనం, సాధారణ వసతి సౌకర్యం కల్పిస్తా మని అన్నారు. ప్రతినిధి రుసుము రూ-100/-లు చెల్లించి పేరు నమోదు చేసుకోవలసినదిగా కోరారు.

వివరములకు వేంకటశ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, ఇం.నెం. 33-1-5, తిరు వెంగళం పిళ్ళైవారి వీధి, ఒంగోలు-523 001, ప్రకాశం జిల్లా సెల్ : 94404 32939 ని సంప్రదించవలసినదిగా కోరారు.

ఇట్లు
బి.హనుమారెడ్డి, అధ్యక్షులు.

నవల

డి.పి. అనూరాధ
9010016555




మయన్మార్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియా నేడు మనకు అస్సలు సంబంధం లేని నేలలుగా అన్పిస్తాయి. కానీ అక్కడి ప్రాచీన రాజ్యాలకు తెలుగు వారితో దగ్గరి సంబంధం ఉంది. అలాగే అక్కడి గొప్పగొప్ప నిర్మాణాలకు ప్రేరణ తెలుగు నేలే. అంతెందుకు – శ్రీలంకను పరిపాలించిన ఆఖరి రాజులు కూడా తెలుగు వారే. వీటన్నిటి గురించి యూరోపియన్ ఆర్కిటెక్టులు, చరిత్రకారులు ఎప్పుడో తేల్చిచెప్పారు. ఆ తరవాత మన తెలుగు చరిత్రకారులు కూడా రాశారు. కానీ ఇప్పుడు వీటి గురించి పూర్తిగా మర్చిపోయాం.

భావరాజు వేంకట కృష్ణారావు గారి 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము' అందించిన స్ఫూర్తితో ఆయా దేశాలకు వెళ్ళాను. అలనాటి మన తాతముత్తాతల ప్రాచీన రాజ్యాల అవశేషాలను కళ్లారా చూసి, వారు సాధించిన ఘనవిజయాలను, ప్రతిభా పాటవాల గురించి స్వయంగా తెలుసుకున్నా. అయిదు వందల ఏళ్ల క్రితం కాదు, వెయ్యేళ్ల క్రితం కాదు, పదిహేను వందల ఏళ్ల క్రితమే మనవాళ్లు వలస రాజ్యాలను స్థాపించారు. మన తెలుగు జాతీయులు విదేశీ గడ్డపై సాధించిన అజరామర విజయాలను ప్రత్యక్షంగా చూసిన తాదాత్మ్యంతో, పెల్లుబికిన ఆనందంతో ఈ 'జగమునేలిన తెలుగు' రచనకు పూనుకున్నాను.

ఆయా రాజ్యాలలోని నాలుగు రకాల ఆధారాలు... 1) పేర్లు, 2) శాసనాలు, 3) లిపి, 4) వాస్తు ఈ రచనకు తోడ్పడ్డాయి. ఓ కథలా అల్లడానికి కల్పిత పాత్రలను, సన్నివేశాలను సృష్టించాను.

మన ఊరి చరిత్ర గురించి తెలుసుకోవడానికే తీరిక లేని ఈరోజుల్లో ఎక్కడో దూరదేశాల్లో, వేల ఏళ్ల నాటి చరిత్ర ఎందుకు? అంత అవసరం ఏమిటి అని మీకు అన్పించవచ్చు. వాస్కోడిగామా పదిహేనో శతాబ్దికిగానీ ఇండియాకి రాలేకపోయాడు. కానీ దానికి వెయ్యేళ్ల క్రితమే సుదూర తీరాల్లో మన తెలుగు వారు రాజ్యాలను స్థాపించారు. అంటే ఆనాడు మన తెలుగు వాళ్లు ఎంత సాహసికులో, మనం నాగరికతలో ఎంత ముందు ఉండేవాళ్లమో అర్థం చేసుకోవచ్చు. ఆనాడే విదేశీ నేలలపై విజయ కేతనం ఎగురవేసిన జాతి మనది. ఆ ఘనకీర్తిని ఓసారి స్మరించుకోవడమే మన తాతముత్తాతలకు ఇచ్చే నిజమైన నివాళి. చరిత్రకారులు యీ అంశాలపై మరిన్ని పరిశోధనలను చేస్తారని ఆశ. నా ఈ ప్రయత్నానికి మీ ఆదరాభిమానాలు లభిస్తాయని ఆశిస్తున్నాను. – రచయిత్రి

2030.... ఫిబ్రవరి 21...

భూమ్మీద అతి పెద్ద తెలుగుపండగ...

అయిదు ఖండాల దేశాల్లోని తెలుగు సంఘాలు తమ ప్రతినిధులను శ్రీపర్వతానికి పంపిస్తున్నాయి..

ప్రపంచంలోని ఏ దేశమూ కనీవినీ ఎరుగని రీతితో ఈ భాషా పండుగను నిర్వహించడానికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులూ బాధ్యత తీసుకున్నారు.

నాగార్జునకొండ సమీపంలో ప్రత్యేక అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ఏర్పాటుచేశారు. 'ఎయిర్ తెలుగు' విమానాలు విదేశాల్లోని ప్రతినిధులను తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నాయి.

కోటి మంది ప్రజలు బస చేసేలా శ్రీపర్వతంలో అత్యాధునిక

గుడారాలు వేశారు.

ఈ పండుగకు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి తల్లాప్రగడ సత్యనారాయణ విచ్చేయనున్నారు. శ్రీపర్వతంలో రెండు తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించిన 'తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర' థీమ్ పార్క్ ను రాష్ట్రపతి జాతికి అంకితం చేయనున్నారు.

భారతదేశంలో ఇప్పటివరకూ ఏ రాష్ట్రమూ తమ జాతి మూలాలపై ఇలాంటి పార్క్ ను నిర్మించలేదు. వంద ఎకరాల్లో వెయ్యి కోట్ల రూపాయల ఖర్చుతో దీనిని నిర్మించారు. కోటిలింగాల రాజుల కాలం నుంచి గోల్కొండ నవాబుల వరకు ఆయా కాలాల్లో సాధించిన ఖ్యాతినంతా 5జి టెక్నాలజీతో కళ్లకు కట్టేట్టుగా తిరిగి నిర్మించారు. విదేశాల్లో ప్రాచీన తెలుగు రాజ్యాలు – అందులో ముఖ్యమైన భాగం. మయన్మార్, థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియాల్లో ప్రాచీన తెలుగు రాజ్యాలతో పాటు శ్రీలంకలోని కంది రాజుల వరకు ఆయా దేశాల్లో తెలుగు వారి చారిత్రక ఆనవాళ్ల ప్రతిరూపాలను నిర్మించారు. ఒక్కసారిగా పార్కులోకి అడుగుపెడితే ఆయా కాలాలకు ప్రయాణం చేస్తున్నట్టుగా ఉంటుంది.

స్వదేశీ, విదేశీ టూరిస్టుల కోసం ఏర్పాటుచేసిన ఈ థీమ్ పార్క్ ను ఎంతలేదన్నా ప్రతి రోజూ లక్ష మంది యాత్రికులు సందర్శిస్తారని అంచనా. దీనికంతా మూలకారకుడు సూర్యవర్మ. అతడి పదేళ్ల కష్టానికి ఫలితం ఇది. వృత్తి రీత్యా ఇంజనీర్ అయినా ఏ చరిత్ర కారుడూ చేయనంతటి గొప్ప పని చేసి, తెలుగుజాతి నరనరానా ఉప్పొంగి పోయేలా చేశాడు. అతడు రాసిన "జగమునేలిన తెలుగు" అత్యధిక ప్రతులు అమ్ముడైన తొలి తెలుగు నవలగా పేరు తెచ్చుకుంది.

ఒక్కో టీవీ ఛానల్ ఆ థీమ్ పార్క్ కి సంబంధించి ఒక్కో విషయం ప్రసారం చేస్తున్నాయి.

ఓ ఛానల్ వాళ్లు సూర్యవర్మ కన్పించడం లేదు అంటూ తాజా వార్త పేల్చారు.

సూర్యవర్మ ఎక్కడ... సూర్యవర్మ ఎక్కడ... అని మిగతా ఛానల్స్ వారూ హడావుడి పడిపోతున్నారు..

అందరి దృష్టి హైదరాబాదులోని అతడి ఇంటిపై పడింది.

అతడి భార్య లచ్చిమి ...శ్రీలంక యువతి. ఆ జంటకు ఎనిమిదేళ్ల కుమారుడు...మేడ మీద తన గదిలోని కిటికీలోంచి చూశాడు ఇంటి ఎదురుగా జరుగుతోన్న హడావుడిని. వేగంగా మెట్లు దిగి కిందకి వచ్చాడు. వంట గదిలో ఉన్న తల్లిని గట్టిగా అల్లుకు పోయాడు భయంతో...

'అమ్మా నాన్నెక్కడ..'

'వాళ్లందరూ నాన్న కోసం ఎందుకు వెతుకుతున్నారు...'

'బాబు, ఈరోజు మీ నాన్న సూపర్ హీరో. అందుకే అతడిని కలవాలని వాళ్లందరూ వచ్చారు. భయపడకు... రా' అంటూ బయటకు వచ్చింది కొడుకుతో సహా.

లచ్చిమి ఎదురుగా కన్పించడంతో ఛానల్ వాళ్లందరూ ఆమె దగ్గరకు వచ్చి సూర్యవర్మకి సంబంధించి ప్రశ్నలు సంధించారు. ఆమె అందరినీ ఓసారి చూసి...

'అందరికీ నమస్కారం.. సూర్యవర్మ జీవితంలో ఇదో అద్భుతమైన రోజు.

ఎన్నేళ్లనుంచో ఆయన ఓ కల కంటూ ఉన్నాడు. అది సాకారమవుతున్న ఈరోజున ఆయన పూర్తి ఏకాంతాన్ని కోరుకుంటున్నారు. సాయంత్రం వేదిక దగ్గర మీరు అతడిని చూడవచ్చు. మీరందరూ మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాను, ధన్యవాదాలు' అని విపులంగా మాట్లాడి వెనుదిరిగింది. కొడుకు చేయి పట్టుకుని ఇంట్లోకి వెళ్లింది.

పెరటి తలుపులోంచి ఇద్దరూ రోడ్డుమీదకి వచ్చేశారు. ఓ ప్రయివేట్ క్యాబ్ వారి కోసం సిద్ధంగా ఉంది. ఆ డ్రైవర్ తో ఏదో మాట్లాడింది. ఇద్దరూ అందులో కూర్చున్నారు. కారు బయలుదేరింది. ఆ కారు కుదుపులకి బాబు వెంటనే నిద్రపోతాడని ఆమె అనుకుంది. కానీ వాడు మొండి ఘటం.

అమ్మా, మనం ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం. నాన్న దగ్గరకా' ప్రశ్నించాడు.

'అవును... ' అంటూ వాడి తల నిమిరింది.

వీడియో గేమ్స్ లో వాడు మునిగిపోయాడు.

ఎదురుగా ఉన్న రోడ్డును చూస్తూ తను ఆలోచనల్లో పడింది. సూర్యవర్మ జీవితం ఎంత విచిత్రమైంది! తెలుగుజాతి మూలాల కోసం అతడు తన జీవితమంతా ధారపోశాడు. అతడి జీవితమే ప్రయాణంతో మొదలైంది...

* * *

ఎన్నాళ్లో వేచిన ఉదయం...

ఆస్ట్రేలియాలో శాశ్వత పౌరసత్వం వచ్చేసింది..

కోటి ఆశలతో విమానమెక్కా.

బ్యాంకాక్ లో తరువాతి విమానంకి ఏడు గంటల సమయం ఉంది... ఏం చేయాలో తోచక విమానాశ్రయంలో అంతస్తులన్నీ తిరుగుతున్నా..

ఫోర్త్ ఫ్లోర్లో దేవదానవ క్షీర సాగర మథనం సన్నివేశాన్ని శిల్పాలతో ప్రతిష్టించారు. అన్నీ బంగారు పూత పోసిన ప్రతిమలే. 'సువర్ణభూమి అంతర్జాతీయ విమానాశ్రయం' గా దీనికి పేరు. అందులోనూ బంగారమే. వీళ్ళకి బంగారంతో ఏమిటి అనుబంధం అనుకుంటూ ఆ మేరు పర్వతం దగ్గరే నిల్చుండిపోయా.

పిచ్చాపాటిగా మాటలు కలిపాడు ఓక్లాప్తాన్. తనది మయన్మార్. మా ఇద్దరిదీ ఒకే వయసు కావడంతో తొందరగానే స్నేహితుల మయ్యాం. తను ఉద్యోగరీత్యా ఆస్ట్రేలియా వెళుతున్నాడు.

సంప్రదాయ బర్మీస్ దుస్తులు ధరించాడు. భుజానికి ఓ నేత సంచి వేలాడదీసుకున్నాడు. ఏదో చెబుతున్నాడు బర్మీస్ ఇంగ్లీషులో. అర్థం చేసుకోవడానికి కాస్త సమయం పడుతోంది. సాధారణమైన ఒడ్డూపొడవే. కానీ అతడి కళ్ళు ఎంతో తీక్షణంగా ఉన్నాయి. ఆ కళ్ళలోంచి తప్పించుకోవడం కాస్త కష్టమే.

ఇద్దరం కలిసి ఓ థాయి రెస్టారెంట్ లో కూర్చుని సూప్ నూడుల్స్ ఆర్డర్ చేశాం. నా వివరాలు అడిగాడు. 'సూర్యవర్మ.. సౌత్



ఇండియా' అని చెప్పా. 'మీది, ఏ ఊరు..' అని అడిగాడు. 'విజయవాడ దగ్గర' అన్నా. 'ఏ ఊరు...' అని మళ్ళీ అడిగాడు. 'నీకు సౌత్ ఇండియా అంతగా తెలుసా' అని ఆశ్చర్యపోతూ అడిగాను.

'కొంచెం తెలుసు అంటూ ధాన్యకటకం... ఘంటశాల... విజయపురి...కోటిలింగాల... మోటుపల్లి...దంతపురి...' ఇలా చెబుతున్నాడు.

'నువ్వు ఇండియా వచ్చావా'.. లేదంటూ నవ్వాడు. ఆ కళ్ళు ఏదో రహస్యం దాస్తున్నాయి.

ఇంతలో అతడి స్నేహితులు వచ్చారు. ఇద్దరు అమ్మాయిలు.. ముగ్గురు అబ్బాయిలు... శ్రీలంక, థాయ్‌లాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియా... ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో దేశం. వాళ్లే నాతో మాట కలపడం ఆశ్చర్యం కలిగించింది.

అందరూ మా చుట్టూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. ఎవరిలోనూ కొత్త లేదు ఎంతో పరిచయం ఉన్న వాళ్లలా మాట్లాడుతున్నారు. 'నువ్వు మా ఇంటికి రావాలి.. మా దేశానికి రావాలి' అని ఆహ్వానిస్తున్నారు. ఇంతలో విమానం రాక ప్రకటన వినబడుతోంది. వీళ్ళకి వీడ్కోలు చెబుతూ నేను, ఓక్లాప్ విమానం ఎక్కాం. ఆశ్చర్యంగా ఇద్దరికీ పక్క పక్క సీట్లే. 'నీకు మా ఊర్ల పేర్లు ఎలా తెలుసు...' మళ్లీ ప్రశ్నించా. అతను కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. నా మాటలు వినిపించనట్లు ఉన్నాడు. విమానం పైకి లేవడానికి సిద్ధమవుతోంది. ఆంజనేయ దండకం చదువుకుంటూ కళ్ళు మూసుకున్నా. తన సంచిని నా చేతిలో పెట్టినట్లు అన్పించింది.

విమానం ఎగిరింది. ఆ తేలికపాటి హాయ్ కి నిద్ర కమ్మేసింది.

* * *

మెలుకువ వచ్చేసరికి ఓడలో ఉన్నా... సముద్రం మధ్యలో ప్రయాణం..


విమానానికి బదులు టైం మెషిన్ ఎక్కానా? నేనేమిటి.. ఇక్కడ ఏమిటి అని ఆశ్చర్యపోతూ చుట్టుపక్కల పరిశీలించాను.

దూరంగా మరికొన్ని ఓడలు.. అన్నీ తెరచాపకొయ్య పడవలే. దుంగలను దగ్గరగా చేర్చి ఓడను నిర్మించారు. ప్రశాంతమైన అలల్ని చూస్తుంటే సముద్రం మధ్యలో ప్రయాణం సాగుతోందని అర్థమైంది. తూర్పు దిశగా పయనిస్తోందో పడమటి దిశగా పయనిస్తోందో చెప్పడం కష్టం. మా ఓడ 100 అడుగుల పొడవు 80 అడుగుల వెడల్పుతో ఉంది. వంద మంది వరకూ ప్రయాణికులు ఉన్నారు. అందులో చాలామంది బౌద్ధభిక్షువులు. వాళ్ళలో కొంతమంది ఏదో పఠిస్తున్నారు.. కాషాయ వస్త్ర ధారణలో ఉన్నారు. మిగతా వారు పంచలు చొక్కాలు ధరించి, తుండు గుడ్డను పైన వేసుకున్నారు. తలపాగా చుట్టుకున్నారు. నా జీన్స్ ప్యాంట్, టీ షర్టు, గడియారం అన్నీ మాయం. నాదీ వాళ్లలాంటి ఆహార్యమే. కాస్త దూరంలో కొంతమంది వ్యాపారస్తుల్లా అనిపిస్తున్నారు. వారిది దిట్టమైన దేహ దారుఢ్యం. ఏదో మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలు వింటే నేను ఎక్కడున్నానో తెలుసుకోవచ్చని అనిపించింది. అక్కడే ఆగాను.

'సుబ్బయ్య శెట్టి మామ, ఇప్పుడు ఏ ద్వీపానికి ప్రయాణం? అని ఓ వ్యక్తి తన ఎదురుగా ఉన్న వ్యక్తిని అడుగుతున్నాడు.

'యవన ద్వీపం' అని అతడు సమాధానం చెప్పాడు.

'మీరు మొదటిసారి ద్వీపాంతర వ్యాపారం చేస్తున్నట్లు ఉన్నారు. ఎక్కడికి వెళ్తున్నారు.. ఏ వ్యాపారం అని సుబ్బయ్య ఎదురు



ప్రశ్నించాడు.

'మిరియాలు.. బెల్లం వ్యాపారం కోసం చీనాకు వెళ్తున్నాం'అని సమాధానమిచ్చారు.

ఇంతలో బౌద్ధ ఆచార్యులు కొంత మంది శిష్యులతో అటు వచ్చారు. వాళ్లంతా అతనికి ప్రణామాలు చేసి కొంత ధాన్యాన్ని, పండ్లను సమర్పించుకున్నారు. ఆయన శిష్యగణంతో ముందుకు వెళ్ళిపోయాడు.

'ఆచార్య నాగార్జునుడిని వీరంతా రెండో బుద్ధ భగవానుడుగా భావిస్తారు.

ఆయన రచించిన సుహృల్లేఖ వీరికి నిత్యపారాయణ గ్రంథం. అక్కడ ఉన్న బౌద్ధ సమూహం వాళ్లందరూ పఠిస్తోంది ఆ గొప్ప గ్రంథాన్నే. సుదూర తీరాల్లో బౌద్ధాన్ని వ్యాపింపచేయడానికి వీళ్ళందరూ వెళుతున్నారు. నాగార్జునుని మరణానంతరం ఈ మతపరమైన వలసలు మరింత పెరిగాయి. స్వదేశంలో బౌద్ధానికి గడ్డు రోజులు మొదలవడం మరో కారణం. ఆంధ్రదేశం నుంచి ఏ ఓడ బయలు దేరినా అందులో సగానికి సగం భిక్కువులే ' అని పెద్ద వ్యాపారి వివరిస్తున్నాడు.

ఆచార్య నాగార్జునుడు క్రీస్తుశకం 2 శతాబ్ది వాడని చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్న గుర్తు. అంటే నేను క్రీస్తుశకం తొలినాళ్ళలో ఉన్నానా.. ఆనాడే ఇంత మంది తెలుగు వ్యాపారస్థులు బయటి దేశాలకి వెళ్లేవారా? ఎంతటి బలమైన జాతి మనది అని మనసు ఉప్పొంగి, ఇంకా ఏమైనా సమాచారం దొరుకుతుందేమోనని, ఓడంతా తిరగడం మొదలు పెట్టా. ఓడ ముందు భాగం సింహం ఆకారంలో ఉంది.

ఇలాంటి ఓడలు యాభై దాకా ఉన్నాయి. కొన్ని 200 అడుగుల పొడవుతో పెద్దగా ఉన్నాయి. వాటిలో వందల కొద్దీ జనం ఉన్నారు.

సూర్యుడు ఏటవాలుగా ఉన్నాడు. కాసేపట్లో చీకటి పడిపోతుంది. మా ఓడ రెండు అంతస్తులుగా ఉంది.. మెట్లున్నాయి. దిగువ అంతస్తులో ప్రత్యేక గదుల ఏర్పాటు కూడా ఉంది. కొంత మంది తమతో సేవకుల్ని కూడా తీసుకువెళ్తున్నారు.

ఎవరితోనో మాట్లాడుతూ ఓక్లాప్ కనిపించాడు. వేగంగా అతడి దగ్గరకు వెళ్లి..

'ఏం జరుగుతోంది' అని నిలదీశాను.

ఇప్పుడు కూడా ఎలాంటి అలజడి లేకుండా ప్రశాంతంగా ఉన్నాడు.

'మిత్రమా.. తొందరపడకు. నీ కోసం మన జాతంతా ఎదురుచూస్తోంది. కాస్త ఓపికగా ఉండు...' అంటూ చేతి సంచి నాకు అందించాడు ఏదో మాయ కమ్మేసింది.

* * *

స్పృహలోకి వచ్చేసరికి నేను, అతడు వేగంగా నడుస్తున్నాం... కాస్త దూరంగా ఊరు కనిపిస్తోంది.. చాలా మటుకు గుడిసెలే. ఎండు గడ్డితో పైకప్పులు వేసి ఉన్నాయి. కొన్ని త్రిభుజాకారంలో, మరికొన్ని చతురస్రాకారంలో వేశారు.

ప్రజలందరూ ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టుగా ఓ చోట ఉన్నారు.

మేం వారిని సమీపించి ఆగిపోయాం. అందరూ మోకాళ్లపై కూర్చుని అభివాదం చేస్తున్నారు. ఓ పండు ముసలావిడ, చేతికర్ర ఊతంతో నా ముందుకు వచ్చి 'బిడ్డ.. నీ రాక కోసమే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తూ ఉన్నా' అంటూ సంభ్రమాశ్చర్యాలతో నన్ను చూస్తోంది.

విషయం అర్థం కాక పక్కనే ఉన్న ఓక్లాప్ వైపు చూసా.

'మన జేజమ్మ..' అంటూ పరిచయం చేసాడు.

రా అంటూ చేయి పట్టుకుని ముందుకు తీసుకు వెళ్ళింది జేజమ్మ. చుట్టుపక్కల వాళ్ళు మంత్రముగ్ధులై మాకు దారి ఇస్తున్నారు.

ఎదురుగా ఏదో స్థూప నిర్మాణం జరుగుతోంది.. వందల సంఖ్యలో కార్మికులు అందులో నిమగ్నమై ఉన్నారు. పక్కనే వసతి గృహాలున్నాయి..

మామిడి చెట్ల మధ్య ఆ ప్రాంతమంతా పచ్చగా ఉంది. కొన్నిచోట్ల చెట్టు కొమ్మలకు చీర ఉయ్యాల వేలాడదీసి ఉన్నాయి. ఓ ఉయ్యాల్లో బాబు ఉలిక్కిపడి గట్టిగా ఏడుస్తున్నాడు. వాళ్ళ అమ్మ ఉయ్యాల ఊపుతూ 'ఓ కొడుకా, మన నేల తెలంగాణ.. మన రాజుకి అదృష్టం బాగా లేక యుద్ధంలో ఓడిపోతే మనం పడవల్లో ఎర్రరాళ్లున్న ఈ సువర్ణ భూమికి వచ్చాం' అని పాడుతోంది..


ఎంతో ఆశ్చర్యం కలిగింది.

ఏ కాలంలో ఏ దేశంలో ఉన్నానో.. అసలు తెలియడం లేదు. వీళ్ళు తెలంగాణ అని చెప్పుకుంటున్నారేమిటి, ఏ రాజు కాలంలో ఇక్కడకు వచ్చారు.. అన్నీ అంతులేని ప్రశ్నలే.

ఓ పెద్ద ఇంటి ముందర ఆగిపోయింది జేజమ్మ. చెట్టు నీడలో ఉన్న నులక మంచం మీద నన్ను కూర్చోమని చెప్పింది. ఇంట్లో ఆడవాళ్ళు అరటిపళ్ళు, అంబలి తెచ్చారు.

అవి తిన్న తరువాత కాస్త పని ఉందంటూ వెళ్ళిపోయాడు ఓక్లాప్.

దీర్ఘ శ్వాస తీసుకుని ఏదో చెప్పడానికి ఉపక్రమించింది జేజమ్మ.



'బిడ్డ, మనం ఉన్న ఈ నేల సువర్ణ భూమి. మా తాతలు ఇక్కడికి వలస వచ్చారు. మన తెలుగుజాతిది ఇక్కడ పెద్ద గుంపు. ధరణికోట, సిరిపర్వతం, కోటిలింగాల.. ఇలా అక్కడి అనేక ప్రాంతాల నుంచి వ్యాపారం కోసం ఇక్కడికి వచ్చి ఉండిపోయారు. అన్నీ కలిసొచ్చి వారిలో కొందరు వలస రాజ్యాలను స్థాపించారు. తమతో తెచ్చిన వస్తువులను అక్కడి ప్రజలకు ఇచ్చి మొదట స్నేహం చేసుకునేవారట. అనుకూలిస్తే బంధుత్వాలూ పెట్టుకునేవారు. అవకాశమొస్తే ఆయా కొత్త నేలల్లో రాజ్యాలనూ స్థాపించారు. నాగరికతలో ముందున్న వారు కాబట్టి ఇవన్నీ వారికి సులువుగానే అయ్యేవి. ఆ గొప్ప తల్లినేలకి గుర్తుగా ఇక్కడి మనోళ్లకి తలైంగులు అనే పేరు స్థిరపడిపోయింది. సువర్ణ భూమిలో నిండుగా బతుకుతున్న జాతి మనది. నిన్ను తీసుకు వచ్చిన ఒక్కలప్ప ఇక్కడ రాజు. యాభై అడుగుల ఎత్తున్న స్థూపాన్ని నిర్మిస్తున్నాడు. దారిలో నువ్వు చూసిందదే. 'ధరణికోట' స్థూపం రీతిలో. వంద అడుగుల ఎత్తున్న ఆ స్థూపంపై దీపం పెడితే కొన్ని యోజనాల వరకూ వెలుగుతో నిండిపోయేదట. అందుకే 'దీపాలదిన్నె' అని కూడా పిలిచేవారట. మా తాత గొప్ప చిత్రకారుడు. తెల్ల పంచెమీద నీలం రంగుతో ఆ స్థూపాన్ని చిత్రించి పెద్ద పెట్టెలో భద్రపరచాడు. ప్రతి సంక్రాంతికి ఆ పెట్టెను ఊరేగించి ఉత్సవంలా జరుపుకుంటాం. కృష్ణా.. గోదావరి నదులు మన జీవనాధారాలు. వ్యాపారమంతా ఆ నదుల దారుల్లోనే జరిగేదట. మరింత సాహసికులు ఆ నదుల ముఖ ద్వారాల్లోంచి సముద్రంలోకి వచ్చి సుదూర తీరాలకు ప్రయాణమయ్యే వారట. సముద్ర తీరంలో దొంగల బెడద ఎక్కువగా ఉండేదట. అందుకే వర్షరుతువులో పవనాల సాయంతో నడిసంద్రంలో ప్రయాణం చేస్తూ వర్తకం కోసం వెళ్లేవారు. ఇది మన తెలుగుజాతి ఘన కీర్తి చరిత్ర " అంటూ వివరించింది.

'రాత్రి పొద్దెక్కింది నిద్రపో ..' అంటూ లోపలికి వెళ్ళింది. నాకు ఎంతో ఆశ్చర్యం వేసింది ఇండియా కనుక్కోవాలని అనుకుంటూ కొలంబస్ అమెరికా వెళ్లాడు. 15వ శతాబ్దానికి గానీ వాస్కోడిగామా భారతదేశానికి రాలేకపోయాడు. మరి క్రీస్తు శకం తొలినాళ్ల లోనే మన తెలుగుజాతి చైనాతో నౌకావాణిజ్యం చేసేదా? సముద్ర దారుల్లో మన వాళ్లు ఇతర దేశాలకు వచ్చి వలస రాజ్యాలను స్థాపించారా? ఇలాంటి ఆలోచనల్లో చల్లటి గాలికి ఇట్టే నిద్రపట్టేసింది.

* * *

'బిడ్డా... మేలుకో, శత్రువులు దండెత్తి వచ్చారు' అన్న అరుపులకు కళ్లు తెరిచాను. నా ఎదురుగా జేజమ్మ ఉంది. గుడిసెలన్నీ తగలబడిపోతున్నాయి. పిల్లాపాపల ఆర్తనాదాలు మిన్నంటాయి. అర్ధరాత్రి దాటినట్టుగా ఆకాశం ఉంది.

'బిడ్డా, ఆలస్యం చేయకు, ఉత్తరానున్న శత్రు జాతులు కుట్ర పన్నాయి. చాపకింద నీరులా చడీచప్పుడు లేకుండా దండెత్తి వచ్చారు. ఈ తెల్లని గుర్రాన్ని తోలుకొని వెళ్లిపో' అంటూ దూరంగా చెట్టుకు కట్టేసి ఉన్న గుర్రాన్ని చూపించింది.

'నిన్ను వదిలిపెట్టి ఎలా వెళ్ళను అవ్వా..' నా మాట పూర్తికాక ముందే...

'మన జాతి ఆశాకిరణం నీవు. నీ క్షేమమే.. మా క్షేమం. బయలుదేరు నాయనా' అంది. ఆమె పాదాలకు నమస్కరించి గుర్రాన్ని ఎక్కాను. అది సర్వసన్నద్ధంగా ఉన్నట్టుంది. వెంటనే వేగం పెంచింది.

కానీ గుర్రాలపై నన్ను వెంబడిస్తూ వెనక నుంచి వస్తున్నారు శత్రువులు. కొంతమంది బాణాలు వేయడం మొదలుపెట్టారు. వేగంగా వెళుతూ వాటిని తప్పించుకుంటున్నా. నా శక్తంతా హరించుకుపోసాగింది.

ఓ యువతి మెరుపు వేగంతో గుర్రంపై వస్తూ సూటిగా బాణాలను సంధిస్తూ క్షణాల్లో వాళ్లను కుప్ప కూలేలా చేసింది. నేను కృతజ్ఞతగా ఆమె వైపు చూసాను.

తనని ఎక్కడో చూసిన జ్ఞాపకం. తను ఆగిపోయింది. నా గుర్రం మాత్రం ఆగకుండా ముందుకు దూసుకుపోతోంది. క్రమంగా ఆమె రూపం కనుమరుగైంది.


గాలిలో తేలుతున్నట్టుగా నా ప్రయాణం ఉంది.. ఎక్కడికి వెళుతున్నానో తెలియదు.

ఒక్కలప్ప గుర్రం మీద నాకు ఎదురుపడ్డాడు. ఎంతో తొందరలో ఉన్నట్టుగా కన్పించాడు. 'మన స్నేహం మరిచిపోవద్దు మిత్రమా... నువ్వు తెలుగుజాతి కీర్తిని సువర్ణాక్షరాలతో రాయాలి .. అది జగమంతా తెలియాలి. మన పూర్వీకుల సాహసం ఊరికే పోరాదు. మిత్రమా... ఇక సెలవు' అంటూ భుజానికి ఉన్న సంచిని నా చేతికి అందించాడు. అది మాయ సంచి...ఇప్పుడు ఎక్కడికి తీసుకు వెళుతుందో...

**(తరువాయి వచ్చే సంచికలో...)**

ధారావాహిక

# జోగిని మంజమ్మ ఆత్మకథ



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
90597799289

( గత సంచిక తరువాయి... )

**కోమట్ల కుర్రవాడి ఒంట్లో హులిగమ్మ వస్తుంది**

ఒక రోజు ఇంటి ముందుభాగంలో నిలబడి ఏదో ఆలోచిస్తున్నాను.

అప్పుడు తల తిరిగినట్టయి దబ్బుమని కింద పడిపోయాను.

అప్పుడు నేను ఏమేమో మాట్లాడుతున్నానట.

అవి స్పృహ తప్పిన మాటల్లా ఉండక ఒంటి మీదికి దేవుడొచ్చిన మనిషి మాట్లాడిన మాటల్లా ఉన్నాయని జనం అనేకసార్లు నా దగ్గర చెప్పారు. నేను ఇలా కావడానికి 'దైవిక శక్తి' కారణమని అనుకున్నాను. అప్పుడు కోమటి కుర్రవాడి ఒంట్లో హులిగమ్మ వస్తుందని ప్రజలు అనుకోవడం, ఆ కుర్రవాడు జోగమ్మ అవుతున్నాడని అనటం విన్నాను. ప్రజలు మాట్లాడుకునే ఇలాంటి మాటలు విన్నప్పుడు మా ఇంటివారు బాగా కోపగించుకునేవారు.

నేను వైశ్యుల కులంలో పుట్టినవాడిని. మా వంశంలో ఇలాంటి మాటలు వినకూడదు. కొన్ని కింది కులాల్లో మాత్రమే యల్లమ్మ, హులిగమ్మలు వస్తారు. వీళ్ళలో మాత్రమే దేవుళ్ళకు వదిలేటటువంటి, దేవదాసిలుగా వదిలేటటువంటి సాంప్రదాయం ఉంది. మా వైశ్య సమాజంలో ఆ పద్ధతి లేనేలేదు. అలాంటి కులంలో వీడు చేరిపోయాడని నన్ను తిట్టేవారు. నా పరిస్థితి చూసి మొత్తుకుని ఏడ్చేవారు. ఇది మన వంశానికి కలిగిన అవమానంగా భావించి నన్ను ఇంట్లో ఉండనిచ్చేవారు కాదు. ఇంట్లో ఉంటే ఆడవాళ్ళతో కలిసి ఆడవాళ్ళలా ప్రవర్తిస్తానని మగపిల్లలతోపాటు పొలాలలో పనులకు పంపేవాళ్ళు. ఆ కుర్రవాళ్ళతోపాటు పంపటం నాకు పెద్ద హింసగా మారేది. ఆడదీ కాకుండా మగవాడూ కాకుండా అంతులేని బాధను అనుభవించే దుర్భరమైన సందర్భమది. అంతేకాకుండా ఆ కుర్రవాళ్ళు నన్ను వెక్కిరించేవాళ్ళు. ఆడంగి అనేవాళ్ళు. ఈ బాధ భరించొచ్చు. అయితే వాళ్ళతో కాలం గడపడమే కష్టమైంది. అందువల్ల వాళ్ళతో కలిసి పనిలోకి పోనని అన్నాను.

దాంతో నన్ను మంచానికి కట్టేసి కొట్టారు.

పగ్గంతో చావబాదారు.

"ఆడవాళ్ళు ప్రవర్తించినట్టు ప్రవరిస్తున్నావు. మా అన్నదమ్ములు ఆరుమందిమి. మా అందరి సంతానంలో ఇరవై ఎనిమిది మంది మగపిల్లలు ఉన్నారు. మన ఇళ్ళల్లో ఇంత మంది మగవాళ్ళున్నా నువ్వు ఆడదానిలా ప్రవర్తిస్తున్నావు కదరా? మా వంశ మర్యాద తీయడానికి పూనుకున్నావు కదరా, ఇలా ప్రవర్తించటానికి నీకు సిగ్గు వేయటం లేదా?" అని ఒళ్ళు హూనం అయ్యేలా కొట్టారు.

పెట్టకూడని హింసలు పెట్టారు.

ఉన్న ఊళ్ళో తమ ఇంటి గౌరవ మర్యాదలు తీస్తున్నానని నన్ను నాన్న ఉంటున్న కుక్కువాడకు పంపేశారు.

మళ్ళీ కొన్నాళ్ళకు అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి పిచ్చివాళ్ళలా పరుగులు పెట్టించారు.

అయినా కుక్కువాడకు సంతోషంగానే వెళ్ళాను. ఎందుకంటే అక్కడ నన్ను చావకొట్టేది మామ, నాన్న మాత్రమే. కల్లుకంబలో అలా కాదు. కొట్టడానికే పదిమంది చేరేవాళ్ళు. తక్కువ అన్నా నలుగురైదుగురు వచ్చేవాళ్ళు. వాళ్ళంతా మా బంధువులే. వచ్చి చితకబాదేవాళ్ళు. అంతేకాకుండా నన్నలా కొడుతున్నప్పుడు చాలామంది అక్కడికి వచ్చి గుమిగూడేవాళ్ళు. వాళ్ళల్లో కొందరు నా పరిస్థితి చూసి నవ్వేవాళ్ళు. కొందరు తిట్టేవాళ్ళు. కొందరు జాలిపడేవాళ్ళు. ఇది దెబ్బల బాధకన్నా మరింత బాధను కలిగించేది. వాటిని అనుభవించడం, భరించడం నాకు చేతనయ్యేదికాదు. అయితే ఆడదాని లక్షణాలు కుక్కువాడకు వెళ్ళిన తరువాత మరింత పెరిగాయి.



డా. చంద్రప్ప సొబటి



రంగనాథ రామచంద్రరావు

అప్పుడు సంపూర్ణంగా ఆడదాన్నయ్యాను అనే భావన నాలో కలిగేది. అయితే దాన్ని ప్రదర్శించటానికి సాధ్యం కాదు. వీలైనంతగా దాచిపెట్టుకునేవాడిని. ఈ సమయంలో చెప్పుకోలేని నరకయాతనను అనుభవించాను. అలాంటి యాతనను ఎవ్వరికీ ఇవ్వవద్దని ఆ యల్లమ్మతల్లిని వేడుకునేవాడిని.

నేను ఆ సమయానికే ఆడదాన్నయ్యానని చెప్పానుకదా !

అయితే నా ఆడతనాన్ని పెకిలించివేయటానికి చేస్తున్న ప్రయత్నాలు మాత్రం ఆగలేదు.

గాంధిశెట్టి అని మాకు ఒక మేనమామ ఉండేవాడు. అతను నా తల్లి తమ్ముడు. అతడు మహాత్మాగాంధి మరణించిన తరువాత పుట్టాడట. ఆ కారణంగా అతనికి గాంధి అని పేరుపెట్టారు. అయితే అతను గాంధిలా కాలేదు. నాలా మగజోగమ్మ అయ్యాడు. అందువల్ల గాంధిశెట్టి అని పిలవకుండా గాందెమ్మ జోగమ్మ అని పిలిచేవాళ్ళు.



మా ఇంటివాళ్ళు అతడిని మాదిరిగా పెట్టుకుని నన్ను తిట్టేవాళ్ళు. అతను జోగమ్మగా మారి తమ వంశ గౌరవమర్యాదలు తీసింది చాలూ, వీడూ ఆ లుచ్చాలా ప్రవర్తించి మర్యాద తీస్తున్నాడని తిట్టేవారు. విచిత్రమైన విషయమేమిటంటే నన్ను ఒక రోజు అతని దగ్గరికి తీసుకునిపోయారు. అప్పుడతను కంప్లిలో నివాసమున్నాడు. అక్కడికి పిల్చుకుని పోయినప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది. నన్ను అర్థం చేసుకోవడానికి నాలా ఉన్న మా మామయ్య దగ్గరికి వచ్చానుకదా అనే ధైర్యం కలిగింది.

అయితే అక్కడ జరిగిందే వేరు.

బెత్తాలు తీసుకుని, దుడ్డుకర్ర తీసుకుని నన్ను ఇష్టమొచ్చినట్టు కొట్టారు.

పైగా మామయ్యే దానికి సహకరించాడు. అంతేకాదు, తనూ కొట్టాడు. అతను నా తరఫున ఒక్క మాట మాట్లాడలేదు. అంతేకాకుండా మా తల్లితండ్రులు నన్ను అక్కడ వదిలి వచ్చాక నాకు భోజనమూ సరిగ్గా పెట్టేవాడుకాదు. ఇంట్లో ఒంటరిగా ఉండటానికి వదిలేవాడు కాదు. ఆడపిల్లలు ఉండే స్థలాలకు పంపేవాడు కాదు. ఆడపిల్లల నీడకూడా నా మీద పడకుండా దూరంగా పెట్టాడు. అప్పుడు నాకు మా మామయ్యమీద చాలాకోపం వచ్చింది.

'మామయ్యా, నువ్వే నన్ను అర్థం చేసుకోకపోతే ఇక ప్రపంచం ఏమి అర్థం చేసుకుంటుంది? దయచేసి అర్థం చేసుకో మామయ్యా' అని చాలాసార్లు వేడుకున్నాను.

నాకు అతడి మీద ప్రత్యేకమైన గౌరవం, భక్తి ఉండేవి.

అతను నాకు మామయ్య కావటం వల్ల నేను ఎన్నడూ, 'జోగమ్మా' అని పిలవనే లేదు. 'మామయ్యా' అని పిలిచేవాడిని.

ఒక రోజు మామయ్య చౌడికె తీసుకుని ఊళ్ళోకి భిక్షానికి వెళ్ళాడు.

ఆ రోజు ఇంట్లో నేనొక్కడినే ఉన్నాను.

ఒంటరిగా ఇంట్లో ఉండటం వల్ల పట్టరాని సంతోషం కలిగింది.


ఎందుకంటే ఆ రోజు నాకు ఇష్టం వచ్చినట్టు నేను ఉండొచ్చు.

ఆ కారణంగా నా అంతరంగంలో చాలా కాలంగా ఉన్న కోరికను తీర్చుకుందామని నిర్ణయించుకున్నాను.

చీర కట్టుకోవాలన్న కోరిక ఉన్నా మామయ్య నాకు చీర దొరకకుండా దాచిపెట్టాడనే విషయం నాకు తెలుసు. అతని లుంగీనే చీరలా కట్టుకుని, జుబ్బాలాంటి అంగీని వేసుకుని, ఇంట్లోనే ఆడదానిలా ప్రవర్తించాను. అప్పుడు చాలా హాయిగా అనిపించింది. ఎక్కడలేని సంతోషం కలిగేది. ఆ సంతోషంతోనే మామయ్య బంగారు చెవి దుద్దులు పెట్టుకుని, కుంకుమబొట్టు పెట్టుకుని, నీటుగా తల దువ్వుకుని, గాజులు వేసుకుని అద్దంలో చూసుకున్నాను.

నేను ఆడదాని వేషంలో అంత అందంగా రెడీ కావడం అదే మొదటిసారి.

ఆ రోజు ఏదో విధమైన సంతోషం కలిగింది.



అందువల్ల అనేకసార్లు అద్దంలో చూసుకున్నాను. ఆ సంతోషాన్ని కేవలం మాటలతో చెప్పటానికి సాధ్యం కాదు. నన్ను నేను ఆడదానిగా అనుభూతి చెందిన మొదటి సంతోషమది. ఆ సంతోషంలో సినిమా చూడాలని అనిపించింది. ఆ ఊళ్ళో 'బాల టాకీస్' అనే సినిమా హాలు ఉంది. అదే వేషంలో సినిమాకు వెళ్ళాను. "అపూర్వ సంగమ" సినిమా వేశారు. రెండు రూపాయలు ఇచ్చి బాల్కనీ టికెట్ తీసుకుని సినిమా చూస్తూ కూర్చున్నాను. ఊరికి వెళ్ళిన మామయ్య ఎప్పుడు వచ్చాడో కానీ, అతడు ఇంటికి వచ్చినపుడు నేను కనిపించలేదు. అప్పుడు అతను ఇరుగుపొరుగు వాళ్ళను విచారించాడట. 'మీవాడు ఇప్పటి వరకూ ఇక్కడే ఉన్నాడు. ఇప్పుడే కుంకుమ బొట్టు పెట్టుకుని, చేతులకు గాజులు తొడుక్కుని ఎక్కడికో వెళ్ళాడని చెప్పారు. అది విన్న మామయ్య కోపంతో దారంతా వెదుకుతూ బయలుదేరాడు.

అదే సమయంలో ఎవరో నేను సినిమాకు వెళ్ళాననే కబురు ఆయనకు అందించారు. ఆయన వెంటనే టాకీస్ లోపలికి వచ్చాడు. ఆయన నా కోసం సినిమాచూస్తూ వరుసలో కూర్చున్నవారిని అడుగుతూ వస్తున్నాడు. ఆయన అడుగుతున్న తీరు చూడగానే అతనికి బాగా కోపం వచ్చిందని నాకు అర్థమైంది. నాలో భయం మొదలైంది. 'తారా హో తారా' అనే పాట తెరమీద నడుస్తోంది. తెరమీద వస్తున్న పాట చూడలేకపోతున్నాను. లేచి వెళ్ళిపోవటానికి మనస్సు రావటం లేదు. మామయ్య నా కోసం వెతుకుతుండటం చూసి అలాగే కూర్చుని సినిమా చూసే ధైర్యం కలగటం లేదు.

గబగబా లేచి కిందికి దిగి పరుగు పరుగున ఇంటికి వచ్చాను.

తల నిండుగా దుప్పటి కప్పుకుని ఇంట్లో ఓ మూలలో పడుకున్నాను.

సినిమా గేట్ కీపర్లు నేను కిందికి దిగి వెళ్ళిపోవటం మామయ్యకు చెప్పివుండాలి. అతనికి ఎంత కోపం వచ్చిందంటే ఇంటికి వస్తూ దార్లో కనిపించిన దుడ్డుకర్రను తీసుకుని వచ్చాడు. రాగానే ఒక్క మాట కూడా మాట్లాడకుండా, నన్ను లేపకుండా ఆ కర్రతో దబదబామంటూ పశువును బాదినట్టు బాదసాగాడు. నేను బాధతో కేకలు పెడుతున్నా వదల్లేదు.

అప్పుడు రాత్రి పన్నెండు గంటలైవుంటుంది.

ఇరుగుపొరుగు ఇళ్ళవాళ్ళంతా పడుకునివున్నారు. మామయ్య తలుపులు మూసి గడియపెట్టాడు. ఆ దెబ్బలు తలుచుకుంటే ఇప్పటికీ ఒంట్లో వణుకు మొదలవుతుంది. ఆ రోజు దెబ్బలకు తాళలేక ఉచ్చపోసుకున్నాను. బిగ్గరగా అరిచాను. కేకలు వేశాను. ఆర్తనాదాలు చేశాను. ఆ ఆర్తనాదాలు విని వీధిలోని జనం మంజును వాళ్ళ మామయ్య చంపేస్తున్నాడేమో అనుకుని తలుపులు బాది బాది తలుపులు తెరిపించి అతని చేతుల్లోంచి నన్ను విడిపించారు.

అప్పుడు నేను పడిన బాధ, హింస నా శత్రువులకు కూడా వద్దు.

మామయ్య చేతి దెబ్బల నుంచి తప్పించిన జనానికి మనస్సులోనే చేతులు జోడించాను.

వాళ్ళు రాకపోయివుంటే బహుశా నేను ఆ రోజే చచ్చిపోయివుండేవాడినేమో ! ఆ సంఘటన జరిగిన మరుసటి రోజున మామయ్యకు ఏం అనిపించిందో నాకు తెలియదు. నువ్వు నాకు లొంగవు అంటూ దావణగెరెలో ఉన్న నాన్న దగ్గరికి తీసుకొచ్చి వదిలాడు. నాన్న, అమ్మ, మామయ్య కూర్చుని రాత్రంతా ఏమేమో మాట్లాడుకున్నారు. నాకు వారి చర్చలు వినే సహనం, వినాలనే కుతూహలం లేకపోయింది.

### నా భావాలతో పోట్లాడి అలసిపోయారు

మామయ్య దావణగెరెకు పిల్చుకునిపోయి అమ్మా నాన్నలతో మాట్లాడి వెళ్ళిపోయిన తరువాత ఇంటి వాతావరణంలో చాలా మార్పు కనిపించింది. ఇంటివాళ్ళందరూ నన్ను చూడటంలో అనేక మార్పులు కలిగాయి. దేవుడి దగ్గర, పూజారుల దగ్గర, భవిష్యత్తు చెప్పేవాళ్ళ దగ్గర నా గురించి అడిగిచూశారు. వాళ్ళంతా 'మీ పిల్లవాడికి దైవికశక్తి ఉంది. అతడిని దేవతకు ముడుపుగా పెట్టేయండి. మీకూ మంచి జరుగుతుంది' అని చెప్పారు. ఇంటివాళ్ళు వాళ్ళ సూచనకు అంగీకరించారు. ఇలా అంగీకరించడానికి అనేక కారణాలున్నాయి. ఆ సమయానికే నా భావాలతో వాళ్ళు పోట్లాడి పోట్లాడి సతమతమై అలసిపోయారు. సుమారు నాలుగేళ్ళ ఈ పోరాటంలో వాళ్ళు ఎన్నడూ గెలుపొందలేదు. అంటే నన్ను మార్చలేకపోయారు. ఆ పోరాటంలో నా శరీరం, నా మనస్సు గెలుపొందాయే తప్ప వారి మొండితనం, నన్ను మగవాడిగా నిలుపుకోవాలనే తపన సఫలం కాలేదు. అంతేకాకుండా నన్ను హింసించే మనస్థితిని పోగొట్టుకున్నారు. మామయ్య గాందెమ్మ జోగమ్మ విషయంలోనూ మా తాతయ్య, అంటే మా అమ్మ తండ్రి

కూడా ఓటమిని అనుభవించి చివరికి లొంగిపోయాడట. చివరికి గాందెమ్మలా వీడూ అయిపోయాడని అనుకుని నన్ను వదిలేశారు. అయితే మామయ్య నాకే విధంగానూ సహాయపడలేదు. కనీసం నన్ను అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. అయితే అతని జీవితం చూసి, మా వాళ్ళు నన్ను వదిలేయటం వల్ల నేను బతికిపోయానని అనుకున్నాను. అంతేకాకుండా ఆ సమయంలో మేము దుర్భరమైన పేదరికంలో ఉన్నాం. మా తల్లితండ్రులు అనేక కష్టాలను అనుభవిస్తున్నారు. మా కష్టాలకు దైవిక శక్తి పీడన కూడా కారణం కావచ్చు. నన్ను హింసించడం వల్లనే తమను ఆ దేవత పీడిస్తోందని అనుకున్నారు. నన్ను దేవతకు సమర్పిస్తేనే తమకు మంచి జరుగుతుందనే నమ్మకంతో నన్ను దేవతకు కట్టించే నిర్ణయానికి వచ్చారు. వాళ్ళ నమ్మకం కన్నా నాకు స్వేచ్ఛ, స్వాతంత్రాలు ముఖ్యమనిపించాయి.

అదే వారంలో శుక్రవారం నాడు హులిగమ్మ దీక్ష ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు.

గురువారం రోజునే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

నాకు ఒక వైపున సంతోషం, మరోవైపున దుఃఖం.

నేను రేపటి రోజున నా దేహం కోరుకునే, నా మనస్సు జపించే ఆ స్థలానికి వెళుతున్నాను.

ఇంటివాళ్ళ నుంచి, బయటివాళ్ళ నుంచి పడుతున్న హింసల నుంచి విముక్తి పొందుతున్నాను.

నా దేహం కోరుకునే దుస్తులను స్వేచ్ఛగా ధరించవచ్చనే కోరిక నాలో చిగురుస్తోంది.

ఇటుచూస్తే నా తల్లితండ్రులు రోదిస్తున్నారు. నాన్న మనస్సులో రోదిస్తుంటే, అమ్మ గుండెలు బాదుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. వారి సంకటం చూసి నాకు చాలా దుఃఖం కలుగుతోంది. ముఖ్యంగా అమ్మ ఏడుపు నా గుండెలో గునపాలు గుచ్చుతున్నట్టుగా ఉంది. ఆమె కన్నపేగు బాధతో విలవిల్లాడుతోంది. నాకు అమ్మ పడుతున్న బాధ అర్థమవుతోంది. అయితే వారు ఎదురుచూస్తున్న రీతిలో సర్దుకునే మనస్థితిలో నేను లేను. ఆ సమయానికే నా మనస్సు, శరీరం వీటినంతా అధిగమించి నిలబడ్డాయి. అందువల్ల వారి సంకటాన్ని అర్థం చేసుకున్నా దానికి స్పందించటంలో నేను నిస్సహాయుడినని నాకు కచ్చితంగా తెలుసు. అందుకే అమ్మకు ఏదో ఒకటి రెండు మాటలు చెప్పాలని అనిపించింది.

అప్పుడు అమ్మ తొడ మీద పడుకుని, “నాకు నీ దుఃఖం, సంకటం అర్థమవుతుందమ్మా. కానీ ఏం చేయను? నాకై నేను మీకు ఈ దుఃఖాన్ని కలిగించటం లేదు. నా దేహం మీకు ఇబ్బంది కలిగిస్తోంది. నా దేహాన్ని, నా మనస్సుకు వ్యతిరేకంగా, మీకు అనుకూలంగా నడిపించటం నాకు సాధ్యం కావటం లేదమ్మా. నేను దేహానికి వ్యతిరేకంగా పోరాడి పోరాడి మీలాగే ఓడిపోయాను. అందువల్ల నన్ను క్షమించమ్మా” అని చేతులు జోడించి వేడుకున్నాను.

అప్పుడు అమ్మ నా తలను పైకెత్తుకుని, గుండెలకు అదుముకుని, “లేదు నాయనా, నీ మీద నాకు కోపం లేదు. ఆ తల్లి



హులిగమ్మ నీకు ఇలాంటి స్థితి తెచ్చిపెట్టింది కదా. ఆ దేవతకు నా తల్లి కష్టాలు అర్థం కాలేదా? ఆమెకు నా గోడు వినిపించలేదా? ఆమే స్త్రీ కాదా? స్త్రీ దేవతై, ఒక తల్లి సంకటం అర్థం కాలేదా? నా నుంచి నిన్ను లాక్కుని ఆమె కడుపున, ఆమె ఒడిలో వేసుకుంటోందికదా, ఇదెక్కడి న్యాయం?” అని ఏడ్చింది.

అలా చాలా సేపు ఏడ్చి, చివరికి ఆ దేవత కోరినట్టు మేము నడుచుకోవాలని చెప్పి నన్ను సమాధానపరచసాగింది.

అమ్మ ఓర్పు గొప్పదికదా !

ఆ రోజు ఆ గొప్ప గుణానికి మనస్సులో ధన్యవాదాలు చెప్పుకున్నాను. ***(తరువాయి వచ్చే సంచికలో...)***

కవిత

# ప్రేమికుడొస్తున్నాడు జాగ్రత్త


అది యాసిడో.. కత్తో
ఏదైనా అతడి ప్రేమకు ప్రతిరూపమే!
వడ్లగింజ నుండి పసుపుతాడు దాకా
అనేక ప్రేమ ద్వారాలు
ఆమె కోసం కాచుకున్నాయి
అందం, చదువు, ఉద్యోగం పాతమాట
ఇప్పుడు అమ్మాయి ఐతే చాలు
‘ప్రేమికుడొస్తున్నాడు జాగ్రత్త’ అని చెప్పాలని ఉంది
కసాయివాడిని కత్తి కూడా గుర్తిస్తుంది
ఆ కత్తి పట్టిన అతని ప్రేమను
గుర్తు పట్టటానికి
ఆమె ఓ డాలుగా మారాలి !

డా. సి. భవానీదేవి
9866847000

ఆదర్శం

డా॥ గంధం సుబ్బారావు
9440624678

# విద్యారంగానికి మండలి వెంకట కృష్ణారావు సేవలు



నిష్కళంక రాజకీయనేత, అనవరత గాంధీసిద్ధాంత మార్గగామి, త్యాగధనుడు, ప్రపంచ తెలుగు మహాసభల స్రష్ట, దివిసీమ ఉప్పెన, తుఫాను బీభత్సంలో ప్రాణాలకు తెగించి నిరాశ్రయులకు అండగా నిలచిన మండలి వెంకట కృష్ణారావు గారు విద్యామంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయాలు.

1974-78 సంవత్సరాల మధ్య జలగం వెంగళరావు మంత్రి వర్గంలో విద్యాసాంస్కృతిక మంత్రిగా పనిచేసిన మండలి వెంకట కృష్ణారావు గారి కాలం రాష్ట్రంలో విద్యారంగానికి సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు. అంత క్రితం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన రెండు వేర్పాటువాద ఉద్యమాల వల్ల విద్యాప్రమాణాలు పడిపోయాయి. ఈ ఉద్యమాలలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని, ప్రముఖ పాత్ర పోషించినందున వారిలో క్రమశిక్షణ లోపించింది. చదువు పట్ల శ్రద్ధ తగ్గిపోయింది. ఎలాగైనా ఉత్తీర్ణత సాధించాలన్న ఆలోచనతో అదుపు తప్పిన విద్యార్థుల మూలంగా ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్ పరీక్షలలో అవినీతి పద్ధతులు విస్తరించాయి.

**పరీక్షల నియంత్రణ :** విద్యారంగంలో పెచ్చరిల్లిన ఈ లోపాలను సవరించడం ఒక సవాలుగా తీసుకున్నారు మండలి వెంకట కృష్ణారావు. పరీక్షా కేంద్రాల వద్ద సంచార దళాలను ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలుచేసి, పరీక్షాకేంద్రాల వద్ద బయటివారి జోక్యాన్ని నిర్మూలించారు. సమాధాన పత్రాలను "స్పాట్ వాల్యుయేషన్" ద్వారా దిద్దించి పరీక్షల్లో అవినీతిని అదుపు చేశారు.

**అధ్యాపకుల సంక్షేమం :** విద్యా ప్రమాణాలను పెంచాలంటే అధ్యాపకులు సంతృప్తితో తమ విధులు నిర్వర్తించడం అవసరమని భావించి, అందుకు అనేక చర్యలు తీసుకున్నారు. వారి వేతనాలు, ఇతర సౌకర్యాల విషయంలో సానుభూతితో వ్యవహరించారు. ప్రైవేటు విద్యాలయాలపై ఎక్కువ అధికారాలను ప్రభుత్వానికి కల్పించే ఉద్దేశ్యంతో ఒక సమగ్రమైన విద్యా బిల్లును రూపొందించారు. మునిసిపల్ స్కూళ్ళల్లోని ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందక పోవడం గుర్తించి, మునిసిపల్ పాఠశాలలన్నింటికీ పూర్తి గ్రాంట్ చెల్లించేందుకు నిర్ణయించారు. ఉపాధ్యాయుల సంక్షేమ నిధిని మరింత వృద్ధి చేశారు.

**విద్యాశాఖ డైరెక్టరేట్ పునర్వ్యవస్థీకరణ :** కృష్ణారావుగారు విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారు. అప్పటి వరకు "డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్" గా వ్యవహరించబడుతున్న విద్యాశాఖ డైరెక్టరేట్ ను, "ఉన్నత విద్యా డైరెక్టరేట్" గానూ, పాఠశాల విద్యా డైరెక్టరేట్" గానూ విభజించి, ఉన్నత విద్యకు ఒక డైరెక్టర్ ను, పాఠశాల విద్యకు మరొక డైరెక్టర్ ను ఏర్పాటు చేశారు.

ప్రాథమిక విద్యకు ప్రత్యేకించి ఒక అదనపు డైరెక్టర్ ను నియమించి విద్యాశాఖ డైరెక్టరేట్ ను పునర్వ్యవస్థీకరించారు. విద్యాశాఖ పాలనలో తగిన మార్పులు తీసుకురావడానికి సూచనలు చేయవలసినదిగా "అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి"ని కోరారు.

**విద్యార్థుల సంఖ్య పెంపు :** ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ, ఉన్నత విద్యారంగాలలో విద్యాలయాల సంఖ్యను, వాటిలో విద్య నభ్యసించే విద్యార్థుల సంఖ్యను వృద్ధి చేశారు. 5వ పంచవర్ష ప్రణాళిక అంతానికి 6 నుంచి 11 సంవత్సరాల వయసు గల పిల్లలలో 100 శాతం బాలురను, 80 శాతం బాలికలను పాఠశాలలో చేర్చుకోవ డానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఆయన అనుకున్న ప్రకారం పథకాలు అమలు జరిగి వుంటే, ఉచిత నిర్బంధ విద్యను గురించి భారత రాజ్యాంగం ప్రభుత్వాలకు చేసిన ఆదేశాలలో ఒక భాగం చెల్లింపబడి వుండేది.

అదే విధంగా 11-13 సంవత్సరాల వయసు గల పిల్లలలో 60 శాతం బాలురను, 40 శాతం బాలికలను పాఠశాలలో చేర్చు కోవడానికి ఏర్పాట్లు జరిగాయి. సెకండరీ స్థాయిలో దానిక నుగుణంగా విద్యాలయాల సంఖ్యను, విద్యార్థుల సంఖ్యను వృద్ధి చేయ దానికి ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్రంలో ప్రతి తాలూకాలోనూ జూనియర్ కళాశాలను స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుని, అందుకు తగిన కృషి చేశారు. ఫలితంగా 1975-76 విద్యాసంవత్సరం ముగిసే నాటికి ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ కళాశాలలు లేని తాలూకాలు 20 మాత్రమే మిగిలాయి. 1974-75 చివరికి ఉన్నత విద్యను గరిపే డిగ్రీ కళాశాలల సంఖ్య 214కు చేరింది.

**క్రొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు :** అప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో మూడు విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండేవి. అవి – ఉస్మానియా, ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు. వీటిలో రద్దీ పెరిగి సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయి. రద్దీని తగ్గించే ఉద్దేశ్యంతో గుంటూరులో నాగార్జున విశ్వవిద్యాలయం, వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం స్థాపించడానికి కృష్ణారావుగారు నిర్ణయించారు. ఈ నిర్ణయం వెంటనే అమలులోకి వచ్చి అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందింది. ఒకప్పుడు పి.జి కోర్సులను విశ్వవిద్యాలయ ప్రాంగణం లోనే నడుపుతుండేవారు. ఆ పద్ధతిని సడలించి ఎంపిక చేసిన కొన్ని డిగ్రీ కళాశాలలో కూడా పి.జి కోర్సులను ప్రవేశపెట్టడానికి అనుమతు లిచ్చారు.

**సాంకేతిక విద్య పటిష్టత :** సాంకేతిక విద్యారంగాన్ని పటిష్టం చేయడానికి, కొన్ని పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సుల వైవిధ్యీకరణకు మంత్రిగా కృష్ణారావుగారు తీసుకున్న నిర్ణయాలు, కోర్సులలో ఉత్తీర్ణులైనవారికి ఉద్యోగావకాశాలను మెరుగుపరచాయి.

**స్త్రీలకు ఉన్నత విద్య :** స్త్రీల ఉన్నత విద్యకు ప్రాధాన్యమిచ్చి, మహిళా కళాశాలలు లేని 10 జిల్లాలలో రెండింటిలో కళాశాలలు స్థాపించారు. తక్కిన జిల్లాలలో కూడా అనతి కాలంలో మహిళా కళాశాలు ఏర్పాటు చేయడానికి పథకాలు రూపొందించారు.

**సంగీత నృత్య కళాశాలలు, వయోజన విద్యాకేంద్రాల అభివృద్ధి:** రాష్ట్రంలోని సంగీత, నృత్య కళాశాలల సంఖ్యను పెంచి, లలిత కళల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాదు నగరంతో పాటు ప్రతి జిల్లాలోనూ వయోజన విద్యాకేంద్రాలను స్థాపించారు. వీటి మూలంగా ప్రతిఏటా 18 వేల మంది వయోజనులు విద్యా వంతులు కాగలిగారు.

గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతులైన పిల్లలను ప్రోత్స హించే నిమిత్తం అంతకుముందు నుంచీ నడుస్తున్న మూడు గురుకుల పాఠశాలలకు అనుబంధంగా ఒక జూనియర్ కళాశాలను స్థాపిం చారు.

**విద్యార్థుల ప్రగతి మదింపు :** పాఠశాలల్లో డిటెన్షన్ పద్ధతి రద్దుకావడం వల్ల వార్షిక పరీక్షలంటే పిల్లలకు భయం లేకుండా పోయింది. కృష్ణారావు గారు వార్షిక పరీక్షల స్థానంలో విద్యార్థులచే ప్రతిరోజూ చేయవలసిన పనిని చేయించడానికి, దానికనుగుణంగా విద్యార్థుల ప్రగతిని మదింపు వేయడానికి అవసరమైన విధానాలను రూపొందించారు.

ఈ పద్ధతులు అమలు చేయడానికి అవసరమైన శిక్షణను ఉపాధ్యాయులకు ఇప్పించాలి. అధ్యాపకులు ఈ పద్ధతులను ఫలప్రదంగా అమలు చేస్తున్నారో లేదో పర్యవేక్షించడానికి అర్హులైన సూపర్ వైజర్లను నియమించాలనే నిర్ణయాన్ని విద్యాశాఖ వారు 1973 – 74 సంవత్సరంలో తీసుకుని, ఉపాధ్యాయులకు శిక్షణను ఇవ్వ డానికి కొంత సొమ్మును కేటాయించారు. ఈ కార్యక్రమాన్ని సమీక్షించి కృష్ణారావుగారు దీనిని ఇంకా పటిష్టం చేయడానికి నివేదికను రూపొం దించారు. అయితే, జిల్లా స్థాయిలోని అధికారులు ఈ పథకాన్ని అమలు చేయడంలో తదనంతరకాలంలో విఫలమైనారు.

**విద్యార్థులతో మమేకం :** దేశంలో ప్రతి ఏటా జరుపుతున్న "టీచర్స్ – డే" ను "గురుపూజాదినోత్సవం" గా మార్చారు. అవకాశం చిక్కినప్పుడల్లా పాఠశాలలను, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థుల తోనూ, ఉపాధ్యాయులతోనూ ప్రత్యక్ష సంబంధం పెట్టుకుని వారి కష్టసుఖాలు తెలుసుకునేవారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ళకు వెళ్లి, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ, హాస్టల్ విద్యార్థులతోపాటు కూర్చుని, వారికి వండిన భోజనమే వారితో పాటు తానూ తింటూ, వారితో చనువుగా మెలగుతూ, విద్యార్థుల బాగోగులను శ్రద్ధగా గమనిస్తూ, వారి సమస్యలపై వారితో చర్చించి, నచ్చజెపుతూ, విద్యామంత్రిగా మండలి వెంకట కృష్ణారావు విద్యార్థుల, ఉపాధ్యాయుల అభిమానాన్ని చూరగొని వారికి ఆత్మీయుడుగా మెలిగారు.

**రాష్ట్రస్థాయి విద్యాసదస్సు :** విద్యా విధానం పై సమగ్రమైన చర్చ అవసరమని భావించి, రాష్ట్రస్థాయి విద్యాసదస్సును నిర్వహిం చారు. దానిలో విద్యావేత్తలు, పాలనాధికారులు, విద్యార్థులు, స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థుల సంరక్షకులు పాల్గొన్నారు. విద్యా ప్రమా ణాల పెరుగుదలకు వారిచ్చిన సలహాల ప్రకారం ఎంతో కాలంగా ఆలోచనలోవున్న సమగ్ర విద్యా బిల్లును రూపొందించడానికి గానూ రాజగోపాలన్ ఐ.ఎ.ఎస్ అధ్యక్షతన ఒక కమిటీని వేసి బిల్లును రూపొందింపజేశారు.

**అనంతపురం పి.జి. సెంటర్ అభివృద్ధి :** 1974–76 సంవత్సరాలలో అవసరమైన చోట్ల విద్యాభివృద్ధికిగాను 32 డిగ్రీ కళాశాలలను, 70 జూనియర్ కళాశాలలను నెలకొల్పారు. అనంత పురం పి.జి. సెంటర్ ను అభివృద్ధి పరచి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వడం జరిగింది. తదనంతర కాలంలో ఇది "శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యా లయం" గా రూపాంతరం చెందింది.

**ఉపాధ్యాయ సదస్సు :** విద్యాప్రమాణాల పెంపుదలకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ద్వారా, ప్రాంతీయ, బ్లాక్, జిల్లా స్థాయి ఉపాధ్యాయ సదస్సులను నిర్వహించి వారిలో ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కమిటీగా విద్యాప్రమాణాల పెంపుదలకు తోడ్పడే 12 అంశాల పథకాన్ని రూపొందించారు.

మండలి వెంకట కృష్ణారావుగారు అనగానే ఆయన నిర్వ హించిన ప్రపంచ తెలుగు మహాసభలు, 1977 నవంబర్‌లో దివి సీమను అతలాకుతలం చేసిన ఉప్పెనలో ఆయన చేసిన సేవాకార్య క్రమాలే గుర్తుకు వస్తాయి. విద్యామంత్రిగా విద్యారంగంలో ప్రమాణాల మెరుగుదలకు కృష్ణారావుగారు ప్రవేశపెట్టిన సంస్కరణలు మరుగున పడిపోతున్నాయి. డిగ్రీ స్థాయి వరకు తెలుగును బోధనాభాషగా అభివృద్ధి చేయడానికి తెలుగు అకాడమీ చైర్మన్‌గా ఆయన చేసిన కృషి ఎనలేనిది.

విద్యామంత్రిగా వుండి తన కుమారుడు బుద్ధప్రసాద్ గారిని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు మీడియంలో చది

**( ...తరువాయి 43 వ పుటలో )**

ధారావాహిక

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

# సొంతంత్రకాల సదువులు 4

### ఆంధ్రో[redacted]మం :

మదరాసు [redacted] కలిపి ప్రత్యేక అంధ్రరాష్ట్రంగా ఏర్పాటు చేయాలని తెలుగు నాయకులు పోరాటం చేస్తా ఉండారంట. మేము ఐదో తరగతిలో ఉన్నెపుడు మా మేస్టరు అపుడపుడూ ఈ సమాచారాన్ని చెప్తా ఉండిరి.

మా మేస్టరుని చూసేకి పేటనింకా వాళ్ల నేస్తగాళ్లు వచ్చినపుడంతా వాళ్లు మాట్లాడుకొనేది ఇవే మాటలు "రేయ్ శబ్దము రాకుండా చదువుకోండ్రా" అని మాకు బెత్తాన్ని చూపేసి, వాళ్లు మాట్లాడుకొంటా ఉండేది. ఆ మాటలు మా చెవుల్లోకి దూరకుండా ఉంటాయా?

"నాకేమో రవంత దిగులుగా ఉందప్పో, తెలుగు నాయకులు, మన హోసూరు ప్రాంతాన్ని గురించి పట్టించుకొంటా లేరే. మదరాసు నగరమూ బళ్లారీ, వీటిని గురించే వాదాడతా ఉండారు. ఇంకొకపక్క ఆ గుంటనక్క రాజాజీ 'నేను పుట్టిన సేలం జిల్లాలో సూదిమొన మోపినంత కూడా ఆంధ్రులకు ఇచ్చేది లేదు' అనేసినాడే, ఎట్లప్పా" ఒకరి మాట.

"ఏల ఆయనకి తెలుగంటే అంత వెక్కసము, ఆయన పుట్టింది తెలుగు నేల మీదే కదా, హోసూరు పేటకి నాలుగుమైళ్ల దూరములోని తొరపల్లిలో ఆయన పుట్టింది. అక్కడినింకా నడిచొచ్చి హోసూరులో తెలుగు ఇస్కూల్లోనే కదా ఆయప్ప చదివింది" ఇంకొకరి పలుకు.

"ఏలంటే గ్రామ రాజకీయాలలో తెలుగోళ్ల ముందు ఆయన ఆటలు సాగలేదు కదా, తొరపల్లిలో కమ్మోళ్లు జాస్తి, అయ్యంగార్లుండేది రెండు మూడిండ్లే, కమ్మోళ్ల రాజకీయం ముందు ఈయన పప్పు ఉడకక సేలానికీ అనెంక మద్రాసుకీ పొయ్యేసె. ఆ కాలమునింకా తెలుగంటే కోపము, తెలుగే కాదు, ఆయన పుట్టి పెరిగిన హోసూరు తావంటే కూడా కోపమే, 'కళీపుళీకంబళీ ఇంకేముంది హోసూర్లో' అని అరవములో గేలి చేయలేదా! సంగటి ముద్దలూ చింతమాన్లూ కంబళ్లూ తప్ప ఇంకేమీ కనపడలేదు ఆయప్పకి" మరొకరి మాట.

"అదెట్లన్నా పోనీ, ఒక్క ప్రకాశంగారు తప్ప తెలుగు నాయకులు ఎవరూ హోసూరును గురించి నోర్లు ఎత్తుతా లేరే. 1950 జనవరి 4న పార్టీషన్ కమిటీ, మద్రాసు సర్కారుకు సమర్పించిన నివేదికలో కూడా, వివాదం లేని పదకొండు జిల్లాలు (శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పడమటి గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు), మూడు తాలూకాలు (ఆలూరు, ఆదోని, రాయదుర్గం) కలిపి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పిరే, ఏమప్పా చేసేది?" తొలి గొంతు.

ఇట్లా సాగతా ఉండేవి వాళ్ల గొంతులు. ఇస్కూల్లో మేస్టరోళ్లే కాదు, ఊర్లో రచ్చ దగ్గర మా పెద్దోళ్లు కూడా ఇవే మాటల్ని మాట్లాడతా ఉండిరి.

"ఏమన్నా, నెహురూ సర్కారు ఆంధ్రరాష్ట్రమును ఇచ్చేనట్ల ఉందా లేదాన్నా?" ఒక గొంతు.

"ఈకుండా దాటేసేకి అయ్యేలేదప్పో, ఆ మహన్నబావుడు పొట్టి శ్రీరాములు ఉపాస సత్యాగ్రహానికి కూకోనుండారు. ఇపుటికి ఇరువై దినాలు అయిపోయె. రాజాజీకి జెరం కాస్తా ఉండాదంట. ఇంకెట్లా ఆంధ్రా ఇచ్చే కావాల కదా, దానికనే మన మత్తిగిరి తావ ఉండే సర్కారు క్యాటిల్‌ఫాంలోని గొడ్లనంతా దిగువసీమకు పంపేస్తా ఉండారంట" ఇంకొక గొంతు.

"ధర్మపురిలో శ్రీనివాససెట్టి అనే ఒక గాండ్ల సెట్టిగారు, రెయ్యికి రెయ్యే ఆ పేట గోడలంతా, రాజాజీ చావాల, ఆంధ్రా రావాల అని రాసేసిరంట. కోలుకార్లు ఆయన్ని పట్టుకొని చిత్రహింసలు పెట్టిరంట. ధర్మపురికి ఐదుమైళ్లలోని వెంకటాంపల్లి ఆయన ఊరంట. ఆ పల్లెలన్నీ ఉడుకుతా ఉండాయంట" మరొక గొంతు.

1952 డిసెంబరు 16, మంగళవారము. మేము ఊళ్లోనే ఉండాము. మా మేస్టరు వచ్చి, పూడుకుపోయిన గొంతుతో ఒక చెడ్డవార్తను చెప్పిరి. 58 దినాలు ఉపాస సత్యాగ్రహము చేసిన పొట్టి శ్రీరాములుగారు నిన్న రెయ్యి అమరులు అయ్యిరంట. ఈ మాటను చెప్పిన మేస్టరు, అనెంక వలవలమని ఏడిచిరి. మేస్టరు ఏడిచేది చూసి మాకందరికీ ఏడుపొచ్చె.

ఇట్లా ఆటపాటలూ చదువుపాఠాల నడుమ ఆంధ్రోద్యమం మాటల్ని వింటా మా చదువు సాగింది.

పోయినట్లే పోయి తిరుక్కొంటిమి : బయళ్లలో ఆటలు పాటలు అన్నీ ముగిసిపోయెనే, ఇంక పేటలోని పెద్ద ఇస్కూలికి పోవాలనే అని పాసయినోళ్లం బాధపడుతా ఉంటే, ఇస్కూలు చదువులూ పేట సోకులూ అన్నీ లేకుండాపోయెనే అని ఫెయిలయిన మా జతగాళ్లు వెతపడుతా ఉండారు. మేము వాళ్లని కుషీ చేసేదానికి పోతే, వాళ్లు మాతో "పోండ్రా రేయ్, మండెమ్మ చింత మండెమ్మదైతే, మండెమ్మ మొగునికి మిండగాళ్ల చింతంట" అని గదిరేసిరి.

ఇస్కూళ్లు సురువయిపోయె. మమ్మల్ని హోసూరులోని బోర్డు



హైస్కూలుకు చేరిపించేకి, తోడుకొని పోతా ఉండారు మేస్టరు. మాకేమో ఒక తరా(లాంటి) దిగులు. ఇష్టమొచ్చినట్ల, ఆవుల చిన్నోళ్ల జతలో ఆడతా పాడతా మీజుతా (ఈదుతా) గడిపినదంతా గేపకము వస్తా ఉంది. ఇపుడు ఎక్కడో దూరంగా పేటలో పెద్ద ఇస్కూలంట, పెద్ద తరగతులంట, చానా మంది మేస్టర్లంట. ఎవరు ఎట్లుంటారో, ఎవరు ఎట్లెట్ల కొడతారో! మా సొతంత్రమంతా పోయెనే అని చింత దూరుకొనేసె.

హోసూరు ఇస్కూలుకు పోతిమి. నిజముగానే చానా పెద్ద ఇస్కూలు అది. మా మేస్టరు పోయి విచారించిరి. పల్లెల నింకా వచ్చే వాళ్లని నేరుగా ఆరోక్లాసుకు అట్లే చేర్చుకోరంట. ఒక ప్రవేశ పరీక్ష ఉంటుందంట. దానిలో పాసైతేనే చేర్చుకొంటారంట. ఆ ప్రవేశ పరీక్ష ఇంకొక నాలుగునాళ్లకు జరుగుతుందట. ఇంకొక పెద్ద తంట వచ్చేసెనే అనే వెత వచ్చేసింది మాకు. తిరిగి ఇంటికి చేరుకొంటిమి. మా నలుగురికీ మేస్టరు చేత పాఠాలన్నీ నూరిపించి తాగించిరి మా పెద్దోళ్లు. మేస్టరును మా వూర్లోనే పెట్టుకొని ముప్పూటలా మా వీపుల్ని సాపు చేయించిరి.

నాలుగోనాడు పొద్దున్నే హోసూరికి పోయి, మాపుదంకా ప్రవేశ పరీక్షను రాసి, మునిముని మబ్బుకు ఇంటికి వస్తిమి. మూడోనాడు, ముగ్గురు పాసైరి, చేరేకి రండనే సమాచారము వచ్చింది. పాపం మా నలుగుర్లో రామచంద్రునికి సీటు చిక్కలేదు. అనెంక రాజా ఇలాకా (మైసూరు స్టేట్) లోని వాళ్ల మామవాళ్ల ఊరైన సర్జాపురంలో సీటు చిక్కిందని పొయ్యేసినాడు. మొన్నమొన్న సొతంత్రం వచ్చేకంటా మా హోసూరు తావు కుంపిణీ (ఈస్ట్ ఇండియా కంపెనీ) వాళ్ల ఏలుబడి కింద ఉండె కదా, దానికే మా తావును కుంపిణీ ఇలాకా అంటారు. మైసూరు రాజుల ఏలుబడికింద ఉండిన రాజా ఇలాకా ఎల్ల, మా వూరికి సరిగ్గా మైలుదూరములో ఉంటుంది. ఎల్లకు ఆ తట్టున ఉండే రాజా ఇలాకాలో కూడా మా తావు అట్లానే అన్నీ తెలుగు పల్లెలే, తెలుగు బడులే.

మేము ముగ్గురమూ, మమ్మల్ని ఇస్కూల్లో చేర్పించేకి మా అబ్బోళ్లు ముగ్గురూ కలిసి హోసూరికి పోతిమి. పోయి పెద్ద మేస్టరు ముందు నిలబడితిమి. ఆయన ఆ హైస్కూలుకి తలట్లా వారంట. దానికే ఆయన్ని తలమేస్టరు అంటారంట. అయితే ఆయన తలమీద మాత్రము వెంటుకలే లేవు, మినమిన మెరుస్తా ఉంది. తలమేస్టరు మా ఒరపురేకుల్ని (సర్టిఫికేట్స్) తిరగేసి మరగేసి చూసిరి. అనెంక తలెత్తి "చూడండప్పా, మీ చిన్నోళ్లు ఫస్ట్‌ఫారం (ఆరో తరగతి) లో చేరాలంటే, వాళ్లకు పదేండ్లు నిండి ఉండాలి. వీళ్లకి తొమ్మిదేండ్లే నిండి ఉండాయి. కాబట్టి పై ఏడాదికి రండి" అని కరాకండిగా చెప్పేసిరి.

ఇంకేమి చేసేది, బయటకొచ్చి నాలుగణాలకు బటానీలు కొనుక్కొని కుటుముతా (నములుతా) ఆరుగురమూ ఊరిదోవ పడితిమి. రాంగ్సామి వాళ్లబ్బకు ఎంత కోపమొచ్చెనంటే, దోవంతా ఆ తలమేస్టరని తిట్టేది బటానీలను కుటిమేది, ఇదేపని. ఆ నాలుగణాల

బటానీలను ఆరుగురమూ ఐదుమైళ్లు నడస్తా కుణిమినా ఇంకా పిడికెడు మిగిలె.

గూళెద్దుల మడుగులో నానాటిగాడు :

పెద్ద ఇస్కూలంట, చానా తరగతుల కట్టడాలంట, చానా మంది మేస్టర్లంట అని దిగులు పడతా ఉంటిమి. పేట చదువని రవంత ఆశపడిందీ కద్దు. ఇపుడు అదంతా తప్పిపోయె. తిరిగి ఆటలూ పాటలూ కేళికలూ, చెరువుల్లో జలకాలూ, చిన్నేటి మడుగుల్లో మీజులూ, బాలనాగమ్మ భట్టి విక్రమార్క సహస్ర శిరచ్చేద అపూర్వ చింతామణి వంటి కథల్ని చదివి వినిపించేదీ, పెద్దోళ్లకు రామాయణం భారతం కథల్ని చదివి చెప్పేది, ఇట్లా ఆనందాలన్నీ మా పైన ముసురుకొనె. పోయిన సొతంత్రం తిరిగి చిక్కినట్లాయె మాకు.

ఆ నడాన పేటకు పొయినపుడు ఒక చెరువుని చూస్తిమి. చెత్తా చెదారమంతా నిండిపోయి గబ్బు కొడతా ఉండె అది. మా వూరి చెరువు సొచ్చెంగా ఉంటాది. మొయిలు లేచిందంటే వాన కురస్తాది, వాన కురిసిందంటే వంక పారతాది, వంక పారిందంటే చెరువు నిండతాది. రేవతోనకు రేవులు నానితే, బరణివానకు దరణి తడస్తాది. మిసిరి (మృగశిర) వాన మించి మించి (మెరిసి మెరిసి) కురిసి వంకల్ని పారిస్తే, ఆద్రోన (ఆరుద్రవాన) అడిగినంత కురిసి చిన్నేటికి వెల్లువను మోసుకొస్తాది.

మావూరిని ఆనుకొనే పారుతుంది చిన్నేరు. దాంట్లో పెద్దపెద్ద మడుగులు ఉంటాయి. ఒకొక్క మడుగయితే చిన్న చెరువంత ఉంటాది. ఆ మడుగుల్లో చెరువుల్లో చిన్నోళ్లమంతా పోయి మీజు(ఈత) కొడతాము. పెద్దోళ్లు గొర్రెల్నీ గొడ్లనీ తోలుకొచ్చి కడగతారు. ఎంత దుమికినా ఎంత మీజినా ఎంత కడిగినా రవంత సేపుకే ఆ నీళ్లు తేటపడిపోతాయి. ఎంత తేటంటే, నీళ్లల్లో కాసుల్ని విసిరితే, అవి మెల్లగా కిందికి దిగి అడుగున కూకొనేది మనకు బాగా కనబడుతుంది. ఇంక మా మీజుల రకాలను చెప్పాలంటే ఎన్నో, బొక్కబోర్లా మీజేది, వెల్లెలుకులా మీజేది, కప్పగెంతినట్లు మీజేది, దమ్ముపట్టి చానాసేపు కదలకుండా నీళ్లపైన పడుకొనేది. మగ చిన్నోళ్లమే కాదు, ఆడబిడ్డలు కూడా మీజేదే.

చిన్నేటి మడుగులకు కొన్ని పేర్లు ఉండాయి. మునేశ్వరుని మడుగు (దీని పక్కన చిన్న మునేశ్వరుని గుడి ఉంది), జంబు మడుగు, సాకిరేవు మడుగు, చింతమాను మడుగు, గూళెద్దుల మడుగు ఇట్లావి. గూళెద్దుల మడుగు, ఇరవై అడుగుల లోతూ ఇన్నూరు (200) అడుగుల పొడవూ డెబ్బై అడుగుల వెలుపూ ఉంటుంది. దానికి ఆ పేరు ఎట్ల వచ్చిందని మా పెద్దోళ్లని అడిగితే చెప్పిరి. ఆవుల్ని దాటేకి ఊరూరికీ ఒక గూళెద్దు (ఆంబోతు) ఉంటుంది. అది ఒకరికి సొంతంకాదు, ఊరుమ్మడి గొడ్డు. చేన్లల్లో సొతంత్రంగా మేసి కొవ్వెక్కి భయంకరంగా ఉంటాయవి. వాటి తంటకు పోవాలంటే ఎట్లా వాళ్లకైనా దిగులే.

ఒకసారి ఆ మడుగుకు ఈ పక్క మా అగ్గురారం గూళీ, ఆ పక్క ఎళసగిరి గూళీ నీళ్లు తాగతా ఒకదాన్ని ఒకటి చూసుకొని రంకెలేసినాయి. రెంటికీ వైరమొచ్చేసింది. బుసలు కొడతా చెరొక పక్కనింకా మడుగులోకి దుమికినాయి. కొమ్ములు కొమ్ములు కలుపుకొని పోట్లాటకు దిగినాయి. వాటి పోరుకు మడుగంతా అల్లకల్లోలం అయిపోయె. కొమ్ముల్ని కలుపుకొనే, పక్క గడ్డకు ఒరిగి సుదారించుకొనేదీ, అలుపు తీరినంక పోట్లాడేదీ. మడుగును దాటకుండా మూడు దినాలు పోట్లాడినాయి. మడుగుకు రెండు పక్కలా జనాలు గుమిగూడి చూస్తా ఉండారేకానీ, వాటిని విడిపించేకి ఎవరికీ తెంపు రాలేదు. మూడోదినం రెండు గూళెద్దులూ ఆ మడుగులోనే చచ్చిపోయె. అపుటినింకా ఆ మడుగు పేరు గూళెద్దుల మడుగు అయింది.

మా వూర్లో ఇంటింటికీ ఆవులమందలు జాస్తి. అన్నేసి ఆవుల్ని కడగాలంటే చానా గాసి. దానికి ఏమి చేస్తారంటే, మడుగు దగ్గరకు తోలుకొనిపోయి, మేపరి ఆ పక్కకు పోయి కూస్తే, ఆవులన్నీ మడుగులోకి దిగి మీజుతా ఆ పక్కకు పోతాయి. ఆయన తిరగా ఈ పక్కకు వచ్చి కూస్తే, మీజుకుంటా ఈ పక్కకు వచ్చేస్తాయి. ఇట్ల రెండు మూడుసార్లు మీజిపిస్తే చాలు, మురికంతా పోయి మినమిన మెరుస్తాయి ఆవులు.

మా నానాటిగాడు మీజేదాంట్లో మొనగాడు, అంతేకాదు చానా పోకిరోడు. ఆవులు మీజేటపుడు వాటి తోకల్ని పట్టుకొని మీజుతా మడుగుని దాటతుంటాడు. ఇట్లే ఒకనాడు ఆవులు మీజుతా ఉంటే, ఒకదాని తోకను పట్టుకొని పోయినాడు. ఎట్ల ఏమారిపోయెనో, తిరిగేటపుడు ఉషారుగా తిరగలేదు. అంతే. ఆవులు వానిని నీళ్లల్లోకి తొక్కేసె. పెద్దోళ్లమూ చిన్నోళ్లమూ బెప్పర (నిర్ఘాంత) పోయి చూస్తా ఉండగానే వాడు చచ్చిపోయె.

వాని అమ్మా అబ్బలు బొడుసుకొని బొడుసుకొని (గుండెలు బాదుకొని) ఏడిచిరి, జతగాళ్లము నోళ్లు కొట్టుకొని ఏడిస్తిమి. మా కండ్లనీళ్లకు చిన్నేరు పొంగి పారింది.

పేట బతుకు పక్కకు పయనం :

నానాటిగాడు మన్నయిపోయిన నాలుగునాళ్లకు, ఐదో తరగతి పాసైన మా ముగ్గురు చిన్నోళ్ల పెద్దోళ్లు కలిసి మాట్లాడుకొని, ఒక ముడువు (నిర్ణయం)కు వచ్చిరి. మేము ఈ ఏడాదంతా ఇట్లే ఊర్లోనే ఉండిపోతే, చదువుకు దూరమైపోతామని వాళ్ల వెత. దానికనే హోసూరులో ఎవరైనా ఒక మేస్టరింట్లో మమ్మల్ని పెట్టి చదివించాలనీ, మేస్టరుకు తలా రెండు పుట్ల రాగులూ వడ్లూ, రెండుమూడు బండ్ల కట్టెలూ కాయకరుసులూ ఇయ్యాలనీ తీర్మానించుకొనిరి.

హోసూరులోని కుమ్మరిపేటలో గురుమూర్తిగారు అనే మేస్టరు ఉండారనీ, ఆయన దగ్గర విడిస్తే బాగా చదువు చెప్పిస్తాడనీ మా పెద్దోళ్లకి ఎవరో చెప్పిరి. ఆ మాటతో ముందుగా మా అబ్బోళ్లు పొయి, ఆ మేస్టరుతో మాట్లాడేసి వచ్చిరి. అనెంక మంచిదినము చూసి మమ్మల్ని తోడుకొని పోయి హోసూరులోని మేస్టరింట్లో విడిచిరి.

విశాలమైన బయలు. చుట్టూ గోడ. నట్టనడుమ రెండిండ్లు, పెద్దదొకటీ చిన్నదొకటీ, ఒకదాన్ని ఒకటి ఆనుకొని ఉండాయి. ఇదే గురుమూర్తి మేస్టరు ఇల్లు. సొంతిల్లు కాదంట, బాడుగిల్లంట. ఒకింట్లో ఆయన కుటుంబముంది. ఇంకొక ఇంట్లో మా అట్లా చదువుకొనే చిన్నోళ్లము ఏడెనిమిది మందిమి ఉండాము. మేస్టరుకు నలుగురు

కూతుర్లూ, ఇద్దరు కొడుకులు. పెద్ద కూతురు ఒకతే హైస్కూలుకు పోతా ఉంది. మిగతా అందరూ ఎలిమెంటరీ స్కూలే. మేస్టరు ఇల్లాలే మా కందరికీ వండి వడ్డిస్తుంది. కన్నతల్లికంటే మిన్నగా పూటపూటా ఆప్యాయంగా అన్నం పెడుతుంది.

గురుమూర్తి మేస్టరు నిజముగానే గురూత్తములు. ఎన్నో జన్మల పుణ్యమేమో మాకు ఆయన అండ దొరికింది. హైస్కూల్లోనే చానా పేరు మా మేస్టరుకి. ఇంగ్లీషు వ్యాకరణంలో గొప్ప దిట్టంట. ఆయన ఇంత వరకూ మేము చదివిన చదువును పరీక్షించిరి. అనెంక ఇంగ్లీషు అక్షరాలను నేర్పేకి ఆరంభించిరి. ఐదో తరగతి వరకూ అన్నీ తెలుగు పాఠాలే మాకు. ఆరో తరగతిలో ఇంగ్లీషు ఆరంభమైతుందంట.

నాలుగురకాల ఇంగ్లీషక్షరాలను బాగా నేరిస్తిమి. తెలుగు వ్యాకరణమూ లెక్కలూ చరిత్రా భూగోళములలో ఒక్కొక్కనాడు పాఠాలను చెప్తా ఉండారు. మేము ఇస్కూల్లో ఆరోతరగతికి చేరేకి ఇంకా ఏడెనిమిది నెలలు పోవాల. దానికనే ఆరోతరగతి మేస్టర్లకు చెప్పి, మమ్మల్ని కూడా తరగతిలో కూకోబెట్టి, ఐస్కూలును వాడిక చేసిరి మేస్టరు.

ఇట్ల స్కూల్లో మేస్టరింట్లో చదువుతా, తింటా, వాళ్ల ఇంటి పనుల్లో చిన్నచిన్న సాయం చేస్తా మెల్లమెల్లగా మేస్టరుకు దగ్గరయితిమి. మేము ఏడెనిమిది మందిమి విద్యార్థులం ఉంటేనూ, అగ్గ్రారం వాళ్లము ముగ్గరమే భోజనానికి మేస్టరింట్లో. మిగిలినవాళ్లు, వాళ్ల చుట్టాల ఇండ్లల్లో తినేసి, చదువుకూ పడకకూ మేస్టరింటికి వస్తుంటారు. ఆరునింకా పదకొండు తరగతుల వరకూ ఉండారు వాళ్లలో.

దినము తప్పినా దినము, మాకందరికీ రెండుగంటల సేపు పాఠాలను చెప్తారు గురువుగారు. సరిగా చదవకుంటేనో, ముందు చెప్పిన పాఠాల్ని ఒప్పించకుంటేనో మా వీపులు విమానం మోత మోగుతాయి. తన బిడ్డల్ని కూడా మా జతలోనే కూకోబెట్టి చదువు చెప్తారు. మాకంటే వాళ్లకే ఎక్కువ దెబ్బలు పడుతుంటాయి. తొలిబడి చదువులు బాగా నేర్చుకొని వచ్చిన మాకు మాత్రం తక్కువ దెబ్బలే. అప్పుడే మా మేస్టరు, తలమేస్టరుతో మాట్లాడి ఆ ఏడాదే మేము ఆరో తరగతిలో చేరేనట్లా ఒప్పించిరి. ఒక ఏడాది అకలాయెం (వృధా) అయిపోయెనే అనే మా వెత తగ్గిపోయింది.

రానురాను మా గురువుగారి బిడ్డలు ఆరుగురూ మేము ముగ్గరమూ కలిసిపోయి ఒకే కుటుంబం వాళ్లుగా అయిపోతిమి. ఆయిత్తారం (ఆదివారం) నాడు మురికిబట్టలను ఎత్తుకొని చెరువుకు పోతాము. ఎవరి బట్టలను వాళ్లే ఉతుక్కోవాల. గురువుగారి బట్టలను మాత్రము ఆయన భార్య ఉతికేస్తాది. మేము ఉతికేస్తామన్నా ఒప్పుకోదు. బట్టల మూటను మాత్రం మేమే మోసుకొని పోతాము.

మాపుసరి పూట విశాలమైన ఇంటిబయల్లో చిన్నోళ్లమంతా చేరి ఆటలాడుకొంటాము. గురువుగారు దూరంగా కూకొని నగుమోముతో మా ఆటల్నీ చిలిపి తగువుల్నీ చూస్తుంటారు. ఒక్కోసారి దగ్గరకొచ్చి మమ్మల్ని ఉత్సాహపరుస్తుంటారు. దీపాలంటించే పొద్దుకు అందరమూ గదులకు చేరి, పుస్తకాలను ఎత్తుకోవాల. లేదంటే రుద్రావతారుడైపోతారు గురువుగారు.

మేము గురువుగారింటికి పొయిన కొత్తల్లో ఒకనాడు, "గదుల్లోనే ఉండి మగ్గిపోవద్దండ్రా, రెండు మూడు నాళ్లకు ఒకసారన్నా మాపుసరిపూట అట్ల బయటకుపోయి తిరిగి రండి, బయటగాలిని పీల్చినట్లూ ఉంటుంది, పేట వీధులు వాడికయినట్లూ ఉంటుంది" అన్నారు గురువుగారు. అపుటినింకా అపుడపుడూ బయటకు పోయేది వాడిక చేసుకొంటిమి.

హోసూరు ఒక పేట (పట్టణం). తూరువున చంద్రచూడేశ్వరస్వామి కొండ, పడమరన టిప్పు సుల్తాన్ కోట. కోట చుట్టూ నీళ్లు నిండి ఉండే వెలుపైన అగడ్త. దక్షిణాన కచేరీలు. ఉత్తరాన ఆంజనేయ, శ్రీకృష్ణ ఆలయాలూ వాటిని ఆనుకొని పోయే బాగలూరు బాట. పేటకు నట్ట నడుమన మదరాసు – బెంగళూరు నిడివిబాట. పేటలో తూర్పు పడమరలుగా ఒక మైలు పొడుముండే రెండు వీధులు, ఒక దానిపేరు సున్నపురాళ్లవీధి, ఇంకొకటి రామదేవుని గుడి వీధి. ఈ రెండు వీధులకీ సమాంతరంగా రవంత దూరంగా కచేరి వీధి. ఈ మూడు వీధుల్నీ కలపతా చెరువీధి, కుంబేశ్వరస్వామి వీధి.

వీధుల నడుమ నెలకొని ఉండే జనపపేట, నేసేపేట, దిగువ గొల్లపేట, పై గొల్లపేట, కుమ్మరిపేట, తేరుపేటలు. ఒక సంతబయలు. బయలుకు దూరంగా పార్వతి బీళ్లు. ఈ బీళ్లలో బైస్కోపు (సినిమా) కొటాయి (టెంట్). పేటకు చుట్టూ రామనాయకుని చెరువు, చంద్రాంబుది చెరువు, దేవర చెరువు, దుడ్డు చెరువు అనే నాలుగు చెరువులు. ఒక హైస్కూలు, రెండో మూడో ఎలిమెంటరీ స్కూళ్లు, అన్నీ తెలుగువే. బడుల్లో పాఠాలన్నీ తెలుగే, కొటాయిల్లో బైస్కోపులన్నీ తెలుగే, వీధుల్లో మాటలన్నీ తెలుగే, కచేరీల్లో పనులన్నీ తెలుగే, ఇన్ని మాటలేల, తెలుగుతల్లి పలుకుమువ్వలను కట్టుకొని పరవశించి ఆడే నేల మా హోసూరు.

ఊరిమీద కలవరం :

గురువుగారి ఇంట్లో బాగా కుదురుకొంటిమి. మేము పేటకు వచ్చి చాన్నాళ్లు అయిపోయింది. మాకు ముగ్గురికీ ఊరిమీద, ఇంటోళ్లమీద గేపకం వచ్చేసింది. ఎపుడెపుడు పొయి ఊరును చూద్దామా అనిపిస్తా ఉంది. పోవాలని గురువును అడిగేకి దిగులు. మా పెద్దోళ్ల రాక కోసరం ఎదురు చూస్తా ఉండాము.

రెయ్యిపూట నిద్రపోయేనపుడు ఊరి తలపులన్నీ మా కండ్లలోకి కలలై వచ్చి మమ్మల్ని కలవర పెడతా ఉండాయి. మేము వచ్చేటపుడు ఈతతోపులో ఈతగొలలు నిండా ఉండె. పచ్చని ఆ కాయలన్నీ ఇపడు పసుపువన్నె పండ్లయి ఉంటాయి. ఈత గొలలను దోటికత్తితో కోసి తెచ్చి, అరపడిన (కాస్త ఖాళీ అయిన) గాదెల్లో మాగేసినట్లు, మాగిన పండ్ల పై కుదుము (విత్తనంకు పై భాగం) ఎరుపూ నలుపూ వన్నెతో మందంగా బలిసి, చప్పరిస్తుంటే నోట్లో కరిగిపోతున్నట్లు నాకు

( ...తరువాయి 49 వ పుటలో )

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

డా॥ ఈమని శివనాగిరెడ్డి- స్థపతి
9848598446

# గోన బుద్ధారెడ్డి - రంగనాథ రామాయణం వివిధ పరిష్కరణలు

తెలంగాణాలోని మునుపటి మహబూబ్ నగర్, ఇప్పటి నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన వర్ధమానపురం (వడ్డమాను-నంది వడ్డమాను) పాలకుడైన గోన బుద్ధారెడ్డి క్రీ.శ.13వ శతాబ్దిలో, **రంగనాథ రామాయణాన్ని** ద్విపద చందస్సులో రాశాడు. ఇది ద్విపద చందస్సులో వెలువడిన తొలి తెలుగు రామాయణం. అంతకు ముందు తిక్కన అదే శతాబ్దంలో **నిర్వచనోత్తర రామాయణాన్ని**, తరువాతి శతాబ్ది (క్రీ.శ.14)లో హుళక్కి భాస్కరుడు **భాస్కర రామాయణాన్ని** రాశారు. తరువాత క్రీ.శ.16వ శతాబ్దిలో మొల్ల, **మొల్ల రామాయణాన్ని**, క్రీ.శ.17వ శతాబ్దిలో రఘునాధనాయకుడు **రఘునాధ రామాయణాన్ని**, ఇదే శతాబ్దంలో కంకటి పాపరాజు **ఉత్తర రామాయణాన్ని**, కట్టా వరదరాజు ద్విపదలో **వరదరాజ రామాయణాన్ని**, 19వ శతాబ్దిలో గోపీనాధ వెంకటకవి, **గోపీనాధ రామాయణాన్ని** రచించారని, అటు తరువాత దాదాపు 50కి పైగా రామాయణాలు వచ్చాయని తెలుగు విశ్వవిద్యాలయము 2016లో ప్రచురించిన **శ్రీ రంగనాథ రామాయణము** (పూర్వోత్తర కాండములు) గ్రంథాన్ని పరిష్కరించిన ప్రముఖ చారిత్రక, సాహితీవేత్త డా.సంగనభట్ల నరసయ్య అదే గ్రంథానికి రాసిన అభిప్రాయంలో తెలియజేశారు. అంతే కాదు, ఎన్ని రామాయణాలొచ్చినా, గోనబుద్ధారెడ్డి రామాయణానికున్న ప్రశస్తి మరే రామాయణానికీ లేదని కూడ నరసయ్యగారు తేల్చి చెప్పారు.

క్రీ.శ.13వ శతాబ్దిలో గోన బుద్ధారెడ్డి రాసిన **రంగనాథ రామాయణాన్ని**, సీపీబ్రౌన్ - 1840లో శుద్ధప్రతిని తయారు చేయించారని, 1910లో **రంగనాథరామాయణాన్ని**, నాగపూడి కుప్పుస్వామయ్య పీఠికతో, వైఖరి సుందర రామయ్య పరిష్కరణలో వావిళ్ళ రామస్వామిశాస్త్రులు ముద్రించారనీ, **రంగనాథరామాయణ ఉత్తరకాండ** చెలికాని లచ్చారావు పీఠికతో వెలువడిందనీ, **రంగనాథ రామాయణాన్ని** పింగళి లక్ష్మీకాంతంగారి పీఠిక, కట్టమంచి వారి ముందుమాటతో ఆంధ్ర విశ్వవిద్యాలయం 1942లో ప్రచురించిందనీ, ఇదే సంవత్సరం వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కరణలో తి.తి.దేవస్థానములు, రంగనాథ రామాయణాన్ని వెలువరించారనీ, వారే 2015లో తిరిగి ప్రచురించారనీ, ఆయా గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలించిన సంగనభట్ల నరసయ్యగారు తన అభిప్రాయంలో తెలియజేశారు.

ఇక, ఇప్పటివరకూ **రంగనాథరామాయణం**పై అందుబాటులోఉన్న రచనల్ని కూడా తిరగేస్తే, 1942లో ఆంధ్రవిశ్వ విద్యాలయం ప్రచురించిన పింగళి లక్ష్మీకాంతంగారి పీఠిక, వివరణాత్మకంగానే కాక, రచన, రచయితలపై నిర్దిష్ట అభిప్రాయాలను వ్యక్తపరిచింది. **రంగనాథ రామాయణాన్ని** గోన బుద్ధారెడ్డే రచించినట్లు, గ్రంధములోనే పేర్కొనగా, ఎవరో రంగనాధుడు రచించాడనుట అనుచితమని లక్ష్మీకాంతంగారు చెప్పారు. అంతేకాక, అవతారికలోని రచయిత వంశ వృక్షాన్ని పేర్కొంటూ, గోన కాటభూపతి, రుద్రభూపతి, బుద్ధభూపతి, విట్ఠలుడు, పూర్వరామాయణకర్తయైన బుద్ధభూపతి (గోన బుద్ధారెడ్డి) ల క్రమాన్ని గురించి కూడా చెప్పారు. ఇంకా, పూర్వరామాయణాన్ని రచించిన గోనబుద్ధారెడ్డి ఆదేశం ప్రకారం, తాము ఉత్తరకాండను రాశామని, బుద్ధారెడ్డి కుమారులు కాచ, విట్ఠల భూపతులు గ్రంథంలో పేర్కొన్న విషయాన్ని కూడా ఆయన తన పీఠికలో పొందుపరిచారు.

1942వ సం॥లో వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కర్తగా తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురించిన గోనబుద్ధారెడ్డి **రంగనాథ రామాయణానికి** డా.కట్టమంచి రామలింగారెడ్డి 'అనుబంధ పీఠిక: కొన్నిమీమాంసలు' అన్న నివేదనను పొందుపరచారు. అందులో, గొప్ప పండితుడైన ప్రభాకరశాస్త్రిగారు అనారోగ్యంపాలు కావటాన, పీఠికాభారము తనపైన పడినదనీ, దానికి అనుబంధంగా ఈ చిన్ని వ్యాసాన్ని రాశాననీ, తనకు గోనబుద్ధారెడ్డి గురించి మల్లంపల్లి సోమ శేఖరశర్మ తెలియజేశాడని చెప్పుకున్నాడు. ఈ అనుబంధంలో గ్రంథ కర్తృత్వ వివాదము, అవాల్మీక వృత్తాంతములు, ఈ రామాయణానికి పండితులలో ప్రశస్తి తక్కువ, ఆర్యదృష్టి - ద్రావిడదృష్టి, వాల్మీకము నందలి కొన్ని మీమాంసలు అన్న వివాదాలపై పండితుల అభిప్రాయాలు కోరుతూనే, తన మనసులోని మాటలనుకూడా ప్రస్తావించారు.

ఇదే గ్రంథాన్ని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి : **రంగనాథ రామాయణము**, గ్రంథకర్త -గోన బుద్ధారెడ్డి, పరిష్కర్త : శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, ప్రచురణ: శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠము, తి.తి.దేవస్థానములు, తిరుపతి వారు 2015లో పునర్ముద్రించగా, అందులో కట్టమంచి రామలింగారెడ్డిగారి అనుబంధ పీఠిక కూడా (XLI-XLVIII) పొందుపరచబడింది.

నేను, రంగనాథ రామాయణంపై ఇప్పటివరకూ వెలువడిన గ్రంథాలను, పరిష్కర్తల పీఠికలను సేకరించే పనిలో ఉండగా, 4.4.2018న ప్రముఖ పరిశోధకులు డా.తవ్వా ఓబులరెడ్డిగారు, 1949లో రాయలు అండు కో, పబ్లిషర్స్ & బుక్‌సెల్లర్స్, కడపనుంచి ప్రచురించిన రంగనాథ రామాయణము (ద్విపద కావ్యము)ను నాకు వాట్సాప్ ద్వారా పంపారు. ఇది మద్రాస్‌లోని 329, మింట్‌స్ట్రీట్‌లో నున్న టీవీసీ ప్రెస్‌లో విరోధి వత్సరాదిన ముద్రించబడిందనీ, ఈ గ్రంథానికి కావ్య పురాణతీర్థ, విద్వాన్ జనమంచి సుబ్రహ్మణ్యశర్మ, 'సమాలోచన' పేరిట ఒక పీఠికను, విషయసూచికను, అందిన సమాచారాన్ని తెలుసుకో గలిగాను. పాఠకులకోసం, లోశీర్షిక, జనమంచి

వారి సమాలోచన, విషయసూచిక, బాలకాండలోని రెండు పేజీలను తరువాతి పేజీల్లో యధాతథంగా పొందుపరచటమైంది.

కోన వెంకట్రాయశర్మ 1953లో రాసిన **'దుర్గాధిపతులు'** గ్రంథంలో వర్ధమానపుర దుర్గము - గోన బుద్ధారెడ్డి, (13వ శతాబ్దము), (బాపట్ల)లో గోన బుద్ధారెడ్డి, ఆయన రచించిన **రంగనాథ రామాయణం** పై వివరణ ఉంది.

తెలుగు భాషాసమితి, మద్రాస్ తరఫున 1959లో ప్రచురించిన **విజ్ఞానసర్వస్వము**-మూడో సంపుటమైన 'తెలుగు సంస్కృతి' లో, భూపతి లక్ష్మీనారాయణ రాసిన **తెలుగు వాఙ్మయము** అన్న అధ్యాయంలో **రంగనాథరామాయణాన్ని** గురించి ప్రస్తావిస్తూ, దీనిని రంగనాథుడు రచించాడని కొందరు వివాదాన్ని సృష్టించారనీ, దీనికి కారణము రంగనాథుడు బ్రాహ్మణేతరుడగుటయేననీ, కృతి చివరన గోన బుద్ధభూపతి పేరున్న విషయాన్ని గమనించాలని, బుద్ధారెడ్డి కోరికపై అతని ఇద్దరు కుమారులు, **రామాయణ** రచన (ఉత్తరకాండ) కు పూనుకున్నారని తెలిపారు.

1962లో గులాంయాంజ్దాని సంపాదకత్వంలో వెలువడిన **ఎర్లీ హిస్టరీ ఆఫ్ ది డెక్కన్** గ్రంథం తొమ్మిదో భాగంలోని 'కాకతీయాస్ ఆఫ్ వరంగల్'లో డా.నేలటూరి వెంకట రమణయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, 'లిటరేచర్ - తెలుగు' విభాగంలో కాకతీయుల కాలంలో వెలువడిన రామాయణ గ్రంథాల్లో ద్విపదలోనున్న **రంగనాథ రామాయణం** గొప్పదని కొనియాడారు.

కంభంపాటి సత్యనారాయణ గారి A Study of the History and Culture of the Andhras, part-II ని మహీధర రామ మోహనరావు **ఆంధ్రుల సంస్కృతి చరిత్ర** - 2 పేరిట చేసిన సంక్షిప్తానువాదం (హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 1982, పే.50) లో గోన బుద్ధారెడ్డి, ఆయన కొడుకులు రాసిన **రంగనాథ రామాయణం,** దేశీశైలిలో, ద్విపద ఛందస్సులో పాడటానికి అనువుగా రాయబడిందనీ, ఆ కాలానికే ప్రచారంలో ఉన్న అనేక స్త్రీల రామాయణ పాటల్ని ఇందులో బుద్ధారెడ్డి చేర్చుకొన్నాడనీ చెప్పారు. అనువాదంలో బుద్ధారెడ్డి మూలాన్ని అతిక్రమించి, రామాయణంలోని రాక్షస స్త్రీలు తెలివైన, లోకజ్ఞానంగల లక్షణవతులని పేర్కొన్నట్లు, వి. యశోదాదేవి **ఆంధ్రదేశ చరిత్ర- చిల్లర రాజవంశాలు** అన్న వ్యాసాన్ని ఉటంకించారు కంభంపాటి సత్యనారాయణగారు.

డా. సి. వి.రామచంద్రరావు రాసిన **తెలుగు చరిత్ర - సంస్కృతి** (ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు, తెలుగు అకాడెమీ, హైదరాబాదు, 1986, పే: 107)లో "వైష్ణవాన్ని ప్రచారం చేయదల్చిన గోన బుద్ధారెడ్డి మొదలైనవారు సోమనాథుని మార్గంలోనే నడచి కృతకృత్యులయినారు. బుద్ధారెడ్డి కాకతీయుల సామంతుడు. ఇతడు రామాయణాన్ని కొద్ది మార్పులతో ద్విపదలో రచించాడు. దీని కర్త బుద్ధారెడ్డియని, రంగనాథుడనీ ప్రచారం ఉండేది. ఈ రంగనాథుడెవరో గుర్తించ బడలేదు. తండ్రి కోరికపై బుద్ధారెడ్డి కుమారులు కాచవిభుడు, విఠలరాజు ఈ రామాయణ రచన పూర్తిగావించారు." అని సంక్షిప్త ప్రస్తావన చేశారు.

ఆరుద్ర **సమగ్ర ఆంధ్ర సాహిత్యం : కాకతీయ యుగం** అన్న రెండవ సంపుటం (ప్రజాశక్తి బుక్ హౌస్, కార్ల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 1989)లోని 16వ అధ్యాయంలో చక్రపాణి రంగనాథుడు అన్న శీర్షికలో పాడుకోవటానికి వీలుగా, ద్విపద చందస్సులో తొలిసారిగ తెలుగులో రామాయణాన్ని ఒక కవి రాసాడని, దాన్ని **రంగనాథ రామాయణ** మంటారనీ, రంగనాథుడనే కవి రాయబట్టి దానికాపేరు వచ్చిందని లోకం చెప్పుకొంటుందనీ, చక్రపాణి రంగనాథుడు మాత్రం దానిని వ్రాసి ఉండటానికి వీల్లేదని, **రంగనాథ రామాయణం** లో స్పష్టంగా దానిని గోన బుద్ధ భూపతి తన తండ్రిపేర వ్రాసినట్టు కనబడుతుందని తేల్చి చెప్పాడు (పే. 211-212).

డా. ముదిగంటి సుజాతారెడ్డి రాసిన **ఆంధ్రుల సంస్కృతి-సాహిత్య చరిత్ర** (తెలుగు అకాడెమీ, హైదరాబాదు, 1989, పే.22)లో **రంగనాథరామాయణం** గురించి రాస్తూ "శివకవుల దేశికవితా ఉద్యమ ఫలితంగా ద్విపద ఛందస్సుకు బాగా ప్రచారం లభించింది. పాడుకోవడానికి వీలుగా ఉండి ద్విపదలు ప్రజల నోళ్లలో పాటల రూపంలో సులభంగా వ్యాపించడానికి అవకాశముంది. దీనిచేత ప్రేరణను పొంది కోన బుద్ధభూపతి **రంగనాథ రామాయణాన్ని** ద్విపదలో వ్రాసాడు. అతని ఆశయం సిద్ధించి నిజంగానే **రంగనాథ రామాయణ** ద్విపదలు మొన్న మొన్నటి వరకు పాటల రూపంలో ప్రజల్లో ప్రచారంలో ఉన్నవి. తోలుబొమ్మలాటలాడేవాళ్ళు ఈ రామాయణం నుంచే చదివేవారు.

**రంగనాథ రామాయణాన్ని** ఆ కావ్యం పీఠికలో చెప్పబడినట్లుగా కోన బుద్ధభూపతి వ్రాయలేదని రంగనాథుడనేకవి వ్రాసాడని అందుకే ఆ రామాయణానికి రంగనాథ **రామాయణమ**న్నపేరు కలిగిందని కొందరు విమర్శకుల తలంచారు. కాని, శైవుడైన చక్రపాణి రంగన తప్ప తెలుగు సాహిత్యంలో మరో రంగనాథుడనే కవి ప్రసిద్ధమైన వారెవరూ లేరు. పీఠికలో కోన బుద్ధభూపతి వ్రాసాడని ఉండగా లేని రంగనాథునికి ఈ కావ్య కర్తృత్వాన్ని అంటగట్టడం చాలామంది విమర్శకులు అంగీకరించలేదు. బుద్ధభూపతి వైష్ణవుడై భక్తితో శ్రీరంగంలో వెలసిన దేవుడు రంగనాథుని పేర తన రామాయణానికి రంగనాథరామాయణమని పేరు పెట్టి వుంటాడు. వైష్ణవులకు రంగనాథుడు ఇష్టదైవం.

కోనబుద్ధభూపతి కాకతీయ సామంతరాజు. రాయచూరు దుర్గాన్నేలిన కోనబుద్ధారెడ్డి అని విమర్శకుల అభిప్రాయం. అతని కూతురు కుప్పాంబిక వేయించిన శాసనాధారంగా అతని కాలాన్ని క్రీ. శ.1210-1240 ప్రాంతమని చెప్పవచ్చును.

**రంగనాథ రామాయణం** వాల్మీకి రామాయణాన్ని అనుసరించి వ్రాయబడినా ఇది యథాతథానువాదం కాదు. వాల్మీకి రామాయణంలో లేని కథలను, ఘట్టాలను, ప్రాంతీయంగా పామర ప్రజల్లో వ్యాప్తిలో ఉన్న కథలను బుద్ధభూపతి తన **రామాయణం**లో చేర్చాడు. అహల్యావృత్తాంతంలో ఇంద్రుడు కోడియై కూసాడని చెప్పడం, అహల్య

**సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు**

రాయిగా మారి రాముని పాదస్పర్శతో స్త్రీగా మారిందనడం, జంబుమాలి వృత్తాంతం, లక్ష్మణుడు పర్ణశాల చుట్టూరేఖగీసి వెళ్లడం, రావణుని ముందు హనుమంతుడు తోకను పెంచడం, సులోచన కథ మొదలైన విషయాలను బుద్ధకవి వాల్మీకిలోలేని వాటిని నూత నంగా చేర్చి రామాయణరచనలో దేశీయతను పాటించడం కూడా శివకవుల ప్రభావమే. బుద్ధభూపతి సందర్భానుకూలంగా వర్ణనలను చేర్చాడు. సరళమైన సమాసరహితమైన శైలిని వాడాడు. కథను సుబోధ కంగా చెప్పాడు. పాత్ర చిత్రణ, సంభాషణలను మనోహరంగా రచించాడు.

బుద్ధభూపతి **పూర్వ రామాయణం** వ్రాయగా అతని తర్వాత అతని కుమారులైన కాచవిభుడు, విట్ఠల నాథుడు అనే కవులు **ఉత్తర రామాయణాన్ని** వ్రాసి **రంగనాథ రామాయణాన్ని** పూర్తి చేశారు. ఉత్తరకాండను ఈ కవులు తండ్రికే అంకితమిచ్చారు. వీరి శైలి బుద్ధభూపతి అంత రమణీయంగా లేకున్నా ప్రశస్తంగా ఉన్నది.

తెలుగులో **రంగనాథ రామాయణం** మొదటి రామాయణం. దీని తర్వాత భాస్కరుడు, ఎర్రన, సత్యానారన కవులు **రామాయణాలను** వ్రాసారు. తిక్కన, కంకంటి పాపరాజులు **ఉత్తర రామాయణాలను** వ్రాసారు. ఇందులో ఎర్రన, సత్యానారన రామాయణాలు లభించలేదు. భాస్కరుని **రామాయణం** చంపూ పద్ధతిలో ఉండి వాల్మీకి **రామాయణాన్ని** చాలా మట్టుకు అనుసరిస్తూ సాహితీ ప్రియులను అలరినున్నది. కాని **రంగనాథ రామాయణం** మాత్రం పండిత పామరులను కూడా సమానంగా అలరించే అద్వితీయ కావ్యం."అని పేర్కొన్నారు.

మలయశ్రీ రాసిన **కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం** (హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1990) లోని మూడవభాగంలోని 5వ అంశమైన 'సాహిత్యం' అన్న విభాగంలో గోన బుద్ధారెడ్డి **రంగనాథ రామాయణాన్ని**, విఠల కాచిరెడ్డి సోదరులు **ఉత్తర రామాయణాన్ని** ద్విపదలో రాసినట్లు పేర్కొన్నారు.

తెలుగు భాషాసమితి వారి **విజ్ఞాన సర్వస్వం**, రెండో సంపుటాన్ని 1961లో **తెలుగు సంస్కృతి** పేరిట వెలువరించారు. దీనినే విస్తృతపరచి, తెలుగు విశ్వవిద్యాలయం, 1988లో ప్రచురించింది. అందులో చింతా వెంకటేశ్వర్లు, 'బుద్ధారెడ్డి, గోన-14వ శతాబ్దము' అన్న శీర్షికలో, కృతికర్తపైగల వివాదాన్ని చర్చించి, వివాదాలను పటాపంచలు చేస్తూ **రంగనాథరామాయణాన్ని** ద్విపదలో గోన బుద్ధారెడ్డి రచించాడని పేర్కొన్నారు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి 1991లో రాసిన **తెలుగు సాహిత్య చరిత్ర-ప్రథమ భాగము** అన్న గ్రంథంలో అనేక విషయాలను చర్చిస్తూ, రంగనాథ రామాయణాన్ని రచించింది గోనబుద్ధారెడ్డి అయినా, కర్తృత్వ విషయం ఎలా వివాదగ్రస్తమయిందో వివరించారు. అందుకోసం ఆయన 1. గ్రంథనామము, 2. లాక్షణిక నిర్దేశము,3. రంగనాథ స్తుతి, 4. భాస్కర, రంగనాథులకు సంబంధించిన చరిత్ర, 5. టేకుమళ్ళ రంగనాథశాయి కథనము, 6. శైలీసామ్యమనే సాధనాలద్వారా విస్తృత చర్చ గావించి, రంగనాథ రామాయణాన్ని గోనబుద్ధారెడ్డి రచనే అని తేల్చిచెప్పారు.

ప్రముఖ శాసన పరిశోధకులు, చరిత్రకారులు బి.ఎన్.శాస్త్రి గారు రాసిన **రెడ్డిరాజ్య సర్వస్వము** (విజ్ఞాన సరోవర ప్రచురణలు, హైదరాబాదు, 1998, పే.134-136) లో గోనవంశం, గోన బుద్ధారెడ్డి, **రంగనాథరామాయణం**పై చర్చించారు.

**మధ్యయుగ దెక్కన్‌లో సామంతరాజులు** అన్న అంశంపై పరిశోధించిన రాచర్ల గణపతి, కాకతీయ సామంతుడైన గోన వంశీయుడైన గోనబుద్ధారెడ్డి గురించి, అతడు రాసిన **రంగనాథ రామాయణాన్ని** గురించి **సబార్డినేట్ రూలర్స్ ఇన్ మెడైవల్ దెక్కన్** అన్న గ్రంథం (2000) లో వివరిస్తూ, వంశవృక్షంపైనే అధికంగా చర్చించారు.

తెలంగాణ సాహితీ చరిత్రకారుడు, డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి **ముంగిలి : తెలంగాణ ప్రాచీన సాహిత్యం** (2008) పుస్తకంలో **రంగనాథరామాయణాన్ని** రంగనాథుడు రాశాడన్న కందుకూరి అభిప్రాయాన్ని కాదని, గోన బుద్ధారెడ్డే రచించాడని, **రంగనాథ రామాయణము**లోని ప్రస్తావనలతో నిరూపించి, 'ద్విపద కవిత్వమునకు పాల్కురికి ప్రధానాచార్యుడైతే, గోన బుద్ధారెడ్డి ద్వితీయాచార్యుడనీ, ఈ సోమన, బుద్ధన లిర్వురునూ ద్విపద కావ్యసృష్టి, స్థితులకు కారకుల'ని పేర్కొన్నాడు.

నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా, తెలుగు అకాడెమీ 2012లో ప్రచురించిన **తెలుగులో రామాయణం** మోనోగ్రాఫ్‌లో డా.గంద్రలక్ష్మణరావు **రంగనాథ రామాయణం** గురించి వివరణాత్మకంగా రాశారు.

**కాకతీయ వైభవం** అన్న పుస్తకం (తెలుగు అకాడెమీ, 2012) లో, డా.హరి శివకుమార్, **రంగనాథ రామాయణాన్ని** కాకతీయులకు సామంతునిగానున్న గోన బుద్ధారెడ్డి రచించాడనీ, అతని కుమారులు కాచభూపతి, విఠలభూపతులు **ఉత్తరకాండను** వెలయించారని పేర్కొన్నారు. ఇదే విషయాలను దాదాపు అదేవిధంగా, ఎన్.ఎస్.రాజు, **ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర - సంస్కృతి - మధ్యయుగ ఆంధ్రదేశం (క్రీ.శ.1000 - 1324)** (2012)లోని 'భాష - సాహిత్యం' అన్న తొమ్మిదో అధ్యాయంలో చెప్పారు.

ఆవుల చెన్నమ్మపుత్ర శ్రీరామ్‌ఆర్య రాసిన **'వర్ధమానపురం** (నందివడ్డమాను) **గ్రామ చరిత్ర-సంస్కృతి',** (మహబూబ్‌నగర్, 2014)లో **వర్ధమానపురములో చారిత్రకవ్యక్తులు** శీర్షికన గోన బుద్ధారెడ్డి గురించిన సంక్షిప్త సమాచారం ఉంది.

**తెలుగు సాహిత్యచరిత్ర** (2014)ను రాసిన వెలమల సిమ్మన్న, 'తిక్కనయుగం - ఇతర కవులు - కృతులు - సమీక్ష' శీర్షికలో గోనబుద్ధారెడ్డి **రంగనాథరామాయణాన్ని** రాశాడనటంలో ఎలాంటి సంశయమూ లేదని పేర్కొంటూ శిష్టా రామకృష్ణ శాస్త్రి వాదనను కాదన్నారు.

వేటూరి ఆనందమూర్తి రచన **ఆంధ్రసాహిత్యంపై విష్ణుమత ప్రభావము, తాళ్ళపాక కవులు-1, వైష్ణవాంధ్ర వాఙ్మయము** (2015) గ్రంథంలో గోన బుద్ధభూపతి రాసిన **రంగనాథరామాయణం** ఒక ఉత్కృష్ట ద్విపదకావ్యమని పేర్కొన్నారు.

ఇటీవల వెలువడిన కొన్ని 'చరిత్ర - సంస్కృతి' గ్రంథాల్లో కాకతీయ సామంతుడైన గోనవంశీయులను గురించి గానీ, గోన

బుద్ధారెడ్డి రాసిన **రంగనాథరామాయణం** గురించి గానీ, ఏ మాత్ర ప్రస్తావన లేకపోవటం గమనించదగ్గవిషయం.

'కాకతీయులు' అనగానే గుర్తుకొచ్చే పరిశోధకుల్లో పి.వి.పర బ్రహ్మశాస్త్రిగారొకరు. ఆయన పరిశోధక గ్రంథం 'కాకతీయులు' (ఎమెస్కో, 2016)లోని 14వ అధ్యాయం 'తెలుగు సాహిత్యం' లో గో (కో) న బుద్ధవిభుడు **రంగనాథరామాయణాన్ని** రచించినట్లునూ, తెలుగు ద్విపదకావ్యాల్లో **రంగనాథరామాయణాన్ని** ఉత్తమోత్తమంగా భావిస్తారని పేర్కొన్నారు గానీ, **రంగనాథరామాయణ** విశేషాలను గానీ, గోన బుద్ధారెడ్డిని గురించిన వివరాలను కానీ చర్చించకపోవటం యువ పరిశోధకులకు నిరాశ కలిగించింది.

వకుళాభరణం రామకృష్ణ ప్రధాన సంపాదకులుగా 2016లో వెలువడిన **తెలంగాణ చరిత్ర** పుస్తకంలో **కాకతీయులు** అన్న అధ్యాయాన్ని పి.వి.పరబ్రహ్మశాస్త్రిగారే రచించినా, అందులో గోన బుద్ధారెడ్డి గురించిగానీ, అతని రచన **రంగనాథ రామాయణాన్ని** గురించి గానీ ఒక్క మాట కూడా లేదు.

డా.సంగనభట్ల నరసయ్య పరిష్కరణలో 2016లో తెలుగు విశ్వవిద్యాలయం వెలువరించిన **శ్రీరంగనాథరామాయణం** ఇప్పటి వరకూ వెలువడిన **రంగనాథరామాయణ** పీఠికల్లో తలమానికంగా పేర్కొనాలి. నరసయ్యగారు చరిత్ర, సాహిత్యాలపై పట్టున్నవారు గాబట్టి కర్తృత్వ విషయంలోగానీ, రచయిత విషయంలోగానీ, మును పెన్నడూ లేనంత సుస్పష్ట వివరాలనందించారు. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధకాండలతోపాటు, చంద్రోదయ వర్ణనము, ఉత్తరకాండలోని వర్ణనలతోపాటు గోనవంశం, బుద్ధారెడ్డి, కాచ, విఠలుల వివరాలను, శాసన సాక్ష్యాధారాలతో పొందుపరచి, తన ప్రతిభను వెల్లడించారు నరసయ్యగారు.

ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, కవి, బి.హనుమారెడ్డి ప్రచురించిన **రెడ్డివైభవం** (2017)లోని 'యోధులు' శీర్షికన, గోన బుద్ధారెడ్డి గురించి రాస్తూ, 'కాకతీయ రుద్రదేవుడు (ప్రతాపరుద్రుడు) తెలుగులో **రామాయణాన్ని** ఎవరిచేత రచింప జేయుదువని గోన విఠలనాధుని అడుగగా, అతడు, ఎవరో ఎందుకు, కవి కల్పతరువు, కవిలోకభోజుడు బుద్ధభూపతిని ఆజ్ఞాపించుమని కోరగా, విఠలుడు, తన కుమారుడైన బుద్ధభూపతిని పిలిచి, 'రామాయణంబు పురాణమార్గంబు, తప్పక నాపేర తగు నాంధ్రభాష చెప్పి ప్రఖ్యాతము సేయింపు'మని కోరగా, అతడు తండ్రిపేర **రంగనాథ రామాయణాన్ని** రచించాడనీ, ఉత్తరకాండ అతని కుమారులు రచించారనీ' పేర్కొన్నారు.

దోరవేటి చెన్నయ్య రాసిన **మన కవులు-మహా కవులు** అన్న పుస్తకం (2017)లో గోన బుద్ధారెడ్డి **రంగనాథరామాయణాన్ని** గురించి రాస్తూ, రంగనాథ రామాయణకర్త గోన బుద్ధారెడ్డి అనీ, నొకనాడు గోన విఠలరెడ్డి సభనుద్దేశించి, 'వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రాయగలవారెవ్వరైనా ఉన్నారా?' అని ప్రశ్నించాడని, సభలో ఉన్న గండయమంత్రి లేచి, 'మీ కుమారుడైన గోన బుద్ధారెడ్డికి మించినవారెవ్వరున్నారు ప్రభూ' అని చెప్పగా, తండ్రి కోరికపై బుద్ధారెడ్డి **రామాయణాన్ని** ద్విపదలో తెనుగించిన విధాన్ని వివరించాడు.

క్రీ.శ.13-14 శతాబ్దాల్లో గోన బుద్ధారెడ్డి, గోన విఠలరెడ్డి, గోన కాచారెడ్డి ద్విపదలో రచించిన రంగనాథ రామాయణం, 1840 నుంచి 2017 వరకూ అనేకమంది సాహితీ పరిశోధకుల దృష్టిని ఆకర్షించి, అనేక ముద్రణలకు నోచుకొంది.

---

**( ...35 వ పుట తరువాయి )**

వించారు. మంత్రిగా వుండి కూడా నిరాడంబరంగా జనసామాన్యంతో కలిసి ఆర్.టి.సి. బస్సులలో ప్రయాణించడం ఆయనకే చెల్లింది. పూలదండలు స్వీకరించని మంత్రిగా ఆనాటి రాష్ట్రపతి వరకు ఆయన గుర్తింపును పొందారు.

భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలోను, విదేశాలలోను నివసి స్తున్న తెలుగు వారి భాషాసాంస్కృతిక అవసరాలను తీర్చడం కోసం అంతర్జాతీయ తెలుగు సంస్థను నెలకొల్పారు. ఇది ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో "మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం" గా కొనసాగుతున్నది.

1984 ఆగష్టులో జరిగిన కారు ప్రమాదం కృష్ణారావు గారి జీవితానికి అశనిపాతంలాంటింది. అది వారి ఆరోగ్యాన్ని హరించి, సత్తువను కృంగతీసింది. ఆ మార్పు ఎవరూ గ్రహించలేనంత నెమ్మ దిగా జరుగుతూ క్రమక్రమంగా వారి ఆరోగ్యాన్ని హరించి వేసింది. తన అనారోగ్యాన్ని బయటకు తెలియనీయకుండా తుదిశ్వాస వరకు తెలుగు భాషా సంస్కృతుల కోసం అహరహం తపించారాయన.

అవసానదశలో హైదరాబాదులోని మెడ్విన్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కూడా ప్రపంచ తెలుగు మహాసభల గురించే ఆలోచించారు. "విశాఖపట్నం పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతున్న నగరం. ఈసారి తెలుగు మహాసభలు అక్కడ నిర్వహిస్తే చాలా బాగుంటుంది. సభలు వారం రోజులు జరపాలి. విజయవాడ నుంచి విశాఖ వరకు తోరణ ద్వారాలు కట్టాలి. విజయవాడలో ఆరంభించి, సంవత్సరం పొడవునా ఒక్కొక్క రోజు ఒక్కొక్క పట్టణం చొప్పున, ఆరు పట్టణాలలో సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతూ, చివరి రోజున విశాఖలో సభ జరిపి ముగించాలి. ఇందు మూలంగా తెలుగు ప్రజలలో సన్నగిల్లుతున్న సమైక్యతా భావం తిరిగి ఉత్తేజాన్ని పొందు తుంది" అంటూ మహాసభలకు సంబంధించిన ప్రణాళికను మంచం లోవుండి కూడా, శక్తిని కూడదీసుకుని ఏకరువు పెట్టారు. కృష్ణారావు గారి ఈ ఆశయం నెరవేరకుండానే ఆయన 1997 సెప్టెంబర్ 27 రాత్రి 09:30 గంటలకు ఈ లోకాన్ని విడిచారు.

**పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే**

పిట్టచూపు

చలసాని నరేంద్ర
9849569050

# కాశ్మీర్ లోయలో ప్రజావిశ్వాసం పొందటమే నిజమైన సవాల్




ఏడు దశాబ్దాలుగా బిజెపి సైద్ధాంతిక అనుబంధం గల సంస్థలు, వ్యక్తులు అందరు కోరుకొంటున్న విధంగా నాటకీయ రీతిలో ఆర్టికల్ 370 జమ్మూ కాశ్మీర్ లో అమలు కాకుండా చాలా సులభంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం చేయ గలిగినది. ఇదొక్క చారిత్రాత్మక మలుపు అని చెప్పవచ్చు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతాన్ని మొత్తం భారత దేశంలో సంపూర్ణ విలీనం కావించడంలో ఒక పెద్ద ముందడుగు వేశారని కూడా చెప్పవచ్చు.

ఇటువంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని, అమలు పరచిన ఘనత మొత్తం హోమ్ మంత్రి అమిత్ షాకు, ప్రధాన మంత్రి మోదీకి దక్కుతుంది. పైగా, దాదాపు ఈ విషయంలో జాతీయ ఏకాభి ప్రాయం వ్యక్తం కావడం, వామపక్షాలు మినహా మిగిలిన రాజకీయ పక్షాలు సహితం ప్రత్యక్షంగానో, పరోక్షంగానే అండగా నిలబడటం అభినందనీయం.

తొలి నుండి కాశ్మీర్ విలీనం సందర్భంగా స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో జరిగిన సంఘటనలు వివాదాస్పదంగా ఉంటూ వచ్చాయి. దేశంలో మిగిలిన సంస్థానాల విలీనం విషయంలో అనుసరించిన పక్రియను ఇక్కడ నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అనుసరించలేదనే విమర్శలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులు రావడానికి ముఖ్యంగా బ్రిటిష్ వలస పాలకులే కారకులు.

ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా కీలకమైనది కావడంతో దానిని పాకిస్థాన్‌కు అప్ప చెప్పడం ద్వారా, తమ ఆధీనంలో ఉంచుకోవచ్చని ఎత్తుగడ వేశారు. ఇక్కడ సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకొని అటు రష్యాను, ప్రక్కన ఉన్న చైనాను, సమీపంలో ఉన్న జపాన్‌ను కూడా కట్టడి చేయవచ్చని వ్యూహరచన జరిపారు.

వాస్తవానికి నాటి వైస్‌రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ శ్రీనగర్ వెళ్లి, వారం రోజులపాటు మకాం వేసి, అందుకు రాజా హరిసింగ్ ను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ ప్రతిపాదనకు నెహ్రూ, పటేల్ కూడా ఒప్పుకున్నట్లు చెప్పారు. అయితే ఆయన మహారాజు విముఖత వ్యక్తం చేయడంతో వెనుతిరిగిరాక తప్పలేదు.

నెహ్రూ మొదటి నుండి కాశ్మీర్ పాలనా బాధ్యతలను షేక్ అబ్దుల్లాకు అప్పచెప్పాలని పట్టుదల చూపడమే కాశ్మీర్ సమస్యాత్మకంగా మారడానికి కారణమైనదని చెప్పవలసిందే. అందుకు రాజా హరిసింగ్ విముఖంగా ఉన్నారు. ఆ సమయంలో అబ్దుల్లా జైలులో ఉన్నారు. అందుకనే భారత్‌లో విలీనంపై రాజా హరిసింగ్ మీన మేషాలు లెక్కపెట్ట వలసి వచ్చింది. చివరకు పాకిస్థాన్ కాశ్మీర్‌ను కంబళించే కుట్ర చేయడంతో విధిలేక భారత్‌లో విలీనం కావించ వలసి వచ్చింది.

అప్పట్లో భారత్‌లో విలీనపత్రంపై సంతకం చేసిన ప్రతి సంస్థానం కూడా తమ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధి సభలో భారత రాజ్యాంగాన్ని ఆమోదిస్తున్నట్లు తీర్మానం చేయవలసి ఉంది. కానీ ఆ సమయంలో కాశ్మీర్ లో ఎన్నికైన అసెంబ్లీ లేకపోవడంతో, ఆ విధంగా అసెంబ్లీ ఏర్పాటై భారత రాజ్యాంగాన్ని లాంఛనంగా ఆమోదించేవరకు భారత రాజ్యాంగం వర్తించే విధంగా కేవలం తాత్కాలిక ప్రాతిపదికన ఆర్టికల్ 370ని రూపొందించారు.

హైదరాబాద్ సంస్థానంలో ప్రజలంతా భారత్‌లో విలీనం కావాలని కోరుకొంటూ ఉంటే ఇక్కడి పాలకుడు నిజాం ఒప్పుకోవడం లేదని నెహ్రూ తటపటాయిస్తు వచ్చారు. కానీ కాశ్మీర్ విషయంలో అక్కడి పాలకుడు విలీనంకు సుముఖంగా ఉన్నప్పటికీ అక్కడి ప్రజలు, అంటే ఆయన దృష్టిలో షేక్ అబ్దుల్లా సుముఖంగా లేరంటూ పేచీలు పెడుతూ వచ్చారు. ఒక విధంగా ద్వంద్వ వైఖరి అనుసరించారు.

అయితే చైనా యుద్ధంలో ఓటమి తర్వాత నెహ్రూ తన పొర పాటును గ్రహించారు. సరిగ్గా 56 సంవత్సరాల క్రితం 1963 డిసెంబర్ 27న లోక్‌సభలో మాట్లాడుతూ ఆర్టికల్ 370ను చెరిపి వేయాలని, కాశ్మీర్ విలీనం సంపూర్ణం కావాలని స్పష్టం చేశారు. అయితే ఆ తర్వాత ఆయన ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం, కొద్దీ నెల లకే మృతి చెందడంతో ఆయన ఆ పక్రియను పూర్తి చేయలేక పోయారు. నాటి నెహ్రూ ఇచ్చిన హామీని నేడు మోదీ ప్రభుత్వం నెరవేర్చిన్నట్లు అయింది.

నెహ్రూ మంత్రివర్గంలో హోమ్ మంత్రిగా ఉన్న గుల్జలాల్ నందా అయితే ఆర్టికల్ 370 అంటే లోపల ఖాళీగా ఉన్నటువంటి ఒక గుల్ల వంటిదని, దానిలో ఏమీ లేదని, ఎప్పుడు కావాలి అనుకొంటే అప్పుడు - ఒక రోజులో, 10 రోజులలో, 10 నెలల్లో అంతం చేయవచ్చని లోక్ సభలో చెప్పారు. అయితే నెహ్రూ తర్వాత కాంగ్రెస్

నేతలు ఎవ్వరు అటువంటి ప్రయత్నం చేయలేదు. పైగా ఆర్టికల్ 370 అనేది లౌకిక వాదానికి చిహ్నం అంటున్నట్లు, భారత్‌లో కాశ్మీర్ అనుబంధానికి వారధి అన్నట్లు వ్యవహరిస్తూ వచ్చారు.

జనసంఘ్ రోజుల నుండి బీజేపీ నేతలు ఈ విషయంలో స్పష్టమైన విధానం అనుసరిస్తున్నారు. తమ ఎన్నికల ప్రణాళికలలో పేర్కొంటున్నారు. అందుకనే అదను చూసి, వ్యూహాత్మకంగా జమ్మూ కాశ్మీర్ కున్న ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించి వేశారు. ఈ ప్రత్యేక ప్రతిపత్తి కేవలం కాశ్మీర్ లోయలోని రెండు కుటుంబాలకు రాజకీయాలను అడ్డం పెట్టుకొని అధికారం చెలాయించడాన్ని మాత్రమే వీలయినట్లు నేడు పలు వర్గాల నుండి విమర్శలు చెలరేగుతున్నాయి.

బిజెపి నీడ కూడా గిట్టని మాయావతి, కేజ్రీవాల్ వంటి వారు కూడా మద్దతు తెలిపారు. చివరకు తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ లలో సహితం ఈ విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. పలువురు ప్రముఖ కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ చర్యను వ్యతిరేకించిన పక్షాలు, నాయకులు సహితం జమ్మూ కాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్న సమయంలో, అసెంబ్లీ లేని సమయంలో ఇటువంటి కీలక చట్టాలు తీసుకు రావడాన్ని మాత్రమే వ్యతిరేకించారు.

అంతేగాని ప్రభుత్వ చర్యలను మాత్రం వ్యతిరేకించక పోవడం గమనార్హం. ఆర్టికల్ 370 స్థాయి గురించి స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేయలేక పోయారు. ఉగ్రవాదం పడగలేయడం ప్రారంభమైనప్పటి నుండి కాశ్మీరీ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, లేనప్పుడు మరో విధంగా మాట్లాడుతూ వస్తున్నారు. అధికారం లేనప్పుడు ఉగ్రవాదుల భాష ప్రయోగిస్తున్నారు. వేర్పాటువాదులు సహితం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్నవారు సహితం స్పష్టమైన విధానం అనుసరించక పోవడం జరుగుతూ వచ్చింది.

అయితే ఈ సందర్భంగా జరిగిన చర్చలో డీఎంకే సభ్యుడు టి ఆర్ బాలు లోక్‌సభలో వేసిన ప్రశ్న ప్రాముఖ్యత సంతరించుకొంది. ఈ చర్యల ద్వారా ఏమి సాధించాలి అనుకొంటున్నారు? అంటూ ప్రశ్నించారు. కాశ్మీర్ లోయలోని ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, వారిలో నమ్మకం కలిగించే చర్యలు చేపట్టకుండా సైన్యాన్ని భారీగా మోహరింపచేసి తీసుకొనే చర్యలు ఎటువంటి ఫలితాలు ఇస్తాయి అనే అనుమానాలు కలుగక మానవు.

కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దయిన మూడు వారాల తర్వాత కూడా అక్కడ పరిస్థితులు అగమ్యగోచరంగా ఉండటం, అక్కడ అసలు ఏమి జరుగుతుంది బైట ప్రపంచానికి తెలియకుండా ప్రభుత్వం కట్టడి చేయడం, అత్యవసర పరిస్థితికన్నా దారుణమైన పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగించే అంశమే. లక్ష మందికి పైగా సైనికులను మోహరించిన ఇంకా ఏమాత్రం సడలింపులు ఇచ్చినా నిరసనలు వ్యక్తం అవుతూ ఉండటం గమనిస్తే అసలు ప్రస్తుతం చేతిలో పరిస్థితులు అదుపులో ఉన్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం, అసమ్మతి తెలపడం సర్వసాధారణం. కానీ ఆ విధంగా మాట్లాడేవారిని పాకిస్తాన్ ఏజెంట్లుగానో, దేశ ద్రోహులుగానో చూసే ధోరణి ప్రమాదకరమని గ్రహించాలి. జమ్మూ కాశ్మీర్ లో సాధారణ రాజకీయ నేతలు ఎవ్వరిని అడుగు పెట్టనివ్వక పోవడం, స్థానికంగా మాజీ ముఖ్యమంత్రులపై సహితం ఆంక్షలు విధించడం చూస్తుంటే ఎటువైపు వెడుతున్నామో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఏది ఏమైనా కాశ్మీర్ లోయలోని ప్రజల విశ్వాసం పొందే ప్రయత్నం చేయకుండా అక్కడ సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం సాధ్యం కాదని చెప్పవలసిందే. ఇప్పటి వరకు కేవలం వాజపేయి మాత్రమే కాశ్మీర్ ప్రజల విశ్వాసం పొందిన జాతీయ నేతగా నిలిచారు. శ్రీనగర్ లో అతిపెద్ద బహిరంగసభలో ప్రసంగించిన ఏకైక ప్రధాని ఆయన. తిరిగి పిడిపితో కలసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు అటువంటి అవకాశం లభించింది. అయితే ఆ అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేక పోయింది.

అసలు కాశ్మీర్ లోయలోని ప్రజలు ఢిల్లీ ప్రభుత్వం పట్ల ఎందుకు అనుమానంగా చూస్తున్నారు? కేవలం పాకిస్థాన్ ప్రభావం అనుకొంటూ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తే ప్రమాదకర పరిణామాలకు దారితీయగలడు.

ఢిల్లీ పాలకులు తమ పట్ల వివక్షత చూపుతున్నారనే అభిప్రాయం కాశ్మీరీ ప్రజలలో తీవ్రంగా నెలకొంది. 1980వ దశకంలో పాకిస్థాన్ నుండి వచ్చిన ఉగ్రవాదులకు వ్యతిరేకంగా స్థానిక ఉగ్రవాదులు పోరాడిన సందర్భం ఉంది. ఆ సమయంలో వారికే అండగా కేంద్ర ప్రభుత్వం లేక పోవడం కారణం గానే పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం కాశ్మీర్ లోయలో విస్తరించిందని మరువలేము. ఉగ్రవాదం పట్ల కాశ్మీరీ పార్టీలు ద్వంద్వ వైఖరి అనుసరిస్తూ వస్తున్నాయి.

కాశ్మీర్ సమస్య సంక్లిష్టం కావడానికి పాకిస్థాన్ జరుపుతున్న ప్రచ్ఛన్న యుద్ధంతో పాటు భారత ప్రభుత్వం రాజకీయ పరిష్కారం కోసం ప్రయత్నం చేయక పోవడం కూడా ప్రధాన కారణం అని గ్రహించాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో సహితం రిటైర్డ్ అధికారులకు అప్పచెప్పడంతో పరిస్థితులు విషమిస్తూ వచ్చాయి. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసిన తర్వాత కేంద్రంలో సీనియర్ మంత్రులు ఎవ్వరూ ఎందుకు శ్రీనగర్ వెళ్లే ప్రయత్నం చేయడం లేదు? రిటైర్డ్ అధికారులకు అప్పచెప్పి చేతులు దులుపుకొంటున్నారా?

అయితే జమ్మూ కాశ్మీర్ చరిత్రలో మొదటిసారిగా ఒక రాజకీయ నాయకుడు సత్పాల్ మాలిక్‌ను గవర్నర్ గా నియమించడం, కేంద్ర హోమ్ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టగానే అమిత్ షా స్వయంగా కాశ్మీర్ అంశంపై దృష్టి పెట్టడంతో ఇప్పుడు చారిత్రాత్మక చర్యలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఈ అవకాశం సఫలం కావాలి అంటే రాజకీయ చొరవ అత్యవసరం అని గ్రహించాలి.

అందుకు రాజకీయ నాయకత్వం ప్రత్యక్షంగా బాధ్యత వహించాలి. గవర్నర్ మాలిక్‌తో కలసి అమిత్‌షా అందుకు పూనుకోవాలి. స్థానిక ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, వారి విశ్వాసం పొందేందుకు సహనంతో వ్యవహరించాలి. ఈ విషయంలో సాయుధ దళాల పాత్ర పరిమితంగా ఉంటాయని గ్రహించాలి. ఆ విధంగా

కాకుండా భారీగా సైనికులను మోహరింపచేసి ఏమీ సాధించలేమని గుర్తించాలి.

కాశ్మీర్ ప్రజలలో వివక్షత భావం ఎందుకు ఏర్పడింది? ఎప్పుడైనా ఆలోచించారా? దేశంలో మరెక్కడా లేని విధంగా కాశ్మీర్ యువకుల పైననే పెల్లెట్ తుపాకీ గుండ్లను ప్రయోగిస్తున్నారు. సుప్రీం కోర్ట్ హితవు చెప్పినా పట్టించుకోవడం లేదు. గత 20 ఏళ్ళల్లో రెండు లక్షల మందికి పైగా యువకులు అదృశ్యమయ్యారు. సాయుధ దళాలు ఇళ్ల వద్ద నుండి తీసుకు వెళ్ళారు. వారేమయ్యారు ? చంపారా? బ్రతికే ఉన్నారా? ఎవ్వరు సమాధానం చెబుతారు?

సాయుధదళాల ప్రత్యేక అధికారాల చట్టం ఆచరణలు ప్రభు త్వాన్ని ప్రజలకు దూరం చేస్తున్నది. ఈ చట్టంచాటున జరుగుతున్న అకృత్యాల గురించి కనీసం సమీక్ష జరిపే సాహసం కూడా ఎందుకని చేయలేక పోతున్నారు? భారత సైన్యాధిపతి, జమ్మూ కాశ్మీర్ డిజిపి, ఇతర ఉన్నతాధికారులు పలుసందర్భాలలో కాశ్మీర్‌లోయలో పరి స్థితులను చక్కబెట్టడంకోసం తాము చేయవలసింది అంతా చేశామని, ఇక చేయవలసిని రాజకీయ నాయకత్వమే అని బహిరంగంగా చెప్పారు.


మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పలుసార్లు ప్రధాని మోదీని స్వయంగా కలిసి రాజకీయ చొరవ తీసుకోవాలని అభ్యర్థిం చారు. వాజపేయి ఎక్కడివరకు ప్రయాణించారో, అక్కడి నుండి కొన సాగించమని ప్రాధేయపడ్డారు. కానీ ఎందుకు విముఖంగా ఉన్నారు? మోదీ ప్రభుత్వం మెరుపు దాడులు జరిపి, పాకిస్థాన్ అకృత్యాలను కట్టడి చేస్తున్నామని ఎంతగా చెప్పుకొంటున్న దాదాపు నిత్యం సరిహద్దులలో కాల్పుల మోత వినిపిస్తూనే ఉన్నది.

గత ఐదేళ్లల్లో 500 మందికి పైగా మన సైనికులు సరి హద్దులలో మృతి చెందారు. ఇంతమంది సైనికులు భారీ యుద్ధాలలో కూడా చనిపోలేదు. నేరుగా మన సైనిక స్థావరాలపైననే ఉగ్రవాదులు దాడులు జరుపుతున్నారు. ఇటువంటి ఆందోళనకర పరిస్థితులను కట్టడి చేయడానికి ఈ ప్రభుత్వం వద్ద అసలు ఒక వ్యూహం అంటూ ఉన్నదా అనే అనుమానం కలుగుతున్నది.

ఆర్టికల్ 370 రద్దు ముందు మంత్రివర్గంలో గాని, ఇతరత్రా కీలక సమావేశాలలో గాని ఏదైనా ఒక వ్యూహం గురించి సమా లోచనలు జరిపారా ? ఈ నిర్ణయం తీసుకొనే సమయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేవలం ఏడు నిముషాలు మాత్రమే అందుకు కేటాయించారని, ఆ సమయంలో కూడా ఎక్కువసేపు హోమ్ మంత్రి అమిత్ షాను అభినందనలతో ముంచెత్తడమే జరిగినట్లు చెబుతున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా ఆంధ్రప్రదేశ్ పేరుతో సుమారు 60 ఏళ్ళు కలసి ఉన్నా, రెండు ప్రాంతాల ప్రజలను భావాత్మకంగా కలిపి ఉంచే ప్రయత్నం చేయక పోవడంతో తిరిగి పరస్పరం అనుమానాలతో విడిపోక తప్పలేదు. నేడు కాశ్మీర్ లోయలో సహితం స్థానిక ప్రజలలో అవిశ్వాసం పెంపొదింప చేయడం ద్వారా ప్రయో జనం ఉండబోదని గ్రహించాలి. ప్రజల మనస్సులు గెలిచే ప్రయ త్నాలు జరగాలి. అందుకు సాధారణ రాజకీయ పక్రియ మాత్రమే మార్గం అని గుర్తించాలి.

## తెలంగాణ సాహిత్య అకాడమి 'పత్రిక' పునాస




జులై- సెప్టెంబరు 2019 సంచిక (సంపుటి 1 సంచిక 4) మా కార్యాలయా నికి అందింది. 100 పుటలతో – సాహిత్య వ్యాసాలు, కథలు, అనువాద కథలు, కవి తలు, సమీక్షలు, వార్తలు ఉన్నాయి. తెలం గాణ సాహిత్య అకాడమీకి ప్రతిష్ఠాత్మకంగా ఈ పత్రికలోని అంశాలు ఉన్నాయి.

సంపాదకులు డా॥ నందిని సిధారెడ్డి

సంవత్సర చందా. రు.100 లు. చిరునామా : తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాదు – 500 004. ఫోన్ : 040-29703142

కవిత

## పాత్ర

నీవు చూస్తున్న ఈ జీవిత నాటకరంగం
ఒక్కోరోజు ఒక్కోరంగుతో నీ ముఖాన్ని మేకప్ చేస్తుంది
అవధుల్లేని భావావేశం, ఆశయం, ఆకాంక్ష నీ ముఖాన్ని
అంటుకొంటాయి
అవి అంటుకొన్న శాతాన్ని బట్టీ
ఒక పాత్ర నీలో మిళితమౌతుంది...
ఆ పాత్రలో జీవిస్తున్నట్లు అందరూ
గుర్తించాలనుకుంటావు –
కానీ,
కాల ప్రవాహం ముంచుకొచ్చి
సంభాషణల 'పస' నంతా నీరుగార్చుతుంది
అనుకున్న పాత్ర సారంలేని మబ్బులా
కనుమరుగౌతుంది
కానీ,
కాసేపయినా నిలదొక్కుకోవాలనే నీ తెలుపునలుపుల ప్రయత్నాన్ని
రంగు ముఖాల ప్రేక్షకులు ఎలా ఆదరించగలరు!?!
నీ ముఖంపై నీవే తెరదించక తప్పదు
ఇందాకా వచ్చాక
ఇక నిన్ను గుర్తించే పరిచయం ఎవరికి ఉంటుంది?
ప్రతి సీటు వద్దా
దృశ్యం మార్పిడికీ, రంగు మార్పిడికీ
ఆతృతా తప్పు!
అవకాశం ఆవిరై ఆకాశం తగిలే లోగా చివరి ప్రయత్నంగా
ఒక చల్లని గాలివై దాన్ని నీతి రూపంలో తాగేద్దామనుకుంటావు.
అప్పటికీ గుండె కొత్తగా మొలకెత్తలేక
నేల పగుళ్ళలో ఇరుక్కుపోతుంది!!

కోట రవిప్రకాష్
9491338834



బాధ్యతలు స్వీకరిస్తున్న డా॥ యార్లగడ్డ

# ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘానికి అధ్యక్షుడుగా డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నియామకం

ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘానికి అధ్యక్షులుగా
డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను నియమిస్తూ
ఆగస్టు 23న ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసింది. దాని పూర్తి పాఠం ఇది!

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

సంక్షిప్తి : అధికార భాష – తెలుగు– ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం, 1966వ సంవత్సరపు 9వ చట్టంలోని 5(1) వ విభాగం –అధ్యక్షుని నియామకం – ఉత్తర్వులు జారీ.

**యువజనాభ్యుదయం, పర్యాటక మరియు సాంస్కృతిక (హెచ్ అండ్ ఓ.ఎల్) శాఖ**

జి.ఓ.ఎం.ఎస్.నెం. తేది:13.08.2019.

పరిగణన పత్రాలు : 1. జి.ఓ.ఎం.ఎస్.నెం.559, ప్రధాన పరిపాలన (అ.భా.1) శాఖ, తేది: 23.10.2012.
2. ముఖ్యమంత్రిగారి కార్యాలయం నోటు, తేది: 16.07.2019.

**ఉత్తర్వు:** పై ఒకటవ పరిగణన పత్రం ప్రకారం ఏర్పాటు చేసిన అధికార భాషా సంఘం యొక్క (అధ్యక్షుడు మరియు నలుగురు సభ్యులు) 2 సంవత్సరాల కాలపరిమితి ముగిసినది.

2. పై రెండవ పరిగణన పత్రం ప్రకారం రాష్ట్రంలో అధికార కార్య కలాపాల నిమిత్తం, అధికార భాషయైన తెలుగును పరిపాలనలో ఇతోధికంగా ఉపయోగించడానికి తగు విధంగా చర్యలు చేపట్టడానికి, పరిపాలనలో తెలుగు వాడుక ప్రగతి సమీక్షంచి, ప్రభుత్వానికి తగు సూచనలు, సిఫార్సులు చేయుటకు 1966వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం 5(1) వ విభాగాన్ననుసరించి, ప్రభుత్వం అధికార భాషా సంఘానికి అధ్యక్షుడుని నియమించాలని నిర్ణయించినది.

**అధ్యక్షులు : శ్రీయార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

3. అధికార భాషా సంఘం అధ్యక్షులు పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుండి ఈ సంఘం కొనసాగుతుంది. సంఘం యొక్క కాలపరిమితిని 2 సంవత్సరములుగా నిర్ణయించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా వ్యవహారాలు చూసే అదనపు / సంయుక్త / ఉపకార్యదర్శి హోదాలో ఉన్న అధికారి ఈ సంఘానికి కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

4. అధికార భాషా సంఘం అనుసరించవలసిన కార్య విధానమును ఈ క్రింది విధంగా నిర్వచించడమైనది.

→ రాష్ట్ర అధికార కార్యక్రమములకు తెలుగుభాషను ఉపయోగించుటలో సాధించిన ప్రగతిని సమీక్షంచుటకై అధ్యక్షులు రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయానికి గానీ / ప్రభుత్వరంగ సంస్థలలోగానీ తెలుగు వాడుకను తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు, ఆదేశాలు సంబంధిత అధికారులకు ఇవ్వవచ్చును.

→ రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యములలో తెలుగు భాషను క్రమాధికముగా ఉపయోగించుటకు తగు కార్యాచరణ రూపొందించడం.

→ రాష్ర ప్రభుత్వం నిర్వహించు అధికార కార్యములన్నిటికి లేదా అందు వేటికైనా ఆంగ్ల భాష ఉపయోగముపై నిర్బంధములు విధించుట.

→ తెలుగు భాష ఉపయోగమునకు సంబంధించి రాష్ర ప్రభుత్వము సంఘమునకు నిర్దేశించిన ఏదైన ఇతర విషయములు.

→ అధికార భాషా సంఘం రాష్ర అధికార కార్యక్రమములకు తెలుగును ఉపయోగించుటలో సాధించిన ప్రగతిని సమీక్షించి, అధికార భాషాభివృద్ధికి తమ సిఫార్సులతోబాటు రాష్ట్ర ప్రభుత్వమునకొక నివేదికను సమర్పించవలెను.


5. అధికార భాషా సంఘానికి నియుక్తులైన అధ్యక్షుల వేతన, తదితర సదుపాయాల విషయంలో ఉత్తర్వులు విడిగా జారీ చేయడం జరుగుతుంది.

6. ఈ ఉత్తర్వులు ఆర్థిక శాఖ వారియు. ఓ.నెం. ఏఫ్ఐఎన్ 01 – ఏఫ్ఎమ్యు 0పిసి (జిఎడి2) / 30 / 2019 – ఏఫ్ఎమ్యు – జిఎడి – ॥ కంప్యూటర్నెం : 955261, తేది : 13. 08. 2019. ఆమోదం ద్వారా జారీచేయడమైనది.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరుగారి ఉత్తర్వుల మేరకు వారి పేరు మీద జారీ చేయడమైనది)

కె.ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి

# పుస్తక సమీక్ష 'మధుస్మృతి' - ఒక సుదీర్ఘ వ్యాహృతి
## (మధునాపంతుల శారదావరణ స్ఫురణలు)



రచన : సన్నిధానం నరసింహశర్మ
వెల : రు. 100/-
ప్రచురణ : అజోవిభో కందాళం ఫౌండేషన్
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
విశాలాంధ్ర బుక్ హౌస్, తెలుగు బుక్‌హౌస్, హైదరాబాద్

ఆధునిక కాలానికి చెంది, పాండిత్యం, పటిష్ఠమైన వ్యక్తిత్వం, సంప్రదాయ సాహిత్య ధునియైన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారి శిష్యులైన సన్నిధానం నరసింహశర్మ, తమ గురుస్మృతిలో భాగంగా చేసిన రచన ఈ 'మధుస్మృతి' అనే పుస్తకం. సాహిత్య మరంద బిందువులు జాలువారిన గ్రంథసింధువు. ఇదొక సాహిత్య వాహిని. సుధీ వ్యాసంగ వ్యాహృతి. అజోవిభొ - కందాళం ఫౌండేషన్ వారి సహకారంతో 2019లో పాఠకుల ముందుకు వచ్చింది. మధునా పంతుల వారి సాహిత్య కృషికి రేఖా దర్పణం.

కొండ అద్దమందు కొంచెమై కన్పడునట్లుగా ఈ మధుస్మృతిలో మధునాపంతులవారు వ్రాసిన ఛందో సుందరమైన పద్య కవితా సారస్వతమైన 'ఆంధ్ర పురాణం' ప్రధానాంశంగాను 'ఆంధ్ర రచయితలు', ఖండ కావ్యాలలో మొదటిదైన 'తోరణం', 'కేళాకూళి', 'శ్రీఖండం', 'చైత్రరథం' వంటి వాటిని కొండ గుర్తులుగా పేర్కొంటూ ఆయా కావ్యాల పట్ల నాటి పాండితీ ప్రముఖులు, కవులు అయిన విశ్వనాథ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, జమదగ్ని శర్మ, వానమామలై వరదాచార్యులు మొ॥వారి స్పందనను తెలియచేస్తూ పాఠకుల మనస్సులను ఆ కవుల మధ్యన కూర్చో పెట్టేటట్లు వ్రాసిన రచన ఈ మధుస్మృతి.

మధునాపంతులవారు 'తెలుగునేల వేలయేండ్లుగా గతించిన గాథల పెంపు కొండ గుర్తుల పెనుగుంపు చరిత్ర'ను ఆంధ్రపురాణంలో పర్వాల పరంగా వ్రాసి ఆంధ్ర సాహిత్య పర్వదినం జరుపుకునేటట్లుగా వ్రాసిన విషయం ఈ రచనలో అర్థం అవుతోంది. ఆంధ్రపురాణ పఠనం వలన 'ఇడుములుపడి దేశసేవ చేసి స్మరణీయు లైన ఆంధ్రు లను' తలచు కొనేటట్లుగా వ్రాసి 'గాజు కన్నైనా నొక యశ్రుకణంబు రాల్చునట్లుగా చేసిన రచన ఆంధ్రపురాణం అని మధుస్మృతి పుస్తకంలో తెలుసుకుని ఆ గ్రంథాన్ని పాఠకులు చదివే టట్లు చేస్తుంది.

మధునాపంతులవారు వ్రాసిన 'ఆంధ్ర రచయితలు' అనే గ్రంథంలో వారే చెప్పినట్లుగా రచయితల స్థానాన్ని సాహిత్య చరిత్రలో వారే పదిల పరచుకున్నారనే దానికి ఉదాహరణగా ఆంధ్ర పురాణము, మధుస్మృతి నిలుస్తాయి. మధునాపంతులవారి మానస పుత్రికయైన 'ఆంధ్రీ కుటీర' విహారభ్రమరమైన సన్నిధానం శర్మ ఆంధ్రీ పత్రిక పత్రాలలోని ఆంధ్రపురాణాన్ని చదివిన నాటి పండిత కవుల వ్యాసంగ చమత్కార చరిత్రను ప్రోది చేసుకున్న సాహిత్య చరిత్రను తెలిపేది ఈ మధుస్మృతి.

మధునాపంతులవారు 'నిద్రలో కలవరించిన ఊహలే ఆంధ్రీ పత్రికలో అభ్యుదయం పొంది' ఆంధ్రపురాణ రూపంలో పాఠకుల ముందు సాక్షాత్కరించింది. ఊహలే ఆంధ్రుల చరిత్ర అవటం, ఆ చరిత్రయే సాహితీ రూపాన్ని పొందటం వాస్తవం అయింది. 1946వ సం॥లో ఆంధ్రపురాణం అడుగులు వేసిన యేడాదికే, దేశానికి స్వాతంత్ర్యం రావటం ఒక కొండ గుర్తు. అందుకే ఈ మధుస్మృతి పాఠకులను ఆంధ్రపురాణపు గాథల కొండ గుర్తుల నడుమ కూర్చో పెడుతుంది.


మధుస్మృతిలో సన్నిదానం ఉటంకించిన సినారె మాటలను 'జడలు కట్టినట్లున్న ఆంధ్ర చరితమును దువ్విదువ్వి అరీణ శిల్పక ధురీణ పురాణముగా తీర్చినావు' అని తెలియచేసినప్పుడు పాఠకుల మనస్సులో అక్షయపాత్రలోని ఆంధ్రపురాణపు మధువును ఆస్వాదిం చాలనే భావన ఏర్పడక తప్పదు. మధునాపంతులవారి సాన్నిధ్యంలో గడిపిన సన్నిధానం వారి ఉటంకింపుల వలన మాత్రమే 'ఆంధ్ర పురాణ' వైశిష్ట్యం అర్థం కాగలుగుతుంది. కాబట్టి ఈ మధు స్మృతి అనే రచన మధునాపంతులవారి సాహిత్య మధువును ఆస్వా దించ టానికి లభించిన ఒక అరణము (దోనె) గా భావించవచ్చు.

సన్నిధానంవారు మధునాపంతులవారిని స్మరించుకునేటట్లుగా 'చూడనెవ్వరిదైన చోద్య జీవనంపు జాడలు మిగిలించి సాగు ప్రయాణం' గా ఈ మధుస్మృతి రచన పాఠకుల మనస్సులో ముద్ర వేస్తుంది కాబట్టి ఆంధ్ర సాహిత్యాభిమానులందరు చదువదగినదిగా భావించాలి.


- జె.కనకదుర్గ
9491140299

పుస్తక పరిచయం

# డా॥ కత్తి పద్మారావు రచనలు : వ్యక్తిత్వ నిర్మాణం 4, 5 భాగాలు



ప్రపంచ విజేతలు-5 వ్యక్తిత్వ నిర్మాణం పుటలు :696 వెల : 500/-



ప్రపంచ విజేతలు-4 వ్యక్తిత్వ నిర్మాణం పుటలు :604 వెల : 600/-

ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి
లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం, అంబేద్కర్ కాలని, పొన్నూరు - 522 124,
గుంటూరు జిల్లా ఫోన్ : 9849741695
మరియు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; ప్రజాశక్తి, నవోదయ బుక్‌స్టాల్, నవచేతన,
నవతెలంగాణా అన్ని పుస్తకాల షాపులు

తెలుగునాట కత్తి పద్మారావు పేరు తెలియనివారు జన జీవన రంగాల్లో ఏ మాత్రం సంబంధం వున్నవారిలో ఎవరూ ఉండరు. కుల వివక్షను, ఆధిపత్య వర్గాల అరాజకాలనూ ఎదుర్కొనేందుకు ఉద్యమాలు నడిపిన కత్తి పద్మారావుగారు సంస్కృత ఉపాధ్యాయుడుగా, తెలుగు కవిగా, రచయితగా, ఉపన్యాసకుడుగా ఖ్యాతిగాంచిన వ్యక్తి. ఒక రచయితగా ఇప్పటికి 71 రచనలు చేసి, వాటిని తానే ప్రచురించిన దక్షుడు. రచయిత తానుగా పుస్తకాన్ని ప్రచురించుకొని, దానిని జనంలోకి తీసుకు వెళ్లడం, మరల వాటిని పునర్ముద్రించడం ఎంతో అరుదుగా జరిగేపని. కాని, ఎంతో అనుచర వర్గం, ఎందరో పాఠకులు కలిగిన డా॥ కత్తి పద్మారావుగారికి అది నిరంతరాయంగా చేస్తున్నపని.

'ప్రపంచ విజేతలు వ్యక్తిత్వ నిర్మాణం' పేర గత ఐదేళ్లుగా ఆయన చేపట్టిన వరుస పుస్తకాల రచన విజయవంతంగా సాగుతూనే ఉంది. 2014 లో తొలి గ్రంథాన్ని విడుదల చేశారు. 2018 లో 4వ పుస్తకాన్ని, 2019 లో 5వ పుస్తకాన్ని విడుదల చేశారు. ప్రతి పుస్తకం 600 - 700 పుటలతో అందంగా ముద్రించబడింది.

4వ పుస్తకంలో అల్బర్ట్ ఐన్‌స్టీన్, సిగ్మండ్ ఫ్రాయిడ్, సైమన్ డి బిరో, నెల్లీ సాచెస్స్, ఫెడరల్ కాస్ట్రో వంటివారి జీవితాలను ఆధారంగా తీసుకొని వ్యక్తిత్వం నిర్మాణ అంశాలను అనేక విధాల ప్రస్తావనలు చేశారు. 5వ పుస్తకంలో మహాత్మ పూలే, డా॥ బి.ఆర్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, ఖలీల్ జిబ్రాన్, శరత్‌బాబుల జీవితాలను ప్రధానంగా తీసుకొని, వ్యక్తిత్వ నిర్మాణంలోని వివిధ అంశాలను వివరించారు. ఏదో జీవిత చరిత్రను చెప్పుకుపోయినట్లు గాకుండా, ఎన్నో కోణాల నుండి విడివిడిగా ముఖ్యాంశాలను వెన్న ముద్దలను నోటికి అందించినట్లు తెలియజెప్పడంతో పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకూ, నాయకత్వ లక్షణాలను నేర్చుకోవడానికీ ఈ రచనలు ఎంతో ఉపకరిస్తాయి. వీటిని ప్రతి ఒక్కరూ చదవడం, ఈ పుస్తకాలను కొని, తమ ఇంటి గ్రంథాలయంలో ఉంచుకోవడం కుటుంబ సభ్యుల బహుముఖ వికాసానికి సాయపడుతుంది.

---

**( 39 వ పుట తరువాయి)**

దినమూ కలలే.

ఇంకొకనికి ఇంకో తరా కల. బలిసిన (ముదిరిన) మామిడి కాయలను మానుల నింకా దించి తెచ్చి, గుట్టుగా కసువువామిలోకి దోపినట్లు, నాలుగునాళ్లు అయినంక చెయ్యి దోపితే చేతినిండా పండ్లు దొరికినట్లు. మూడోవానికైతే తోటల్లోని దోసకాయల్నంతా పీక్కొని తిన్నట్లు, తెంకాయ మానుల్ని ఎక్కి ఎలనీర్లని (కొబ్బరి బోండాలు) తాగినట్లు కలలు.

ఒకనాడు సంతకొచ్చిన మాయబ్బ మా దగ్గరకి వచ్చినాడు. మేము ముగ్గురమూ మా కోరికను చెప్తిమి. "ఏమంట్రా, అపుడే ఊరిమింద గేనం (జ్ఞాపకం) పడిపోయెనా, సరే మేస్టర్ని రానీయండ, అడిగి సూస్తాను" అన్నాడు. ఐస్కూలునింకా గురువుగారు రానేవచ్చిరి. అవీ యివీ మాట్లాడినంక మా కోరికను చెప్పిరి మాయబ్బ. "సరే తోడుకొని పొయి, రెండుమూడు దినాలు పెట్టుకోని, అనెంక ఇక్కడికి తరమండ, అక్కడ్నే పెట్టుకోని ఉండిపోవద్దు" అనిరి గురువుగారు.


ఊరికొచ్చినంక మూన్నాళ్లు ఊర్లో మాదే దర్బారు. "సిన్నోళ్లు వచ్చిందారు, అట్లే రేపు మునేశ్వరునికి దేవర చేసేస్తాము. పెద్ద కోడిపుంజును మునేశ్వరునికి యిడిసిపెట్టిందాము కదా" అని ఒకింట్లో, "ఒబ్బట్లు కాల్చియ్యాలమ్మో, పాపం బిడ్డ ఇంకెపుడొస్తాడో ఏమో, ఆ పేటలో ఒబ్బట్లు (బొబ్బట్లు) సిక్కుతాయా ఏమన్నానా" అని ఇంకొకింట్లో అనుకొంటా ఉండారు. మేము ఒకనాడు మా జతగాళ్లతో కలిసి ఆవుల్ని మేపేకి పోతిమి. పేటలోని విశేషాలనంతా వాళ్ల తావ చెప్తిమి. ఊర్లో నడిచిన కొత్తకొత్త సమాచారాల్నంతా మాకు చెప్పిరి. ఇట్ల మూడునాళ్లు ఊర్లో ఆనందంగా గడిపితిమి. ఆ మూడోనాడు మాపుసరే మాపు పొట్టి శ్రీరాములుగారు చనిపోయిన సంగతి తెలిసింది. నాలుగోనాడు, మా ఇండ్లల్లో ఇచ్చిన చిక్కుడుకాయల్నీ ఏళి (నారింజ) కాయల్నీ గుమ్మడికాయల్నీ పుట్టగోకుల్నీ మూటలు కట్టుకొని మోసుకొంటా వచ్చి మా గురువింటికి చేరుకొంటిమి.

"ఏమిరా ఊరి బెమ తీరెనా, ఇంక ఇపుడపుడే ఊరికి పోవాలని అడగకూడదు సరేనా" అంటా ఎదురొచ్చి మా తలల మీది మూటల్ని దించి పెట్టిరి గురువుగారు.

**(తరువాయి రాబోయే సంచికలో...)**

ప్రుస్తక సమీక్ష

# వాళ్లు గెలవాలి(నవల)




రచన : శిరంశెట్టి కాంతారావు
వెల : 150/-
ప్రతులకు : ఇం.నెం. 1-1-177
మమతల కోవెల, శ్రీనివాసపురం కాలని, పాత పాల్వంచ 507115, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం
ఫోన్ : 9849890322.
మరియు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో.

'ఎరుకల' సామాజిక వర్గానికి చెందిన ఒక గిరిజన కుటుంబం, అడుగడుగునా ఎదురయ్యే ఓటముల్ని అధిగమించి జీవితాన్ని గెల్చుకోటానికి పట్టుదలతో ప్రయత్నించి గెలిచిన – జీవన పోరాటం – ఈ నవలలోని వస్తువు. 'నవ తెలంగాణా' దినపత్రిక మూడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందింది. అణగారిన జీవితాలపై వెలుగు ప్రసరించి, వారి జీవన యానాలను సమాజానికి తెలియచేయాలన్న దృఢ సంకల్పంగల రచయిత శిరంశెట్టి కాంతారావు.

'ఆకుపచ్చ విధ్వంసం' నవల ద్వారా ఉత్తరాంధ్ర భూముల్లో థర్మల్ పవర్ ప్రాజెక్టు స్థాపనకోసం పాలకులు సృష్టించిన విధ్వంసం తెలిసి, సోంపేట వెళ్లి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతో మమేకమై, అన్ని కోణాలలోను అధ్యయనం చేసి ప్రశంసలు పొందిన రచయిత కాంతారావు. 'వ్యూహం' 'పూలకుండీలు' (నవలలు) 'కంచిమేకలు' మొ॥న 6 కథా సంపుటాలలో కూడా రచయితకు ఉన్న సామాజిక స్పృహ మనకు గాఢంగా కన్పిస్తుంది. కథగానీ, నవలగానీ – సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక వచన రచనా సాహిత్య ప్రక్రియలో విశేషంగా కృషి చేస్తున్నారు రచయిత.

903 దక్షిణ భారతంలోని ఆదివాసీలలో ఎరుకల వాళ్లు చాల ప్రధానమైనవారు, అతి ప్రాచీన ఆదివాసీలు వీరు. వీరి సంఖ్య ఎక్కువ. స్వాతంత్ర్యానంతరం ఆదివాసీలలో కొంత అభివృద్ధి జరిగినా, వారి
మ భూములు అన్యాక్రాంతమౌతున్నాయి. ముఠాదార్లు, వడ్డీ వ్యాపారులు, భూస్వాములు వీళ్లకు అన్యాయం చేశారు.

రాజ్యాంగపరంగా షెడ్యూల్డు తెగలుగా గుర్తించబడినా వారు ఎదగాల్సినంతగా సమాజం ఎదగనీయడం లేదు. సాంఘికంగాను, ఆర్థికంగాను అన్నిరంగాల లోను ఉపేక్షింపబడి, విద్యకు, ఉద్యోగాలకు దూరమై దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు.

ఈ ప్రతికూల పరిస్థితులలో ధైర్యంగా ఎదుర్కొంటూ, ప్రాణాలకు కూడా తెగించి చదువుకోవటానికి పడిన శ్రమ, చదువు సహాయంతో అందుకునే ఫలితాలను అందనివ్వకుండా గిరిజనేతరులు కల్పించిన అవరోధాలు అన్నీ అధిగమిస్తాడు వెంకటయ్య. ఆ వూరికి టీచర్లుగా వచ్చిన జాన్సన్ దంపతులు ఇంటిలో పెద్దకొడుకు వాసుని పనికి, చదువుకి పెట్టి, పిల్లలు చదువుకుంటే ముందుముందు మంచిగ బతుకుతారు అని నమ్మిన వెంకటయ్య పిల్లల చదువుకి ప్రాధాన్యం యిస్తాడు. పెద్దకొడుకు చదివి ప్రయోజకుడై కుటుంబ బాధ్యతలు వహించి, ఆ కుటుంబం సామాజికంగాను, ఆర్థికపరంగాను ఎదురైన సమస్యల పరిష్కారంలో కృషిచేస్తాడు.

వెంకటయ్య రెండవ కుమారుడు దేవేందర్, వాళ్ల బజారులో ఉండే 'సాలె' వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించటం, ఆ వ్యవహారం కుల / ఊరు పెద్దలకు నచ్చక పోవడంతో జరిగిన ఘర్షణలలో, తాము మేజర్లమని చదువుకున్న సర్టిఫికెట్లలోని జనన తేదీలను చూపి, పోలీసుల కేసునుండి తప్పించుకుని దూరంగా వెళ్లి పోయి వివాహం చేసుకుంటారు.

ఆ క్రమంలోనే వెంకటయ్యను ఇట్లా వాకిలి భూమి వదిలి పోయే భయానక స్థితిని దొరలు, రాజకీయ నాయకులు కలిగించినా, స్థిరంగా నిలబడి, ధైర్యంగా ఎదుర్కొంటారు. 'పోరాటం' ద్వారా కాదు 'పార్లమెంటరీ' విధానాల ద్వారానే అణగారిన వర్గాలు జీవనయానం సాగించాలని నమ్మిన వెంకటయ్య, వాసు పాత్రల ద్వారా రచయిత సందేశాన్నిస్తారు. న్యాయస్థానం, ట్రైబల్ కోర్టు ద్వారా తాము న్యాయ పోరాటం చేసి గెలవాలని ప్రయత్నం చేసి, కుటుంబమంతా ఒక్క త్రాటిపై నడుస్తుంది.

ఎరుకల సామాజిక జీవనాన్ని, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను ప్రత్యక్షంగా చూసి అవగాహన చేసుకుని వాటికి అక్షరరూపం యిచ్చారు రచయిత. పాత్రోచితమైన భాష, కమ్మటి తెలంగాణా నుడికారాలతో, ఎరుకల జీవితాల్లోని సామాజిక చలనాలని, స్వీయ కల్పనలకు చోటు ఇవ్వకుండా అక్షరబద్ధం చేసారు.

అట్టడుగు వర్గాలు తమకు జీవితం అనే అంతులేని పోరాటంలో ఎదురయ్యే అవరోధాలు, ఓటములు మొపపవి అధిగమించి గెల్చి, సార్థకత సాధించ టానికి ఒక నిర్దిష్టమైన మార్గం చూపే ప్రయత్నం చేసిన రచయిత కృషి అభినందనీయం.

'ఎరుకల' వంటి సామాజిక వర్గాలు, తెగల వారు అభివృద్ధికై, చట్టబద్ధమైన హక్కులు, వాటి సాధనకై చేయవలసిన ప్రయత్నాల గురించి తెలుసుకోటానికి ఈ నవల ఎంతో సహాయకారి అవుతుంది.

– ఎం.వి.శాస్త్రి
9441342999

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహించిన గిడుగు రామమూర్తి జయంతి సభ




# హైదరాబాద్ విశ్వవిద్యాలయ అనువర్తిత భాషాశాస్త్ర అనువాద అధ్యయన కేంద్రంలో గిడుగు రామమూర్తి జయంతి






తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయ అనువర్తిత భాషాశాస్త్ర అనువాద అధ్యయన కేంద్రంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఒక సమావేశం జరిగింది. దీనికి మానవీయశాఖ డీన్ ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి ముఖ్య అతిధిగానూ, కేంద్ర అధ్యక్షులు ఆచార్య రాజ్యరమ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో ఆచార్య ఉమామహేశ్వరరావు, ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, ఆచార్య ప్రభాకరరావు, ఆచార్య సుబ్బాచారి, ఆచార్య హయాథ్, డా. అనురాధ తదితర పరిశోధకులూ, విద్యార్థి మిత్రులు పాల్గొన్నారు.

ఇందులో ప్రధానంగా ప్రస్తుతం తెలుగు భాషా మాధ్యమంగా తెలుగు వెనకబాటుపై చర్చ జరిగింది. తెలుగు వాడటంలో న్యూనతా భావాన్ని పోగొట్టుకోవాలని శరత్ జ్యోత్స్నారాణి అన్నారు. ప్రస్తుతం నడుస్తున్న తెలుగు భాషా విలాపాన్ని కట్టడి చేయాలంటే యువత కలిసికట్టుగా ఉద్యమ రూపంలో ముందుకురావాలనీ పేర్కొన్నారు. ఆచార్య రాజ్యరమ ఇలాంటి సమావేశాలు ఏడాదికి ఒకటిగాకాక నెలకు రెండు మూడు పెట్టుకొని విద్యార్థులందరూ పాల్గొని సమాజాన్ని చైతన్యవంతం చేయాలని సూచించారు. డా. అనురాధ మాట్లాడుతూ మాతృభాషలకోసం పోరాటం చేయటానికి జాతీయ స్థాయిలో ఒక పోరాట సంఘాన్ని ఏర్పరుచుకోవాలని చెప్పారు. ఆచార్యసుబ్బాచారి మాట్లాడుతూ తెలుగు మాధ్యమం వెనకబాటుకు విద్యారంగంలో వ్యాపారధోరణి పెరగటమే కారణం అని తెలియజెప్పారు. ఆ పైన విద్యార్థులు ఎందరో ఆంగ్లభాషా మాధ్యమంతో వచ్చిన తంటాలపై అనేక అభిప్రాయాలు వెలిబుచ్చారు. చివరికి సమావేశం గిడుగు రామమూర్తిగారి స్ఫూర్తిని అందిపుచ్చుకొని తెలుగు మాధ్యమాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు పునరంకితం కావాలంటూ ముగించారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
September 2019 Vol :5, Issue 7
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244